# గోపన్న చెప్పిన కథలు

కథలు

- నాగ మురళీధర్ నామాల



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 85

తెలుగు గడపల్లో కథ అనే ఊహకు రూపం చిగురించిందే "అనగనగా ఒక రాజు" అనే ఏడుగురు రాకుమారుల కథతో. బామ్మ, తాతయ్య నిద్రపుచ్చే వేళ చెప్పిన ఆ రాకుమారుల కథల్లో మనం ఒదిగిపోయి అందమైన లోకాల్లో విహరించాం, వింత జంతువుల్ని కలిసాం, మాట్లాడే పక్షులతో స్నేహం చేసాం, ఎన్నో అద్భుతాలు చూసాం, బ్రహ్మరాక్షసులు ఎదురైతే మన పరాక్రమాన్ని ప్రదర్శించాం.
మనల్ని చిన్నపిల్లల్ని చేసి కేరింతలు కొట్టించిన ఆ కథలే, మన ఊహాశక్తిని పెంచాయనేది కాదనలేని వాస్తవం. బాల్యమనే బంగారుదశ వీడి, వేగవంతమైన వాస్తవ జీవితాల్లో పడి పాపం ఆ రాకుమారులను, అందమైన రాకుమార్తెలను, ఒంటికన్ను రాక్షసులను ఒంటరిగా ఆ మాయాలోకాల్లో వదిలేసాం. తమతో ఆడి, పాడే తోడెవరూ లేక దిగులు చీకటి కమ్ముకున్న ఆ నేస్తాలను తిరిగి పలకరించే ప్రయత్నమే ఈ గోపన్న కథలు.

**అనగనగా కళింగదేశమనే** సువిశాల సామ్రాజ్యం ఉండేది. సుకేతుడనే ప్రభువు ఆ రాజ్యాన్ని పరిపాలిస్తూ ఉండేవాడు. గంగా, గోదావరి వంటి జీవనదులతో, సువిశాలమైన అడవులతో, పాడిపంటలతో ఎప్పుడూ సుభిక్షంగా ఉండేది కళింగరాజ్యం. ప్రజల క్షేమమే తన ధర్మంగా, వారి సుఖశాంతులు తన బాధ్యతగా భావించి ప్రజారంజకంగా పరిపాలించేవాడు సుకేతుడు. యజ్ఞయాగాదులు, క్రతువులు క్రమం తప్పకుండా జరిపించేవాడు. రాజ్యహితాన్ని కోరి యాగాలు నిర్వహించే బ్రాహ్మణులకు భుక్తికి లోటు లేకుండా దానధర్మాలు చేసేవాడు. క్రమం తప్పక తన రాజ్యంలో ఉన్న ఆశ్రమాలను సందర్శించి ఆశ్రమవాసం యోగక్షేమాలు తెలుసుకునేవాడు. రాజ్యంలో దేవాలయలన్నీ నిత్యం దీపధూప నైవేద్యాలతో కళకళలాడేందుకు సరిపడా మాన్యాలిచ్చేవాడు. చోరులను, రాజద్రోహులను కఠినంగా శిక్షించేవాడు.

సుకేతుడి పట్టమహిషి సుమతి అతడికి అన్నివిధాల సరిజోడి. రాజ్యభారంతో నిత్యం సతమతమయ్యే ప్రభువుల యోగక్షేమాలు దగ్గరుండి చూసుకునేది. ఆ దంపతులకి ముచ్చటగా ముగ్గురు కుమారులు విక్రమసేనుడు, సుసేనుడు, చిత్రసేనుడు. ముగ్గురూ విద్యాభ్యాసానికి కళింగరాజ్యానికి దూరంగా ఉన్న శివదత్తుడనే గురువు ఆశ్రమానికి వెళ్ళారు. సుకేతునికి వేటయందు వినోదము కాని, యుద్ధమునెరపి ఇతర రాజ్యాలను ఆక్రమించుటలో కాని ఆసక్తిలేదు. పండితగోష్టి, ఆధ్యాత్మిక చింతనయందే అతని ఆసక్తి. కులదైవమైన వ్యాఘ్రేశ్వర స్వామి ఉత్సవాలు ఏటేటా కార్తీకమాసంలో కన్నులపండువగా జరిపించేవాడు.

అది ఒక నిండు కార్తీక పౌర్ణమి రాత్రి, సతీ సమేతంగా వ్యాఘ్రేశ్వర స్వామి దర్శనం చేసుకుని అంతఃపురానికి చేరుకున్నాడు సుకేతుడు. ఆ తన్మయత్వంలో అలానే నిద్రకు ఉపక్రమించాడు. రాత్రి మూడవ జామున అతడొక వింత స్వప్నాన్ని చూసాడు. ఆ స్వప్నంలో సుకేతుడు ఒక తెల్లని అశ్వాన్ని అధిరోహించి వనాల్లో విహరిస్తున్నాడు. అతడి శరీరం సువర్ణమయకాంతితో మెరుస్తోంది. అతని వదనం మిక్కిలి ప్రసన్నంగా ఉంది. అలా ముందుకు సాగుతున్న సుకేతునికి కాస్త దూరంలో దవళకాంతులతో వెలిగిపోతూ, నిలువెల్లా పాల నురగవంటి తెల్లని వస్త్రాలు

ధరించిన ఒక స్త్రీ ఎదురయ్యింది. ఆమె నడుస్తున్న బాటంతా వెలుగు పరుచుకుంటోంది. ఆమె చేతులతో స్పృశిస్తుంటే వనమంతా సరికొత్త చైతన్యంతో శోభిస్తోంది. ఆమె మందస్మిత వదనంతో సుకేతుడ్ని ఒకే ఒక్క క్షణం చూసి, ముందుకు సాగిపోయింది. ఆ చూపులలోని తీవ్రత సుకేతుడ్ని పట్టిలాగింది. సుకేతుడు ఆమెను చేరుకోవాలని తన గుర్రాన్ని అటువైపు దౌడు తీయించాడు. ఆమె మేఘాలలో తేలుతున్నట్టుగా ముందుకు సాగిపోతోంది. సుకేతుడు వేగం హెచ్చించాడు. ఎంత ప్రయత్నించినా ఆమెను చేరుకోలేకపోయాడు. కాసేపటికి దట్టమైన పొగమంచు అలముకొంది. ఆ మసక వెలుతురులో ఆమె అదృశ్యమయ్యింది.

ఆ స్వప్నాన్ని చూస్తున్నంతసేపు అతడి మనసు అవ్యక్తానుభూతికి లోనయ్యింది. అతడు అంత ప్రశాంతతను, ఆనందాన్ని ఇదివరకెన్నడూ అనుభూతి చెందలేదు. మరుసటి దినమంతా అదే అనుభూతిలో గడిపాడు. ఆ రోజు మొదలు అతడికి ప్రతిరాత్రి ఆ స్వప్నం గోచరమయ్యేది. క్రమంగా అతడికి ప్రాపంచిక విషయాల పై ఆసక్తి సన్నగిల్లింది. పరిపాలననూ, మంత్రాంగాన్ని పక్కనపెట్టేసాడు. ప్రభువుల ఈ స్థితి గమనించి పరివారం, రాజ్యంలోని ప్రజలు మిక్కిలి ఆందోళన చెందారు. ప్రభువులకు తమ ఆందోళనను చెప్పుకోవాలని అందరూ రాజభవనానికి చేరారు.

తండోపతండాలుగా తరలి వచ్చిన పురజనుల్ని చూసి విషయమేంటని విచారించాడు సుకేతుడు. ప్రభువులు నిత్యం అన్యమనస్కులై ఉండటం, రాజ్యపాలనను విస్మరించటం అందోళన కలిగిస్తున్నదని చెప్పుకున్నారు ప్రజలు. సుకేతుడు వెంటనే పండితులను, మునులను, మహర్షులను పిలిపించాడు. తనకు నిత్యం సాక్షాత్కారమవుతున్న స్వప్నం గూర్చి, దాని వలన తన మానసికస్థితిలో వచ్చిన మార్పు గూర్చి వివరించాడు. స్వప్నం యొక్క అంతరార్ధాన్ని, తన తక్షణకర్తవ్యాన్ని నిర్దేశించమని వారిని కోరాడు. పండితులు, మునులు ఎంతో తర్కించిన పిమ్మట ప్రభువులు స్వప్నంలో చూసినది గంగాదేవియని, గంగానది సందర్శనం, పుణ్యస్నానమాచరించటమే ప్రభువులు చెయ్యవలసిన కర్తవ్యమని చెప్పారు.

తాను స్వప్నంలో కాంచింది గంగాదేవియేనని తెలియగానే సుకేతుడు లేచి నిలబడి “పండితులు, పురోహితులు నా క్షేమం కోరి పరిహారం మాత్రం సెలవిచ్చారని అర్థమయ్యింది. నిజానికి ఆ స్వప్నానికి అర్థం నాకు తెలిసొచ్చింది. సర్వేశ్వరుని పిలుపయ్యింది, నేను వానప్రస్థానికి వెళుతున్నా” అని లేచి నిలబడి కట్టుబట్టలతో ప్రజల ఆక్రందనలను సున్నితంగా తిరస్కరిస్తూ ముందుకు సాగిపోయాడు. అంతఃపురంలో విషయం తెలుకున్న సుమతి పరుగు పరుగున వచ్చి సుకేతుడ్ని చేరుకుని, అతని అడుగుజాడలనే అనుసరించింది.

యావత్తు రాజ్యప్రజలు, పరివారం అతని వెంట నడుస్తూ కన్నీరు పెట్టుకున్నారు. మహారాజును, మహారాణిని నిలువరించే ప్రయత్నం చేసారు. సుకేతుడు కనీసం వెనుదిరిగి చూడకుండా ముందుకు సాగిపోయాడు. ప్రజలంతా నగర పొలిమేర వరకూ నడిచి అక్కడే ఆగిపోయారు, పరివారం మరికొంత దూరం మహారాజు వెంటే నడిచి విచారంతో వెనుదిరిగారు.

మహామంత్రి, ముఖ్య రాజోద్యోగులతో రహస్యమంతనాలు జరిపి రాజకుమారులను తక్షణమే తిరిగి రావాల్సిందిగా గురుకులానికి కబురు చేసాడు. రాజకుమారులను భద్రంగా తోడ్కొని వచ్చేందుకు అత్యంత నమ్మకస్తులైన నలుగురు అంగరక్షకులను పంపాడు. అంగరక్షకులు గురుకులాన్ని చేరేసరికి చీకటిపడింది. ఆ రాత్రివేళలోనే అత్యవసరంగా గురువైన శివదత్తుడ్ని కలుసుకుని జరిగిన వృత్తాంతం విన్నవించారు అంగరక్షకులు. విషయం తెలిసిన రాజకుమారులు తండ్రిని, తల్లిని తలచుకుని మిక్కిలి కలత చెందారు. ఏకధారగా ఏడుస్తున్న రాకుమారుల్ని

శివదత్తుడు అనునయించి "కుమారులారా, బేలతనం కూడదు. రాజ్యానికి, రాజ్యంలోని ప్రజలకి ఈ ఆపత్సమయంలో ధైర్యాన్ని, నమ్మకాన్ని కలిగించాల్సిన మీరే ఇలా వ్యాకులపడితే అది రాజ్యానికి క్షేమం కాదు. మీరు నేర్చుకున్న విద్యలకు సార్ధకత కల్పించాల్సిన సమయం ఆసన్నమయింది. దేవదేవుడు మీయందుండి ముందుకు నడిపిస్తాడు. ఈ రాత్రికి విశ్రమించి ఉదయాన్నే రాజ్యానికి ప్రయాణంకండి" అని ఆశీర్వదించాడు. విచారవదనాలతోనే రాజకుమారులు విశ్రాంతిమందిరం వైపు కదిలారు. అంగరక్షకులు విశ్రాంతిమందిరం బయట రక్షణగా నిలుచున్నారు.

కావలి కాస్తున్న అంగరక్షకులకు నడిజాములో గుఱ్ఱపు డెక్కల శబ్దం వినిపించి అప్రమత్తమయ్యారు. శబ్దం వచ్చినవైపు ముందుకు కదిలారు. గుఱ్ఱం పై వచ్చినవాడు గూఢచారి. వగరుస్తూ వచ్చి కూలబడ్డాడు. వాడికి త్రాగేందుకు నీరిచ్చి, విషయమేంటని అడిగారు. మహారాజు నిష్క్రమణ విషయం చారుల ద్వారా విన్న పొరుగుదేశపు రాజు భైరవవర్మ, కళింగ సామ్రాజ్యం పై మెరుపుదాడికి తెగబడి మంత్రి సహా సమస్త పరివారాన్ని బంధించాడని, రాకుమారులను హతమార్చేందుకు ఒక దళాన్ని పంపాడని చెప్పాడు గూఢచారి.

అంగరక్షకులు పరుగున వెళ్ళి జరిగిన విషయం శివదత్తునికి చెప్పారు. శివదత్తుడు అందరిని అప్రమత్తం చేసి, రాకుమారులని పిలిచి "రాకుమారులారా, కళింగకు తూర్పున ఉన్న నాగావళి నదీతీరంలో గోతీర్ధమనే అగ్రహారముంది. గోపాలురు నివసించే ఆ అగ్రహారం ఎవరి ఏలుబడికి చెందని స్వతంత్ర్యగ్రామము. ఆ అగ్రహారంలోనే మీ తండ్రిగారి చిరకాల మిత్రుడు గోపన్న నివసిస్తున్నాడు. గోపన్నకు మీ తండ్రిగారంటే ఎనలేని అభిమానం. అయనే ఆ గోపాలురకు కులపెద్ద. తక్షణమే ఆ అగ్రహారానికి పోయి ఆయన ఆశ్రయం పొందండి. ప్రస్తుతానికి అదే మీకు క్షేమం" అని వీడ్కోలు పలికి క్షేమంగా సాగనంపాడు.

అంగరక్షకులు వెంటరాగా రాత్రంతా ప్రయాణం చేసిన రాకుమారులు సూర్యోదయం అవుతుండగా నాగావళి నదీతీరానికి చేరుకున్నారు. ప్రయాణ బడలిక వలన అలసిన రాకుమారులు నాగావళినదిలో దిగి స్నానాదికాలు చేస్తుండగా వారికి జానపదుల పాటలు దూరంగా వినిపించాయి.

"అడవి లోన ముసలిగెద్దకెవరు తెలివి సెప్పేరా

మడుగులోన మొసలిపడుచుకెవరు ఒడుపు నేర్పేరా

ఒంటికాలి దొంగజపం కొంగకెటుల తెలుసురా

మడిసితోటి చుట్టరికం కొతికెవుడు పెట్టెరా

తందనాన తానానే తందనాన

తందనాన తారారో తందనాన

నల్లనోడే ఆ నల్లనోడే

అన్నిటికి ముడులేసే అల్లరోడే”

జానపదాలు వినిపించిన వైపు నడిచిన రాకుమారులకు గోమందలు పచ్చిక మేస్తూ కనిపించాయి. గోవులను అదిలిస్తూ కొందరు గోపాలురు కనిపించారు. ఒక పెద్ద మఱ్ఱిమాను నీడన ఒక పెద్దాయన సేదతీరుతూ పాడుకుంటున్నాడు. రాకుమారులు, అంగరక్షకులు ఆ వృద్ధుడ్ని సమీపించారు. పాలనురగలా నెరసిన గిరజాలు, మేలినలుపురంగులో మెరుస్తున్న కఱ్రవంటి దేహం, ముడతలు పడిన చర్మం అతడి వార్ధక్యాన్ని సూచిస్తున్నా, గొప్ప తేజస్సుతో వెలుగుతున్న అతడి ముఖంలో ఆ ఛాయలు లేవు. రంగుల తలపాగా చుట్టుకున్నాడు. మోకాలి వరకూ ధోవతి చుట్టుకున్నాడు. భుజంపై కంబళి వేసుకున్నాడు. ముక్కున, చెవిన వెండి జూకాలు వేలాడుతున్నాయి. కాళ్ళకు వెండి కడియాలున్నాయి. నుదుటిపైన వెంకన్న నామాలున్నాయి.

రాకుమారులను చూడగానే ఆ వృద్ధుడు లేచి పరుగున వారి వద్దకు వచ్చాడు. వారితో వినయంగా "ఎవరో రాచబిడ్డల్లా ఉన్నారు. అడవిలోగాని దారి తప్పారా సామి?" అని వాకాబు చేసాడు. రాకుమారుల్లో పెద్దవాడైన విక్రముడు " అయ్యా, మేము కళింగ ప్రభువులు సుకేత మహారాజుగారి పుత్రులం. ఆయన చిరకాల మిత్రులు గోపన్నగారిని కలవాలని వచ్చాం" అని చెప్పాడు.

వృద్ధుడు ఆనందంతో "నేనే బాబు గోపన్నని. ధర్మప్రభువులు మహారాజుగారు కులాసాగా ఉన్నారా? దయతో ఈ గోపన్నకు ఏదైనా కబురు సెలవిచ్చారా? దయచేయండి. దయచేయండి " అని రాకుమారులను ఆహ్వానించాడు. గోవులను కాస్తున్న యువకులను ఒక్క కేకలో పిలిచి రాకుమారుల కోసం తియ్యని ఫలాలు, పుట్టతేనె తెమ్మని పురమాయించాడు.

దుఃఖాన్ని అదుపులో తెచ్చుకుంటూ విక్రముడు గోపన్నకు జరిగిన విషయాలు చెప్పాడు. విషయం విన్న గోపన్న పండుటాకులా కదిలిపోయాడు. విచారంతో ఉన్నచోటనే కూలబడిపోయాడు. గోపయువకులు పరుగున వచ్చి అతడికి సపర్యలు చేసారు. కాసేపటికి తేరుకున్న గోపన్న వాత్సల్యంతో రాకుమారులకు ఫలాలు, తేనె అందించాడు. రాత్రంతా ప్రయాణం చేసిన శ్రమవలన ఆకలిగా ఉన్న రాకుమారులు, అంగరక్షకులు కడుపారా ఆరగించారు.

వారి నిద్రావస్థను గ్రహించిన యువకులు ఆ మఱ్ఱిచెట్టు నీడనే తమతో తెచ్చిన గొంగళ్ళు పరిచి నిద్రకు ఏర్పాట్లు చేసారు. "అయ్యలూ, అడవి మాతల్లి చల్లని గాలితో మన కష్టాల్ని మాపేసి జోలకొడతాది. చింతలన్నీ మరిచి కాసేపు కునుకు తియ్యండి. బడలిక తగ్గాకే ఊరి వైపు పోదాం" అని రాకుమారులతో చెప్పాడు గోపన్న. ఆ చల్లనిగాలికి రాకుమారులంతా దుఃఖం మరిచి అక్కడే నిద్రలోకి జారిపోయారు. అంగరక్షకులను కూడా నిద్రపొమ్మని చెప్పి గోపయువకులే కాపలాగా నిలిచారు. గోపన్న పాటే ఆ పూట అందరికీ జోలపాటయ్యింది.

“ముంతలో చల్లను త్రాగేసింది

కళ్ళుమూసి దొంగపిల్లి

ఒంటికోడి పిల్లను తన్నుకు పోయింది

మాటేసిన గెద్దొకటి

పిల్లిని చూసాడు గెద్దను చూసాడు

గాలిలోన వేలితోటి లెక్కలేసేసాడు

నల్లనోడే ఆ నల్లనోడే

అన్నిటికి ముదులేసే అల్లరోడే”

**చీకటి చిక్కబడుతుండగా** నిద్ర నుండి మేల్కొన్న రాకుమారులను తీసుకుని అగ్రహారం వైపు దారితీసాడు గోపన్న. ఒక అడుగు ముందే అగ్రహారానికి చేరుకున్న గోపయువకులు అగ్రహారంలో అందరికీ రాకుమారుల ఆగమన వార్త తెలియజేసారు. రాచబిడ్డలొస్తున్నారు, కొన్నాళ్ళు తమతోటే ఉండబోతున్నారని తెలియగానే అగ్రహారమంతా సందడి మొదలయ్యింది. రాజకుమారులు ఉండేందుకు సౌకర్యవంతమైన విడిదిని సిద్ధం చేసారు. అవసరమైన వస్తుసామాగ్రిని తెచ్చి తీరుగా సర్దిబెట్టారు. రాత్రి భోజనానికై ప్రతి గడప నుండి పోటీపడి రుచికరమైన తినుబండారాలు తెచ్చిపెట్టారు.

పొలిమేరల్లోకి వస్తూనే అగ్రహారంలో చిన్నారుల కేరింతలు విని జరుగుతున్న సందడిని గ్రహించిన గోపన్న ముఖాన చిరునవ్వు విరిసింది. గోపజనులంతా గుంపులు గుంపులుగా పొలిమేర వరకూ వచ్చి రాజకుమారులకు ఆహ్వానం పలికారు. అంతఃపురవాసంలో అయినా, గురుకులంలో అయినా వీలైనంత ఏకాంతంలో గడిపే రాకుమారులకు ఈ ధోరణి కొత్తగా ఉంది, కాస్త ఇబ్బందిగా అనిపిస్తున్నా ఆ ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానలకు మిక్కిలి ఆనందంగా ఉంది.

పెద్దవాడైన విక్రముడు అందరికీ నమస్కరిస్తూ, ముందుకు సాగుతూ కాస్త పెద్దరికంగా వ్యవహరిస్తున్నాడు. చిన్నవారైన సుసేనునికి, చిత్రసేనునికి ఇంకా రాచపోకడలు, పెద్దరికం ఎరుకకు రాకపోవటాన ఆ కోలాహలాన్ని చూస్తూ ఉంటే కాస్త సంబరంగా ఉంది.

అలా అందరూ విడిదికి చేరారు. గోపన్న రాజకుమారులకి స్నానాదికాలు కానిచ్చి భోజనానికి సిద్ధం కమ్మని చెప్పాడు. వారు స్నానం చేసి వచ్చేంతలో అప్పుడే తీసిన ఆవుపాలను కాచి తీసుకువచ్చాడు. రాజకుమారులు ముగ్గురికి భోజనాన్ని సిద్ధం చేసాడు. రాజకుమారులు ముగ్గురూ వచ్చి భోజనానికి కూర్చున్నారు. సుసేనుడు, చిత్రసేనుడు ఆ రుచికరమైన పదార్థలను ఆస్వాదిస్తూ "అన్నా ఈ కుడుములు భలే రుచిగా ఉన్నాయి. మోదకాలు భలే మధురంగా ఉన్నాయి" అంటూ ఒక్కో పదార్థాన్ని వర్ణిస్తూ ఆనందంగా భుజిస్తున్నారు. విక్రముడు మిక్కిలి ప్రేమతో తమ్ముళ్ళ తల నిమిరుతూ, కళ్ళతోనే కడుపు నింపేసుకున్నాడు.

గోపన్న విక్రముని మానసికస్థితి ఎరిగినవాడై అతడ్ని సమీపించి “పెద్దనాయనా, కలిగిన నాడు ప్రభువు ప్రజలకు కన్నాకు. కానికాలమొచ్చిన నాడు ప్రజల అభిమానమే ప్రభువులకు కాపు. కలలోనయినా కలత మీ దరిచేరనియ్యం. వ్యాకులపడక కాస్త ఎంగిలిపడు" అని సముదాయించాడు. గోపన్న చల్లని మాటలకి కాస్త స్థైర్యాన్ని తెచ్చుకుని విక్రముడు భోజనానికి ఉపక్రమించాడు. బలిష్టులైన గోపయువకులని ఎన్ని, రాకుమారులకు రాత్రంతా కాపు కాయమని పురమాయించాడు గోపన్న. తన నులకమంచం కూడా తెచ్చుకుని విడిది బయటే వేసుకున్నాడు. చలి కాచుకునేందుకు మంట వేసారు.

**“చిమ్మచీకటిలోన మాయ కమ్మేసింది**

**మాయమత్తుకి యమున చీలి రెండయ్యింది**

**గోకులానికి చేరే రాచబిడ్డాకడు**

**దొంగమామకు ఇంక చిక్కనేచిక్కడు**

**కాపుకై తెస్తివా ఓ కన్నతండ్రి**

**లోకాలనే కాసేటోడ్ని ఓ పిచ్చితండ్రి”**

భవిష్యత్తు అగమ్యగోచరమైందనే ఆలోచనలతో తల్లడిల్లుతున్న విక్రమునికి నిదురన్న ఊసే తట్టటం లేదు. తల్లిదండ్రులను కోల్పోయిన బాధ, రాజ్యం శత్రువులుపాలయ్యిందనే ఆవేశం ఒకటి వెంట ఒకటిగా అతడి ఆలోచనల్లో చేరి అతడిని తీవ్ర క్షోభకు గురిచేస్తున్నాయి. గోప యువకులు వెలిగించిన చలిమంట వద్దకు వచ్చి కూర్చున్నాడు. అన్నగారి విచారం గుర్తించిన సుసేనుడు, చిత్రసేనుడు కూడా వచ్చి అన్నపక్కనే గుబులుగా కూర్చున్నారు.

వారిని అనునయిస్తూ గోపన్న “నాయనలారా, రాజ్యాన్ని కోల్పోయిన రాజు, అడవిని వదిలిన సింహం ఒకటే. వారికి ఎంత సామర్థ్యం ఉన్నా ఆ బలహీన క్షణాల్లో ఆందోళన, దైన్యం సహజం. కానీ కడలి ఎగసి ఊరు మీద పడినప్పుడు పరుగులుపెట్టేవాడు కాదు, ఓర్పుగా తెప్పనల్లేవాడే తెలివి కలవాడు. కాలం ఎప్పుడూ ఒక్కరీతిన ఉండదు. గొల్లవానింట పాలు, వెన్న తిన్న రాజులెవరూ ఓడిపోరులే“ అని ధైర్యం చెప్పాడు.

అక్కడే ఉన్న గోపాల యువకులు "పెద్దయ్యా, నువ్వు చాలా కథలు వింటివి, దేశం మీదకెళ్ళొస్తివి కదా. అన్యాయాన రాజ్యాన్ని కోల్పోయిన రాజుల కథలేవీ తారసపడలేదా?" అని అడిగారు.

“ఎందుకు కనపడలేదోరయ్య. రాజుల కథలన్నీ వెతలే” అని సాలోచనగా నిట్టూర్చాడు గోపన్న.

“మరి అట్టాంటి రాచకుటుంబాలు ఏమయినాయి పెద్దయ్యా” అని అడిగారు యువకులు.

“ఏమవుతాయి? ఏమవ్వాలో అవే అయినయి. మనం చేసేటి కర్మలే మనకు దక్కేటి ఫలాలు. ఈ సత్తేన్ని చూపించే కాశీరాజుగోరి కథ చెబుతా ఇనుకోండి” అని ఆకాశం వైపు చూస్తూ కథ చెబుతున్నాడు గోపన్న. గోపాలురతో బాటు, రాకుమారులు కూడా ఆసక్తిగా వింటున్నారు.

రాసరికం చూడోరయ్య మేడిపండునాటిదే. కోట నిండా మంది, కొదవలేని సుఖముంటాది కానీ, కంటి నిండా కునుకుండదు. ఈ గోపన్న గోవులెత్తుకుపోటానికి ఏ గోపయ్యొస్తాడు. ఈ నులకమంచమేసుకుని కిట్టయ్యా అనుకుంటూ తందాగా కునుకుతీస్తాను. కానీ గద్దెనెక్కిన ప్రభువులకి ఆ కులాసలేదు. నిత్యం అపాయమే. అని కాశీరాజు కథ చెప్పనారంభించాడు.

### *గోపన్న చెప్పిన కాశీరాజు కథ*

ఆ రోజుల్లో కాశీ పట్టణంలో మహాదేవుడనే గొప్ప రాజు రాజ్యం చేస్తున్నాడు. ఆ మహారాజు పరమ శివభక్తుడు. సూర్యోదయానికి ముందే లేచి గంగానదిలో స్నానాదికాలు చేసి, కాశీనాధుడైన పరమేశ్వరునికి మొక్కి కాని పచ్చి గంగను కూడా ముట్టేవాడు కాదు. గొప్ప గొప్ప యజ్ఞాలు చేసి దేవతలను మెప్పించిన మహాపుణ్యాత్ముడు. ఆ రాజుగారు కొలువు చేస్తే దేవతలు మాయారూపులై వచ్చి కొలువులో కూచుంటారని చెప్పుకునేవోరు. ఆ చల్లని ప్రభువు పాలనలో ధర్మం నాలుగు పాదాల, నేల నాలుగు చెరగులా పాకింది. ఎక్కడెక్కడి నుండో మునులు, పండితులు వచ్చి ఆశీర్వచనాలు పలికి తగిన దానం పుచ్చుకు వెళ్ళేవారు. ఆ రాజ్యంలో ఆకలి బాధలు లేవు, చోరుల భయం లేదు, అకాల మరణాలు లేవు, అకాల వర్షాలు, అనావృష్టి లేదు. అంతా సుభిక్షమే.

అంత గొప్ప మహారాజుకి ఒకటే లోటు. సంతానం లేదు. గురువులు, పండితుల ఆదేశంతో ఉత్తమ రాజకుటుంబాల నుండి ఎన్నుకుని ముగ్గురు కన్యలను వివాహం చేసుకున్నాడు. కానీ అతని లోటు తీరలేదు. మహాదేవునికి మనస్సులో తీరని వ్యధ మొదలయ్యింది. వంశాన్ని నిలుపుకునేందుకు, అనాధిగా వస్తున్న పితృకర్మలు కొనసాగించేందుకు ఒక్కడైనా వారసుడు లేక పోయాడనే క్షోభ అతనిలో పెరగసాగింది.

ఒకనాడు గంగానదిలో స్నానం చేసి తిరిగి వస్తున్న మహాదేవునికి, వంటినిండా తెల్లని విభూది పూసుకుని, మండుతున్న నిప్పవలే ఎఱ్ఱని కన్నులతో, చేతిలో త్రిశూలం ధరించిన సాధువు ఎదురయ్యాడు. మహాదేవుడు భక్తితో ప్రణమిల్లాడు. "రాజా, దక్షిణ భారత యాత్రకు వెళ్ళి పుణ్యక్షేత్రాలు దర్శించు. నీ మనసులో ఉన్న కలత తీరుతుంది" అని పలికి క్షణం కూడా ఆగకుండా గంగవైపు సాగిపోయాడు సాధువు.

పరమేశ్వరుడే కరుణించాడని భావించిన మహాదేవుడు ప్రయాణానికి సిద్దమయ్యాడు. ముగ్గురు భార్యల్లో పట్టమహిషి సులోచన మాత్రమే సభక్తికంగా సిద్దపడింది. మిగిలిన భార్యలు సుదక్షిణ, సులక్షణ తమకు సుస్తి చేసిందని, ప్రయాణం చెయ్యలేమని చెప్పారు. మహాదేవుడు నిరాశచెందినా, సాధువు మాటే దేవుడి పంపిన వర్తమానంగా భావించి ప్రయాణం మాత్రం వాయిదా వెయ్యలేదు. రాజ్యభారాన్ని రెండవభార్య సుదక్షిణ అన్నగారు మరియు సామంతుడు అయిన వీరభద్రునికి అప్పగించి సపరివారంగా దక్షిణభారత యాత్రకి తరలి వెళ్ళాడు.

పరివారం కూడా వచ్చిన పండితులు, గురువులు దారిపొడవునా విశ్రాంతి వేళల్లో పురాణ శ్రవణం, కథాకాలక్షేపాలతో ప్రభువుల భక్తికి, ఏకాగ్రతకు భంగం వాటిల్లకుండా చూసారు.

దక్షిణభారతంలో ప్రసిద్ధ క్షేత్రాలను, ఆశ్రమాలను దర్శిస్తూ రామేశ్వరం చేరుకున్నారు. ఆ రామేశ్వరక్షేత్ర ప్రభావం మహాదేవుని మనస్సుని కట్టిపడేసింది. ఆ ప్రదేశంలో అడుగుపెట్టిన నాటి నుండి అవ్యక్తానుభూతికి లోనయిన మహాదేవుడు ఆ క్షేత్రంలోనే కొన్నాళ్ళు విడిది చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆ రామేశ్వరుని సేవలో రోజులు గడుస్తుండగానే మహారాణి సులోచన పండంటి మగపిల్లాడికి జన్మనిచ్చింది. మహాదేవుని ఆనందానికి అవధుల్లేవు. శివదత్తుడని నామకరణం చేసాడు.

ఆ ఆనందాన్ని రాజ్యప్రజలతో పంచుకోవాలని భావించిన మహాదేవుడు తిరుగు ప్రయాణమయ్యాడు. పరివారంతో కూడి దండకారణ్యాన్ని దాటుతుండగా బందిపోటు దొంగలగుంపు వారిపై దాడిచేసింది. పరివారమంతా చెట్టుకొకరు, పుట్టకొకరుగా పరుగులు తీసారు. మహాదేవుడు వారిని ఎదిరించి ప్రాణాలు కోల్పోయాడు. ప్రాణాంతకమైన గాయాలతో తప్పించుకున్న మహారాణి సులోచన బిడ్డతో సహా కొంతదూరం పోయి ఒక గుహలో తలదాచుకుంది.

రెండు పగళ్ళు, రెండు రాత్రులు ఆ చీకటి గుహలోనే రక్తమోడుతూ బిడ్డను సాకిన సులోచన మూడోరోజున మహాశివరాత్రి పర్వదినాన శివైక్యం చెందింది. ఆ గుహ సామాన్యమైన గుహ కాదు. భస్మాసురుని బారి నుండి తప్పించుకునేందుకు శివుడు ఆ గుహలో తలదాచుకున్నాడని ప్రతీతి. ఆ గుహలో స్వయంభువుగా వెలిసిన శివలింగం ఉంది. దట్టమైన అడవిలో ఉన్న ఆ గుహకు ఏడాదికోమారు మహాశివరాత్రి నాడు గిరిజనులు తండోపతండాలుగా వచ్చి ఉత్సవం చేస్తారు.

ఆ రోజు ఉత్సవం కోసం వచ్చిన గిరిజనులు చీకటిలో పడి ఉన్న నిర్జీవమైన మహారాణి దేహాన్ని, ఆ పసిపిల్లాడిని చూసి కంటనీరు పెట్టుకున్నారు. ఆ బిడ్డకు శివుని అనుగ్రహం ఉందని నమ్మిన గిరిజనులు తమ గూడేనికి తీసుకుని వెళ్ళారు. ఆ గూడెంలో ప్రతి గడప తనదిగా, ప్రతి తల్లీ తన తల్లిగా పెరిగాడు శివదత్తుడు. శివుని గుహలో దొరికిన బిడ్డని ఆ గిరిజనులు శివయ్య అని పిలిచేవారు.

శివయ్య ఆ అడవిలో ప్రతి పుట్టతోనూ, చెట్టుతోనూ స్నేహం చేసాడు. పక్షులతో కలిసి పాడుకునేవాడు, జంతువులతో కలిసి ఆడుకునేవాడు. శివయ్యకి పక్షుల భాష, జంతువుల భాష అబ్బింది. అడివంతా వాడితో మాట్లాడుతుందని చెప్పుకునేవారు ఆ గిరిజనులు. అడవిలో ఏ లేడి పిల్లకో ప్రాణభయమయితే శివయ్యా అని పిలిచేది, పరుగున వెళ్ళి ఆదుకునేవాడు. ఏ పక్షులకో బాణం దెబ్బ తగిలితే "శివ శివ"మనేవి. వేటగాళ్ళను మందలించి వాటికి ప్రాణాలు పోసేవాడు. అడవే ఆధారంగా బ్రతికే గిరిజనులకు ఈ పోకడలు వింతగా ఉండేవి. అయినా శివయ్య శివుని అంశ అనే నమ్మకంతో ఎవరూ ఎదురు చెప్పేవారు కాదు.

అడవిలో స్వేచ్ఛగా విహరించే శివయ్య, ఒకనాడు తన తల్లి మరణించిన గుహ వద్ద ఒక గురువు తన శిష్యులతో విడిది చెయ్యటం చూసాడు. ఆ గురువు తన శిష్యులకు సకల అస్త్రవిద్యలు నేర్పిస్తున్నాడు. శివయ్య ఆ గురువు దగ్గరకు వెళ్ళి మిక్కిలి వినయంతో నమస్కరించి తనని కూడా శిష్యుడిగా స్వీకరించి అస్త్రవిద్యలు నేర్పించమని ప్రార్థించాడు. ఆ గురువు పరీక్షగా శివయ్యని చూసి "నీ వేషం చూడగా

బోయవానివలె ఉన్నావు. నీ నిండైన విగ్రహము, ముఖ వర్ఛస్సు ఉత్తమకుల సంజాతునివలె ఉన్నవి. ఎవరు నీవు? ఎక్కడ నుండి వస్తున్నావు?" అని అడిగాడు.

శివయ్య విచార వదనుడై "నా వృత్తాంతమేమియు నాకు తెలియదు. ఈ గుహనందు దొరికినానని మా గూడెపు పెద్దలు చెప్పారు" అని చెప్పాడు.

ఆ గురువు అతనిని అనునయించి "నీవెవరైననూ చూడగా గొప్ప వీరుడు కాగల లక్షణాలు నాకు గోచరిస్తున్నాయి. నా పేరు పూర్ణానందుడు. నీవంటి శిష్యుల కోసమే నేను ఎదురు చూస్తున్నాను. నీకు సకల విద్యలు నేర్పిస్తాను, కానీ ఒక్క షరతు. గురుదక్షిణగా నీవు నా శిష్యగణంతో కూడి కాశీ రాజైన వీరభద్రుని గెలిచి, రాజ్యం నుండి పారద్రోలాలి" అని మాట తీసుకున్నాడు.

శివయ్య ఏకాగ్రతతో, కఠోర సాధనతో గురువుకు తెలిసిన అన్ని విద్యలు అభ్యసించాడు. పూర్ణానందుడు సహితం శివయ్య ధారణాశక్తికి ముగ్ధుడై అతడికి అన్ని మెలకువలూ నేర్పించాడు. శివయ్యను తన శిష్యులకు నాయకుడిని చేసాడు. శివయ్య తన తోటి శిష్యులతో స్నేహంగా మెలుగుతూ వారి బలాబలాలు గుర్తించాడు. లోపాలు గుర్తించి సరిచేసుకునేందుకు సహాయం చేసాడు. ఏన్నోరోజుల కఠోరమైన శ్రమతో వారంతా గొప్పవీరులుగా తయారయ్యారు.

శిష్యుల పరాక్రమాన్ని, ముఖ్యంగా శివయ్య శక్తియుక్తులను పరిశీలించిన పూర్ణానందుడు కాశీ పైకి దండెత్తాల్సిన సమయం ఆసన్నమయ్యిందని భావించాడు. శివయ్యను పిలిచి "చూడు శివయ్య కాశీ సామాన్యనగరం కాదు. ఒకనాడు యధేచ్ఛగా దేవతలు సంచరించిన నగరం. నేడు ఒక దుష్టుని పాలనలో మగ్గుతుంది. మిక్కిలి దుర్భేధ్యమైన ఆ కోటను జయించటం సులువైన పనికాదు. మీరు చేయబోయే ఈ యుద్ధం ప్రాణాంతకమని గుర్తుంచుకో. ప్రజల్లో ప్రభువు పై ఉన్న వ్యతిరేకతే మనకున్న బలం. వైరి బలం తెలుసుకోకుండా యుద్ధానికి తెగబడటం యుక్తివంతులు చేయాల్సిన పని కాదు. శిష్యులందరినీ ఇక్కడే ఉంచి నీవు, నేను మారువేషంలో బాటసారులుగా కాశీపట్టణం పోయి స్థితిగతులు గమనించి వద్దాం" అని చెప్పాడు.

అనుకూలమైన ఒకరోజు నిర్ణయించుకుని ఇద్దరూ కాశీకి పయనమయ్యారు. సంధ్యవేళకు ముందే కాశీకి చేరువైనప్పటికి, చీకటిపడే వరకూ నగరం వెలుపలే ఎదురుచూసి దీపాలు వెలిగాక పట్టణంలో అడుగుపెట్టారు. శివయ్య కాశీలో అడుగుపెట్టిన క్షణంలో ఒక అద్భుతం చోటు చేసుకుంది. దీపాలు వెలిగించి, తలుపులు వేసిన కాశీనాధుని ఆలయంలో గంటలు పెద్ద శబ్ధంతో మోగాయి. పూజారులు ఆశ్చర్యంతో తలుపులు తీసి దేవాలయం మొత్తం గాలించినా ఎవరూ కనబడలేదు, గంటలు ఎలా మ్రోగాయో తెలియలేదు. క్షణాల్లో విషయం నగరమంతా ప్రాకింది. సత్రంలో విడిది చేసిన పూర్ణానందుడు, శివయ్య ఆశ్చర్యంతో ప్రజలు ఈ విషయం చెప్పుకోవటం విన్నారు. పూర్ణానందుడు సంతోషంతో కాశీకి మంచిరోజులు రాబోతున్నాయి అన్నాడు.

మరునాడు గురు,శిష్యులిద్దరూ నగరమంతా గమనించారు. రాజభవనం వద్ద సందడిగా ఉంది. మహారాజు వినోదం కోసం పరివారంతో సహా వేటకు వెళ్ళేందుకు సన్నద్ధమవుతున్నాడని తెలుసుకున్నారు. సత్రానికి చేరుకున్నాక పూర్ణానందుడు, శివయ్యతో "నగరం మీద

దండెత్తటం కంటే అడవిలోనే ఎదుర్కొనటం మేలు. తక్షణమే మనం వెనుదిరిగి మహారాజు వేట నుండి తిరిగి పట్టణానికి వచ్చేలోపు మనవారితో దాడిచెయ్యాలి" అని చెప్పాడు. ఇద్దరూ ఆ రాత్రి సత్రం బయట ఉన్న ఒక రావిచెట్టు నీడలో నిద్రించారు.

ఆ రావిచెట్టు పైన ఒక పక్షి తన పిల్లలతో సహా నివాసముంటుంది. ఆ పక్షి తన పిల్లలకు కథలు చెబుతూ " చూసారా దేవుడు చేసే చమత్కారం. ఈ చెట్టు క్రింద నిద్రపోతున్న వాడు ఈ రాజ్యాన్నే ఏలాల్సినవాడు. వీడి తల్లిదండ్రులను అడవిలో బందిపోటులతో చంపించిన రాజు, నేడు అడవికి పోతున్నాడు. ఈ మహరాజుపై దండెత్తేందుకు మరో రాజు అడవిలో పొంచున్నాడు. మారువేషంలో వచ్చిన వీడేం చేస్తాడో మరి" అని చెప్పింది.

ఆ పక్షి మాటలు విన్న శివయ్య ఉలిక్కిపడి లేచాడు. పూర్ణానందుడి వద్దకు వెంటనే వెళ్ళి "గురువర్యా, మీరెవరు? ఎందుకు ఈ కాశీరాజుని నిర్మూలించాలని భీష్మించారు. ఆ పక్షి మాటల్లోని మర్మమేమిటి?" అని తాను విన్నది మొత్తం చెప్పాడు. పూర్ణానందుడికి సమస్తం అవగతమయ్యింది. మిక్కిలి సంతోషంతో శివయ్యను ఆలింగనం చేసుకున్నాడు. వివరాలేవి చెప్పకుండానే శివయ్యను తీసుకుని వెంటనే తమ స్థావరానికి తిరిగి వచ్చాడు.

శివయ్యను పెంచిన గూడేనికి వెళ్ళి, అతను దొరికినప్పుడు అక్కడే మరణినించిన అతని తల్లి రూపురేఖలెవరైనా చెప్పగలరేమో అని ప్రయత్నించాడు. చూడగా ఆమె మహారాణి వలె ఉన్నదన్న మాటే కానీ ఎవరూ వివరంగా చెప్పలేకపోయారు. గూడెపు పెద్ద మాత్రం ఏదో గుర్తొచ్చిన వాడల్లే పరుగున వెళ్ళి అమ్మవారి కుంకుమలో పడేసిన ఒక అంగుళీకం తెచ్చి, శివయ్యకు తల్లి గుర్తుగా ఉండేందుకు ఆమె చేతి నుండి తీసినదని చెప్పాడు. చూడగా అది కాశీరాజు మహాదేవుని రాజముద్రిక. నిశ్చేష్టుడైన శివయ్యను దగ్గరకు తీసుకుని ఆ గూడెపు ప్రజల సమక్షంలో "నీవు సామన్యుడవు కాదు నాయనా. దేవతలు సహితం అభిమానించిన కాశీ మహారాజు మహాదేవుని వారసుడవు" అని ప్రకటించాడు పూర్ణానందుడు.ఎప్పటికీ రహస్యంగా మిగిలిపోతుందేమో అని భావించిన జన్మరహస్యాన్ని తెలుసుకుని శివయ్య కదిలిపోయాడు.

"నాయనా నీ తండ్రి నీకు పెట్టిన పేరు శివదత్తుడు. నేను మహాదేవుని ఆస్థానంలో రాజగురువును. కాశీపట్టణ సింహాసనానికి వారసుడు ఉదయించాడని తెలియగానే నీ సవతి తల్లులైన సులక్షణ, సుదక్షిణ అసూయ, మత్సరాలతో రగిలిపోయారు. సింహాసనం పై ఎప్పటి నుండో కన్నున్న వీరభద్రునితో కలిసి కుట్ర పన్నారు. దక్షిణభారత యాత్ర ముగించుకు వస్తున్న నీ తండ్రి పై బందిపోటుల వలె దాడిచేసారు. ఆ దాడిలో నీ తండ్రి అక్కడే ప్రాణాలు కోల్పోగా, గాయాలబారిన పడిన నీ తల్లి పసికందుగా ఉన్న నిన్ను రక్షించేందుకు పారిపోయింది. ఆ దాడిలో ప్రాణాలతో బయటపడిన నేను కాశీనగరం చేరి జరిగిన విషయాలు తెలుసుకున్నాను. నాటి నుండి అజ్ఞాతంలో బ్రతుకుతూ నీ తండ్రి చావుకి ప్రతీకారం కోసం ఎదురు చూస్తున్నాను. " అని మొత్తం కథను వివరించాడు పూర్ణానందుడు.

“నా తల్లి కాపాడిన ఈ ప్రాణాలకు పరమార్ధం ఆ దుష్టుడిని శిక్షించినప్పుడే గురుదేవా. ఆనతినివ్వటం మన జట్టుతో వెళ్ళి వాడిని మట్టుబెడతాను” అని ఆవేశంగా అరిచాడు శివదత్తుడు.

గురుశిష్యులిద్దరూ స్థావరం చేరుకున్నారు. వేటలోనే ఉన్న రాజు పై దాడిచేసేందుకు వ్యూహం సిద్ధం చేసుకున్నారు. పూర్ణానందుడు తన శిష్యులందరినీ ఒక్కొక్కరిగా పిలిచి, వారి బలాబలాలను అనుసరించి తగిన సూచనలు చేసాడు. అందరూ దాడికి సన్నద్ధమయ్యారు. ఇన్నాళ్ళ తమ సాధనకు నేడు సార్ధకత లభించనుందని ఉత్సాహంతో ఉరకలు వేసారు. గురువుగారి ఆజ్ఞను అనుసరించి అడవిలో రాజుని వెతుకుతూ ముందుకు సాగారు.

అలా వెతుకుతూ ముందుకుపోతున్న వారికి కాశీ నుండి వచ్చిన ఒక వార్తహరుడు ఎదురయ్యాడు. అతడు పూర్ణానందుని వెతుక్కుంటూ కాశీపట్టణం నుండి వచ్చాడు. పూర్ణానందుడు అతడిని గుర్తించి, అతడు తీసుకొచ్చిన వార్త ఏంటో చెప్పమన్నాడు.

“గురువర్యా, మీ మిత్రులు సదానందులవారు మీకు ఒక వార్త చెప్పమన్నారు. వేట కోసం అడవికి వెళ్ళిన మహారాజు పై శత్రువులు దాడిచేసారు. రెండు సేనల మధ్య భీకరమైన పోరు జరిగింది. ఆ పోరాటంలో ఇరుపక్కల వందల్లో సేనలు నిహతులయ్యారు. మహారాజు తీవ్రంగా గాయాలపాలయ్యారు. అంగరక్షకులు గాయపడిన మహారాజుని నగరానికి చేర్చారు. శత్రువులు మాత్రం రాజకుమార్తెను ఎత్తుకుని వెళ్ళారు. కొన ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న మహారాజు, తన కుమార్తెను కాపాడి తెచ్చిన వీరునికి ఆమెనిచ్చి వివాహం చెయ్యటమే కాకుండా రాజ్యాన్ని కూడా ఇచ్చేస్తానని చాటింపు వేసారు” అని చెప్పి వార్తాహరుడు అక్కడ నుండి నిష్క్రమించాడు.

పూర్ణానందుడు సంతోషంతో " నాయనా శివదత్తా, ఇక మనల్ని అడ్డగించే వారెవరూ లేరు. తక్షణమే నగరానికి వెళ్ళి ఆ దుష్టుడ్ని నిర్మూలించి నీ రాజ్యాన్ని నీవు తిరిగి తీసుకో" అని చెప్పాడు. శివదత్తుడు మాత్రం విచారంతో మౌనంగా ఉండిపోయాడు. అతడి విచార వదనాన్ని చూసి "ఆనందించాల్సిన సమయంలో ఈ చింత దేనికి నాయనా" అని అడిగాడు పూర్ణానందుడు.

“కొన ప్రాణాలతో ఉన్న ఆ దుష్టుడ్ని, తన కూతుర్నే రక్షించుకోలేక ఎవరికయినా రాజ్యాన్ని ఇచ్చేస్తా అని వాగ్దానం చేసిన అబలుడ్ని చంపి తీర్చుకునేది రక్తపిపాసే కానీ, విజయం ఎలా అవుతుంది గురువర్యా? నావలె తల్లిదండ్రులను కోల్పోయి శత్రువుల బారినపడిన, యువరాణిని తలుచుకుంటే బాధగా ఉంది. మీ ఆనతి అయితే ఒక్కమాట, మా సమరోత్సాహాన్ని శత్రువులపై చూపి ఆమెను కాపాడటం, మేము సాధన చేసిన విద్యకు సార్ధకత అని నా భావన" అని వినయంగా చెప్పాడు శివదత్తుడు.

కాసేపు మౌనంగా, దీక్షగా ఆలోచించిన గురువు " రాజనే వాడికి వీరత్వంతోపాటు కావాలిసినది దయాగుణం. అడవిలో పెరిగినా నీ తండ్రికి సరైన వారసుడివి అనిపించుకున్నావు." అని అభినందించి "నీ మంచి ఆలోచనను అనుసరించి యువరాణిని కాపాడదాం. కానీ శత్రువులు ఏ దిశగా వెళ్ళారో ఏలా తెలుస్తుంది?" అని అనుమానం వ్యక్తం చేసాడు.

శివదత్తునికి మెరుపులా ఒక ఆలోచన తట్టింది. అడవిలో తన నేస్తాలైన పక్షులను, జంతువులని పిలిచి అడవంతా గాలించమన్నాడు. జంతువులన్నీ ఉత్సాహంతో చెంగుచెంగున దూకుతూ అడవంతా గాలించ సాగాయి. పక్షులన్నీ రివ్వున ఎగిరి వెతకానరంభించాయి. అందరూ ఆతృతతో ఎదురు చూస్తున్నారు. ఒక చిన్న పిచ్చుక ఎగరలేక ఆపసోపాలు పడుతూ వచ్చి శివదత్తుని కాళ్ళ దగ్గర పడిపోయింది. శివదత్తుడు

పరుగున పోయి నీరు తెచ్చి ఆ పిచ్చుకకు తాగించాడు. ఆ పిచ్చుక కాస్త ఊరడిల్లి "శివయ్యా, అడవి మధ్యలో పెద్ద చెరువు వద్ద ఎవరో విడిది చేసున్నారు. చూడబోతే ఎవరో సైనికుల్లా ఉన్నారు" అని చెప్పింది.

శివదత్తుడు వెంటనే తన జట్టుతో వెళ్ళి వారిపై మెరుపుదాడి చేసాడు. సమరోత్సాహంతో రగిలిపోతూ బెబ్బులిలై మీదపడ్డ శివదత్తుని జట్టు ముందు శత్రువులు నిలవలేకపోయారు. క్షణాల్లో అంతా చిత్తయిపోయారు. వారిని హెచ్చరించి, ప్రాణాలతో విడిచిపెట్టాడు శివదత్తుడు. యువరాణిని బంధవిముక్తురాలిని చేసి కాశిపట్టణం వైపు సాగారు.

రాజభవనంలో గాయాలతో బాధపడుతూ, కదలలేని స్థితిలో ఉన్న వీరభద్రునికి యువరాణి అగమన వార్త తెలిసింది. కుమార్తె క్షేమంగా తిరిగి వస్తున్నందుకు ఏంతో సంతోషించిన వీరభద్రుడు, వారిని ఆహ్వానించేందుకు ఎదురు వెళ్ళాడు. అక్కడ పూర్ణానందుడిని చూడగానే వీరభద్రుడు నిశ్చేష్టుడయ్యాడు. ఆనాడు జరిగిన దాడిలో మరణించాడని భావిస్తున్న వాడు బ్రతికి రావటంతో కంగారు పడ్డాడు.

పూర్ణానందుడు చిరునవ్వుతో "చచ్చిన పాముని చంపములే వీరభద్ర. ధర్మమే ఎప్పటికయినా గెలిచేది, నిలిచేది. ఈ సువిశాల కాశీ రాజ్యానికి అసలైన వారసుడు, మహాదేవుని కుమారుడైన శివదత్తుడు ఇదిగో" అని శివదత్తుడిని చూపించాడు. మహాదేవుని వారసుడు ప్రాణాలతో ఉన్నాడా అని క్షణకాలం ఆశ్చర్యంతో రాజభవనంలో ఉన్న పరివారమంతా నిలబడిపోయారు. మరుక్షణంలో జయజయ ధ్వానాలు మిన్నంటాయి. పట్టణమంతా ఈ వార్త ప్రాకింది. ప్రజలంతా తండోపతండాలుగా రాజభవనానికి తరలి వచ్చారు.

కాశీ ప్రజలు ఇప్పటికి ఆరాధిస్తున్నది మహాదేవుడినే అని గుర్తించిన వీరభద్రుడు అందరి సమక్షంలో శివదత్తుని శరణు వేడాడు. రాజ్యాన్ని అప్పగించి వనాలకు వెళ్తానని ప్రకటించాడు. తన కుమార్తె అనాథగా మిగిలిపోతుందని తనని వివాహం చేసుకోమని ప్రాధేయపడ్డాడు. శివదత్తుడు అందుకు అంగీకరించాడు. శివదత్తుడు చేసిన మేలు మరువకుండా, తనని సంరక్షించి పెంచిన గూడెం ప్రజలందరినీ పట్టణానికి ఆహ్వానించి వారి సమక్షంలో వివాహాన్ని, పట్టాభిషేకాన్ని జరుపుకున్నాడు. పూర్ణానందుని ఆశీస్సులతో జనరంజకంగా పాలించి, తండ్రికి తగ్గ తనయుడనిపించుకున్నాడు.

కథ చెప్పటం పూర్తిచేసిన గోపన్న విక్రముడిని చూసి "నాయన బళ్ళు ఓడలవుతాయి, ఓడలు బళ్ళవుతాయి. నేడు పోయిందే అని చింతించకు నీదైనది ఎక్కడున్నా నిన్నే వెతుకుతూ వస్తుంది. చింత మరచి హాయిగా కునుకు తియ్యి" అని అనునయించాడు.

రాజకుమారులంతా విశ్రాంతి తీసుకునేందుకు విడిదిలోకి నడిచారు.

భానుడి తొలి కిరణాలు నేలను తాకేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నాయి. గుంపులుగా సాగుతున్న గోవుల మందల గిట్టల తాకిడికి దట్టంగా లేచిన దూళి, సూర్యుడ్ని పరిహాసం చేస్తూ అతడి ప్రతాపాన్ని నిర్వీర్యం చేస్తుంది. నదిలో స్నానం చేసి అగ్రహారం వైపు వస్తున్న రాకుమారులకు, గోవుల వెంటే వెళుతున్న గోపన్న నవ్వుతూ ఎదురయ్యాడు. వారు కూడా గోపన్నతో పాటుగా గోవుల వెంటే వెళ్ళారు.

ఆవులన్నీ కొండవాలు దిగి మేత మేస్తున్నాయి. గోపాల యువకులంతా గుంపులుగా విడివడి చెట్టుకో గుంపు చొప్పున చేరి పందేలుకట్టి ఆటలాడుతున్నారు. గోపన్నతో పాటుగా రాకుమారులంత ఒక చెట్టు నీడలో కూర్చున్నారు.

"పాల సంద్రములోన పవ్వళించే సామికి
పాలు,వెన్నకు కరువా? ఏల దొంగిలించాడో?
పడగ నీడన కునుకు తీసే వానికి
పామేమి చేసెనో? ఏల పడగనెక్కాడినాడో?

నల్లని నా సామికి నిలువెల్లా సిత్రమే
ఎల్లలెరుగని వాడంటే ఎల్లరకూ ఆత్రమే"

కాసేపటికి ఎక్కడ నుండి ఊడిపడ్డాడో కానీ ఒక వార్తాహరుడు మారువేషంలో వచ్చాడు. సరాసరి వచ్చి రాకుమారులను సమీపించి "ప్రభూ, మహామంత్రి గారిని చూసి వచ్చాను. కారాగారంలో బంధింపబడ్డ మంత్రిగారు, మీ క్షేమ సమాచారాలు తెలుసుకుని రమ్మన్నారు. సందేశం సెలవయితే మంత్రిగారికి చేరుస్తాను" అని వినయంగా అడిగాడు.

ఆ హఠాత్పరిణామానికి చిన్న వారిద్దరూ కలవరపడ్డారు. గోపాల యువకులు కొత్త వ్యక్తిని చూడగానే అప్రమత్తులై ఒక్క పరుగున అక్కడకి చేరుకున్నారు. విక్రముడు సాలోచనగా గోపన్న వైపు చూసాడు. గోపన్న నిండుగా నవ్వాడు. గోపన్న నవ్వునే సూచనగా స్వీకరించి విక్రముడు "రాకుమారులంతా క్షేమంగా ఉన్నారని, వారికొచ్చిన ఆపదేమీ లేదని మంత్రిగారికి తెలియజేయు" అని చెప్పి తన చేతికున్న ఉంగరాన్ని ఇచ్చి ఆ వార్తాహరుడ్ని పంపివేసాడు.

ఆ వార్తాహరుడు వెళుతున్న వైపే చూస్తూ విక్రముడు "సైన్యమా? లేదు. తొల్లి పోరిన అనుభవమా? అదీ లేదు. మంత్రి సామంతులంతా బందీలయ్యారు. భవిష్యత్తు అగమ్య గోచరంగా ఉంది" అంటూ వ్యాకులపడ్డాడు. అక్కడున్న వారంతా విచారంలో మునిగిపోయారు.

గోపన్న వారందరినీ దగ్గరకు పిలిచి " ప్రతి పొద్దూ పోరాడలనే ఉత్సాహమే బ్రతుకు, గెలవాలనే ఆశే ప్రాణం. నిరాశ కమ్మేసి రేపటిని కానలేని నాడు సచ్చినవాడితో సమానం కదయ్యా" అని హితవు పలికాడు. రాకుమారులను ఉత్సాహ పరిచేందుకు "ఏడుతరాలు రాజ్యాన్ని కోల్పోయిన ఏడుగిరుల చరిత్ర మీకు చెబుతాను ఇనుకోండి" అని ఏడుగిరుల కథ చెప్పటం మొదలుపెట్టాడు గోపన్న

**ఏడుగిరుల కథ**

పూర్వం సారంగపురమనే గొప్ప రాజ్యం ఉండేది. రాజ్యానికి పెట్టని కోటలా ఏడు గిరులు ఎల్లలుగా ఉండి శత్రువుల దాడి నుండి కాపాడేవి. రాజ్యాన్ని పరిపాలించే రాజు వసంతవర్మకు ముప్పురు భార్యలు, ఏడుగురు కుమారులు. ప్రజారంజకంగా పరిపాలించే వసుంతుడంటే రాజ్యంలో అందరికీ అభిమానం.

ఒకనాడు సారంగరాజ్యంలో ఒక సరిహద్దుగ్రామం పై దాపులనే ఉన్న అడవి నుండి వచ్చిన ఒక పులి దాడిచేసింది. ఆవులపై, మేకలపై దాడిచేయటమే కాక ఒక మనిషిని కూడా చంపి ఈడ్చుకుపోయింది. మనిషిరక్తం మరిగిన ఆ పులి నాటి నుండి సరిహద్దు గ్రామాలపై ప్రతిరోజూ దాడి చెయ్యనారంభించింది. ప్రజలు ఎంత అప్రమత్తంగా ఉన్నా ఆడవారినో, పసిపిల్లలనో నోట కరుచుకుపోయేది.

గ్రామాల్లోని యువకులు ఆ పులిని కుదిరితే బంధించేందుకు లేదా చంపేసేందుకు గ్రామాల్లో వలలు, కందకాలు ఏర్పాటు చేసారు. ఒకనాటి రాత్రి వలలో చిక్కుకున్నట్టే చిక్కిన పులి, ఆ వలని ఛేదించుకుని పారిపోయింది. నాటి నుండి పులి గ్రామాల్లోకి రాకుండా గ్రామం నుండి అడవి వైపు వెళ్ళేవారి పై దాడిచేసేది. విసుగుచెందిన ప్రజలు ప్రభువు వసంతునికి ఈ పులి వల్ల కలుగుతున్న కష్టనష్టాలు వివరించారు.

ప్రజల బాధను గ్రహించిన వసంతుడు తక్షణమే ఆ పులిని వేటాడేందుకు వచ్చి గ్రామంలో విడిది చేసాడు. పగలంతా అడవి మొత్తం గాలించినా పులి జాడ తెలియలేదు. వారం రోజులు గడిచింది గ్రామంలో దాడులేవీ జరగలేదు. పులి ఆ అడవి విడిచి పోయిందని అందరూ అనుకున్నారు. వసంతుడు మరొక్క రోజు వేచి కోటకు వెళ్ళిపోదామని సేనలకు చెప్పి విశ్రాంతి మందిరానికి వెళ్ళిపోయాడు.

ఆ రోజు పున్నమిరాత్రి కావటంతో అడవంతా అందమైన వెన్నెలతో తడిసి ముద్దవుతోంది. ఆ సౌందర్యానికి ముగ్దుడైన వసంతుడు తన విడిది నుండి బయటకు వచ్చి ఆ నిండు చంద్రుడ్ని తమకంగా చూస్తూ నిలుచున్నాడు. పొదల్లో ఉన్నట్టుండీ ఏదో కదిలి, ఎగిరి వసంతుని పైకి దూకింది. క్షణంపాటు తత్తరపాటుకి గురైన వసంతుడు, తన పైకి దూకుతోంది పులి అని గ్రహించగానే, ఆతని చేయి ఒరవైపు కదిలింది. కానీ విశ్రాంతి సమయం కావటంతో అతడు ఆయుధాన్ని ధరించిలేడు. నరమాంసాన్ని మరిగిన ఆ పులి తన వాడియైన పంజాతో వసంతుని ముఖంపై బలంగా కొట్టింది.

ఆ బలమైన దెబ్బ తాకగానే వసంతునికి సగంప్రాణం పోయింది. తన మరణం తథ్యమని గ్రహించిన వసంతుడు, ప్రజలకు మాత్రం ఈ పులి బాధ నుండి విముక్తి కలిగించాలని మనసులోనే సంకల్పించుకున్నాడు. మొలలో చిన్న చురకత్తి అతని చేతికి తగిలింది. దాన్ని అందుకుని బలంగా పిడికిలి బిగించాడు. పులి వసంతుని నోటకరుచుకు పోయేందుకు దగ్గరగా వచ్చింది. వసంతుడు తన శరీరంలో మిగిలి ఉన్న బలాన్నంతా కూడదీసుకుని పులి మెడను చిక్కించుకుని, చురకత్తితో గొంతు కోసేసాడు. పులి తల మొండెం నుండి వేరు కావటం, వసంతుడు మరణించటం ఒక్క క్షణంలోనే జరిగిపోయింది.

పులి పెట్టిన చావు కేకలు విని సైన్యమంతా అప్రమత్తమై వచ్చారు. చేతిలో పులి తలను పట్టుకుని, మరణించిన వసంతుడు కనిపించాడు. అతని శరీరం నుండి రక్తం కారుతూనే ఉంది. ముఖం మాత్రం ప్రసన్నంగా ఉంది. పులిని చంపేసిన సంతృప్తి ఇంకా మూతలుపడని అతని కళ్ళలో కనిపిస్తోంది. తలతెగిన పులిరక్తంతో తడిచి నేలంతా ఎర్రగా మారిపోయింది.

వసంతుని మరణవార్త రాజ్యమంతా క్షణాల్లో పాకేసింది. రాజు పోరాడిన ఆ ప్రదేశాన్ని, దృశ్యాన్ని చూసేందుకు రాజ్యంలోని ప్రజలంతా తండోపతండాలుగా వచ్చారు. వసంతుని మరణంతో రాజ్యమంతా విచారంలో మునిగిపోయింది. అంతఃపురంలో మాత్రం కల్లోలం మొదలయ్యింది. దాయాదులు, బంధువులు చేరి ముగ్గురు రాణులకూ, తమకు తోచిన సలహాలిచ్చి కలహాన్ని సృష్టించారు.

పెద్దలు, మంత్రులు, పండితులు, గురువులు, రాచకుటుంబానికి రాజ్యానికి హితులు వచ్చి తీవ్రంగా చర్చించిన పిదప కూడా సామరస్యాన్ని సాధించలేకపోయారు. తుదకు తప్పని స్థితిలో రాజ్యాన్ని ఏడు భాగాలుగా విభజించారు. రాజ్యానికి ఎల్లలుగా ఉన్న ఏడుపర్వతాలనూ ఆధారంగా చేసుకుని వాటిని ఆనుకుని ఉన్న గ్రామాలను ఏడుగురు కొడుకులకు పంచిపెట్టారు. ఆ పర్వతాల పేరు మీద కొత్తగా ఏడు రాజ్యాలు వెలిసాయి. అవే రామగిరి, శివగిరి, సింహగిరి, వరహగిరి, రత్నగిరి, హేమగిరి, శ్వేతగిరి.

తల్లుల మధ్య సయోధ్య లేకపోయినా, రాజ్యం ముక్కలయినా అన్నదమ్ముల మధ్య బాంధవ్యం చెడిపోలేదు. ఏడుగురు సఖ్యతతో ఉంటూ తండ్రికి తగ్గ తనయులుగా రాజ్యపాలన కొనసాగించారు.

రోజులు అలా గడుస్తుండగా భారత ఉపఖండం పై ఒక పారశీక చక్రవర్తి గొప్పసైన్యంతో దాడికి తెగబడ్డాడు. తన దండయాత్రలో ఎదురైన ప్రతిరాజ్యాన్ని కబళించి, ప్రజలను హింసించి, కోటపై తన ధ్వజస్థంభాన్ని స్థాపించి తన ప్రతినిధిని సామంతుగా నియమించసాగాడు. ఆ పారశీక చక్రవర్తి లక్షమంది సైన్యంతో ఈ ఏడు గిరులపై దాడిచేసాడు. అన్నదమ్ములంతా కలిసి ఉమ్మడిగా ఆ పారశీక సైన్యాన్ని ఎదిరించారు. దిక్కులను కమ్మేసినట్టుగా ముప్పేట దాడిచేస్తున్న ఆ సైన్యాన్ని నిలువరించటం అసాధ్యమని గ్రహించిన అన్నదమ్ములందరూ యుద్ధంలో వీరమరణం పొందేందుకే నిర్ణయించుకున్నారు. కానీ అంతఃపుర స్త్రీలు శత్రువుల చేతికి చిక్కకుండా అంతఃపురానికి నిప్పుపెట్టించారు. వారసులను మాత్రమూ రహస్యంగా కోట దాటించారు.

ఆ భీకరయుద్ధం ముగిసే సరికి ఏడు రాజ్యాల్లో రాజులు, స్త్రీలు, సేనలు ఎవరూ ప్రాణాలతో మిగలలేదు. విగతజీవులతో నిండి ఉన్న ఆ రాజ్యాల పై ఎటువంటి ఆసక్తిని చూపక పారశీక చక్రవర్తి తన ప్రతినిధిని ఉమ్మడిగా అన్ని రాజ్యాలనూ ఏలుకోమని వదిలి వెళ్ళిపోయాడు.

కోటను దాటిన వారసులు సమీపాన అడవులలో తలదాచుకున్నారు. అడవిలోన గురుకులాల్లో బ్రాహ్మణులుగా చేరి వేషం మార్చుకుని వేదాలు నేర్చుకున్నారు. తమ రాజ్యాన్ని తిరిగి దక్కించుకోవాలని నిత్యం మంత్రాంగం నడిపారు. కానీ విదేశీ సేనలతో పటిష్టమైన ఆ కోటను జయించటానికి సరిపడా సేనలను సమకూర్చుకోలేకపోయారు. వయస్సు మళ్ళింది, ఇక తమ కల నెరవేరదని గ్రహించిన వారసులు, తమ రెండవ తరానికి తమ చరిత్ర చెప్పి ఎప్పటికైనా కోటను దక్కించుకొమ్మని చెప్పారు. రోజులు గడుస్తుండగా శత్రువుకి వీరి జాడ తెలిసింది. గురుకులం పైన దాడిచేయటానికి శత్రువులు వస్తున్నారనే ఉప్పందగానే రెండవతరం వారసులను అక్కడి నుండి తప్పించి, మొదటితరం తపోవనాలకు వెళ్ళిపోయింది.

రెండవతరం వారసులు దట్టమైన అడవుల మధ్య ఉండే ఆదివాసిలలో కలిసిపోయారు. ఆటవీకుల విద్యలు నేర్చుకుని అడవి పైన ఆధారపడి బ్రతుకుతూ కోటను దక్కించుకునేందుకు అలోచనలు చేస్తూ ఉండేవారు. ఆటవీకులను సైన్యంగా మార్చి దాడిచేయాలని ఆలోచించి ఒక దండుని తీసుకుని సారంగరాజ్యం సరిహద్దుల వరకూ వెళ్ళారు. కానీ అక్కడి సైన్యాన్ని, ఆయుధసంపత్తిని చూసి వారిని

ఎదిరించటం దుస్సాధ్యమని గ్రహించి వెనక్కి వచ్చేసారు. రెండవతరం కూడా ఏమీ చేయకుండానే అంతరించింది. కానీ తమ పెద్దల్లానే వీరు కూడా మూడవతరానికి తమ చరిత్ర చెప్పి, కోటను సాధించమని కోరారు.

మూడవతరం వారసులు చోరులుగా బ్రతుకుతున్న ఒక జాతి ప్రజలతో చేరారు. వారితోనే బ్రతుకుతూ చోరకళ నేర్చుకున్నారు. పెద్ద పెద్ద బురుజులను, గోడలను ప్రాకుతూ ఎక్కటం, ఎవరికీ చిక్కకుండా భవనాల్లో చొరబడి దోచుకోవటం నేర్చుకున్నారు. వీరికి రాజ్యాన్ని తిరిగి దక్కించుకోవలనే కోరిక లేదు. ఇన్ని తరాలుగా తమ పూర్వులు జయించలేని వారిని, ఏ యుద్ధవిద్యలూ తెలియని తాము జయించలేమనే అభిప్రాయంతో తమ బ్రతుకులు తాము బ్రతికారు. కానీ యధావిధిగా తమ వంశచరిత్ర నాలుగవతరానికి అందించి వెళ్ళిపోయారు.

చౌర్యం ద్వారా తమ పెద్దలు సాధించిన ఆభరణాలనూ, రత్నాలనూ, మణులను మూటలకెత్తుకుని నాలుగవతరం పట్టణాల్లో వ్యాపారులుగా స్థిరపడ్డారు. ఒకరికొకరు వ్యాపారంలో పోటీ కావటం ఇచ్చగించక ఒక్కొక్కరూ ఒక్కో పట్టణానికి పోయి వ్యాపారం చేసారు. అందరూ వ్యాపారంలో గొప్పగా సంపాదించినా దుర్వ్యసనాల పాలై చివరికి సమస్తం పోగొట్టుకుని మరణించారు. వీరు కూడా తమ వారసులకు వంశచరిత్రను కథలు కథలుగా చెప్పారు.

అయిదవతరం వారు ఆస్థులేమీ మిగలక వివిధ రాజ్యాల్లో వంటవారిగా స్థిరపడ్డారు. ఏడాదికోమారు అందరూ కలుసుకునేవారు. వీరికి వంశచరిత్ర ఒక కథగా మాత్రం మిగలటం చేత రాజ్యమనే ఆశే లేదు. కానీ తమ వంశప్రతిష్ఠ చెప్పుకునేందుకు మాత్రం ఆ కథలు చెప్పుకునేవారు. ఆరవతరం వారు తమ తండ్రులు వంటలు చేస్తున్న రాజ్యాల్లోనే సైన్యంలో చేరారు. అనేక యుద్ధాల్లో పాల్గొన్నారు. ఆ అనుభవలతో తర్కించి లక్షలమంది సైన్యమున్న పారశీకులను ఎదుర్కోవటం అవివేకమని భావించి రాజ్యం గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. కేవలం తమ శౌర్య,ప్రతాపాలను తమ రాజులను మెప్పించేందుకే ఉపయోగించారు.

ఏడవతరం మొదలయ్యింది. వరుసగా అందరూ ఆడపిల్లలే పుట్టారు. తమవంశం ఇక్కడితే ఆగిపోతుందని భావించారు ఆరవతరం వారసులు. ఆరవతరంలో అందరికంటే చిన్నవాడైన వారసుడు సునందుడు. సునందుడికి ఒకనాడు పరమేశ్వరుడు కలలో కనిపించి శైవక్షేత్రాలను దర్శించమని ఆదేశించాడు. అన్నలందరికీ విషయం చెప్పి, వారి అంగీకారంతో సునందుడు ప్రయాణం మొదలుపెట్టాడు.

అలా పుణ్యక్షేత్రాలను దర్శిస్తూ సునందుడు ఒక సముద్ర తీరానికి చేరుకున్నాడు. ప్రయాణం వలన కలిగిన అలసటతో అక్కడ ఇసుక తిన్నెలపై నిదురించాడు. మంచి నిద్రలో ఉన్న సునందునికి ఏదో అలజడి వినిపించి లేచాడు. అతనికి అతి సమీపంలో భయంకరమైన విషసర్పం పడగ విప్పి ఉంది. అది ఏ క్షణానైనా అతడిని కాటేసేందుకు సిద్ధంగా ఉంది. సునందుడి పై ప్రాణాలు పైనే పోయాయి. మనస్సులో పరమేశ్వరుడ్ని స్మరించుకున్నాడు. చోద్యం చూసేందుకు నిలబడ్డ ప్రజలగుంపు నుండి ఒక అపురూప సౌందర్యవతియైన కన్య ఒక్క పరుగున వచ్చి, వెనుక నుండి ఆ పాముని చేత చిక్కించుకుని, సముద్రంలోకి విసిరేసింది.

ఆమె తెగువను చూసి అచ్చెరువొందిన జనం తెల్లబోయి చూస్తుండగా, సునందుడు ఆమెను సమీపించి ఆమె ధైర్యాన్ని ఎన్నోవిధాలుగా పొగిడి, తన ప్రాణలు కాపాడినందుకు కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. తన పుట్టుపూర్వోత్తరాలు ఆమెకు వినిపించాడు. ఆమె తన

పేరు అముక్త అని, తాను సింహళరాజు సోదరుని కుమార్తెనని, తమ ఆతిధ్యం స్వీకరించమని ఆహ్వానించింది. సునందుడు ఆమె వెంట వెళ్ళాడు. అముక్త తండ్రి సునందుడిని గౌరవంతో చూసుకున్నాడు. సునందుడు తమ వంశచరిత్ర వారికి వివరించాడు.

వసంతుని పేరు ప్రఖ్యాతలు అప్పటికే విని ఉన్న అముక్త తండ్రి సునందుడిని పిలిచి తన కుమార్తెను వివాహం చేసుకోమని కోరాడు. సునందుడు మిక్కిలి సంతోషంతో ఆమెను తన భార్యగా స్వీకరించాడు. వారికి ఒక కుమారుడు కలిగాడు. తమ వంశానికి కీర్తి తెచ్చిన వసంతుని గుర్తుగా ఆకుమారుడికి కూడా వసంతుడని నామకరణం చేసారు. సునందుడు పంపిన వార్తను అందుకొని ఆరవతరం వారంతా తమ వారసుడ్ని చూడటానికి వచ్చారు. అతడిని అందరూ చినవసంతుడని పిలిచేవారు. అతడు గొప్ప యోగజాతకుడు. చినవసంతుడిని గొప్ప గొప్ప గురువుల వద్దకు పంపి అన్ని విద్యలూ నేర్పించారు.

అన్ని విద్యలూ నేర్చుకుని తిరిగి ఇంటికి చేరుకున్నాడు చినవసంతుడు. అరవతరం వారసులంతా వచ్చి చినవసంతునికి తమ వంశచరిత్ర వివరించారు. ఇక తాము వృద్ధలమయ్యామని, వంశాన్ని నిలిపేందుకు నువ్వున్నావనే ధైర్యంతో వెళుతున్నామని చినవసంతునికి అన్ని జాగ్రత్తలు చెప్పి, వారు అడవులకు వెళ్ళారు.

చినవసంతుడు సహజంగా మిక్కిలి చురుకైనవాడు, సంకల్పబలం ఉన్నవాడు. తమవంశ చరిత్ర తెలుసుకుని, ఏడు తరాలుగా రాజ్యాన్ని కోల్పోయి అనేక కష్టాలనుభవించిన తన పితృపితామహుల గూర్చి మిక్కిలి చింతించి, వారి కోరిక తీర్చటం తన కర్తవ్యంగా భావించాడు.

సారంగపురాన్ని దర్శించి అక్కడి పరిస్థితులను ఆకళింపు చేసుకున్నాడు. ఏ చిన్న దాడి జరిగినా పరుగున వచ్చేంత దూరంలో లక్షలమంది సైన్యం ఉందని గ్రహించాడు చినవసంతుడు. తన ఒక్కడివల్లా అయ్యే పని కాదు. సైన్యాన్ని సమకూర్చుకునేందుకు తనకా రాజ్యంలేదు, తగినంత ధనం లేదు. ఏం చెయ్యాలో పాలుపోక నిరాశతో ఒక తోటలో చెట్టు క్రింద కూర్చున్నాడు సునందుడు.

ఆ చెట్టు పై నుండి బాగా పండిన ఫలమొకటి క్రిందపడింది. ఒక చీమ ఆ ఫలం దగ్గరకు వచ్చి తీసుకునిపోవాలని చూస్తోంది. వసంతుడు ఆసక్తిగా గమనించసాగాడు. ఆ చీమ పోయి మరికొన్ని చీమలను తీసుకుని వచ్చింది. అన్ని చీమలూ కలిసి ఆ ఫలాన్ని తీసుకు వెళ్ళేందుకు ప్రయత్నించాయి, సాధ్యం కాలేదు. చినవసంతునికి ఆసక్తి పెరిగింది. చీమలు ఆ ఫలాన్ని తొలిచి కొంచెం కొంచెంగా తీసుకెళ్ళనారంభించాయి. కాసేపటికి తొక్క మాత్రమే మిగిలింది. ఫలమంతటినీ చీమలు తీసుకునిపోయాయి. చినవసంతునికి ఆ దృశ్యం ఒక గుణపాఠమయ్యింది. తనరాజ్యాన్ని తిరిగి సంపాదించుకునేందుకు ఉపాయం చిక్కింది.

చినవసంతుడు తమ మొదటితరం వారసులు గడిపిన గురుకులాలు తిరిగి సకల విద్యలనూ అభ్యసించిన యువకులను ఒక జట్టుగా ఏర్పాటు చేసాడు. రెండవతరానికి ఆశ్రయమిచ్చిన ఆదివాసులను కలిసి గురి చూసి విల్లంభులు కొట్టగల యువకులను చేరదీసాడు. మూడవతరం వారిని కలుపుకున్న చోరులను కలిసి సారంగపురంలో ఒక్కోగిరిలో ఒక్కొక్కటి చొప్పున ఉన్న ఖజానాలన్నింటిని దోచి ప్రజలకు తనపేర పంచమని కోరాడు. చినవసంతుడి పితామాహులతో ఉన్న పరిచయం వలన వారు కాదనలేక అతడి మాటను అంగీకరించారు. మిక్కిలి నైపుణ్యంతో కోటలను ఎగబ్రాకి ఖజానాలు దోచి, వసంతుడి రాజ్యం తిరిగి రాబోతుందని ప్రకటించి ఆ ధనాన్ని ప్రజలకు పంచేసారు.

కోటలో తగినంత ధనం లేక పరిపాలన స్థంబించింది. వ్యాపారులకు ధనం పంపమని కబురుచేసారు. కానీ నాలుగవతరం వారసులంటే ఉన్న అభిమానంతో వ్యాపారులంతా ధనసహాయం చేయకుండా, వ్యాపారాలను పక్కనబెట్టి పుణ్యక్షేత్రాలను దర్శించేందుకు వెళ్ళిపోయారు. జరుగుతున్న కుట్రను గ్రహించిన పారశీక ప్రతినిధి చక్రవర్తికి కబురుచేసాడు. ఆసరికి పారశీక సైన్యమంతా సారంగపురానికి అతి చేరువలోనే విడిది చేసి ఉన్నారు. ప్రతినిధి పంపిన వార్తను మోసుకు వెళుతున్న వార్తాహరుడ్ని అడవిలో అదివాసులు అటకాయించారు.

చినవసంతుని మాటపై పారశీక విడిదిలో ప్రవేశించిన ప్రత్యేక పాకశాస్త్రనిపుణులు మొదట తమ వంటతో వారిని మెప్పించి, తదుపరి ప్రత్యేకమైన మూళికలు కలిపిన వంటలతో పారశీక సైన్యాన్ని శక్తిహీనులను చేసారు. ఆదివాసులంతా ఏడు గిరులపై చేరి సారంగపురం లోపలి జీవిని బయటకు, బయట జీవిని లోపలికి పోకుండా కాపలా కాస్తున్నారు. బయట నుండి ఏ సహాయం అందక, రాజ్యంలో పరిపాలన స్థంబించి పారశీక ప్రతినిధి సంకటస్థితిలో పడ్డాడు. ప్రజలు అతడిని తిరస్కరించటం మొదలయ్యింది. ప్రజలు అతడిని తిరస్కరించటం మొదలుపెట్టారు. అదే సరైన సమయంగా భావించిన చినవసంతుడు తనకున్న చిన్న సైన్యంతో దండెత్తి క్షణాల్లో సారంగపురాన్ని చేజిక్కించుకున్నాడు.

ఏడుతరాలుగా రాజ్యాన్ని తిరిగి సంపాదించుకోవాలనే కోరిక నెరవేరకుండానే మరణించిన తన పితృపితామాహులందరికీ ఘనంగా తర్పణాలు అర్పించి, వారి శాంతి కోసం యజ్ఞాలు, యాగాలు చేయించాడు. వసంతుడి పరిపాలనను తలపించే రీతిన సారంగపురాన్ని పరిపాలించి, సుఖసంతోషాలతో కడదాక తులతూగాడు

కథ చెప్పటం ముగించి, సాలోచనగా విక్రముని వైపు చూసాడు గోపన్న. విక్రముడు సంతృప్తిగా తలపంకించాడు.

**తెల్ల తెల్లవారుతుండగానే అగ్రహారమంతా కోలాహలంగా ఉంది**. గడపలకు మావిడితోరణాలు, వాకిట్లో ముగ్గులు, ఎక్కడ చూసిన పూమాలలతో అగ్రహారమంతా శోభాయమానంగా ఉంది. అందమైన గోపస్త్రీలు నిండుగా అలంకరించుకుని గుంపులుగా వీధుల్లో నడుస్తుంటే ఆ అగ్రహారం అలనాటి వ్రేపల్లెను తలపిస్తోంది. అగ్రహారంలో ప్రాయానికొచ్చిన యువతీయువకులకి వివాహాలు నిశ్చయిస్తున్నారు. ఎక్కే గడప, దిగే గడపగా పేరంటాలు సాగుతున్నాయి. పేరంటంలో స్త్రీలకు పూసిన చందనపు పరిమళం, జడలో గుచ్చిన పూల పరిమళం గాలిలో చేరి ఊరంతా గుభాళిస్తోంది. వారలా సందడిగా తిరుగుతుంటే బంగారు గాజులు, మెడలో సూత్రాలు, కాలి మువ్వలు లయబద్ధంగా చేస్తున్న శబ్ధం సంగీతమల్లే వీనులవిందుగా వినవస్తోంది.

"కలువ కన్నుల నిండా కన్నయ్యే నిండిన
పదుచుపిల్లకు నేడు మనువాడె ఈడు
గుండె నిండా దిగులు కమ్ముకున్నది తండ్రికి
వరుడెవరంటే కోరింది కిట్టయ్యనే జోడు

**మది మదిలో నిండిన అల్లరోడు నవ్వాడు**

**మనువాడవొచ్చిన వరుడు ఆ రూపుగా తోచాడు**

**ఏడేడు లోకాల నిండిన నా సామిని**

**వేడుకుంటే వాడు ఏడు జన్మలకు తోడు"**

అగ్రహారంలో అమల అనే అమ్మాయి గొప్ప సౌందర్యవతి. ఆమెను పెండ్లాడాలని ఇరువురు గోపయువకులు పోటీ పడ్డారు. అమల తండ్రి ఒకడికి మాట ఇచ్చాడు. ఆమె తల్లి మరొక యువకుడ్ని ఎంపిక చేసింది. ఇద్దరు యువకులూ అమల నాదంటే, నాదంటు పోట్లాటకు దిగారు. మొత్తానికి ఆ పోట్లాట మూడు గడపల గొడవగా మారింది. ఊరంతా చోద్యం చూస్తూ నిలబడ్డారే తప్ప ఎవరూ ఇదీ న్యాయమని చెప్పలేకపోయారు. ఆ గొడవ తీర్చమని ఊరి జనాలంతా గోపన్నను ఆశ్రయించారు.

గోపన్న వారి పితూరి విని నిండుగా నవ్వాడు. అక్కడే ఉన్న రాకుమారులు గోపన్న ఈ సమస్యను ఎలా పరిష్కరించబోతున్నాడో అని ఆసక్తిగా గమనించసాగారు.

అందరినీ సావధానంగా కూర్చోమని చెప్పాడు గోపన్న. ఎదురుగా కాలుతున్న కట్టెల్ని చూస్తూ సాలోచనగా చెప్పనారంభించాడు గోపన్న.

"ఒక చిన్న మొక్క మొలిచినప్పుడు దానికి ఆలనాపాలన చూస్తాం. అది పెరిగి పెద్దయి పువ్వో, కాయో కాస్తే సంబరం చేస్తాం. ఏపుగా ఎదిగి పచ్చని చెట్టయ్యాక అందంగా ఉందని, నీడనిస్తుందని ఆనందపడతాం. అదే చెట్టు ఎండి మోడయిపోతే నరికి పొయ్యిలో పడేస్తాం. కాలిపోతున్న ఈ కట్టే నాడు పళ్ళిచ్చిన పచ్చని చెట్టని మనకి గుర్తుంటుందా? మనం ప్రేమగా పెంచుకుంటున్న ఈ కట్టె కూడా అంతే" అని తన శరీరాన్ని చూపించాడు గోపన్న.

సౌందర్యమే సర్వమని భావించి, ఆ మాయలో పడి జీవిత చరమాంకం వరకూ సత్యాన్ని గ్రహించలేకపోయిన పద్మవల్లి అనే రాకుమారి కథ విన్నారా ఎప్పుడయినా అని అడిగి, ఎవరూ మాట్లాడకపోయేసరికి కథ చెప్పటం మొదలుపెట్టాడు గోపన్న.

***గోపన్న చెప్పిన పద్మవల్లి కథ***

కాంచిపురాన్ని పరిపాలించే రత్నదీపునికి ఒక్కగానొక్క కుమార్తె కలిగింది. ఎన్నో నోములు, పూజలు చేసాక పుట్టిన కుమార్తె కావటంతో ఆమెను అల్లారు ముద్దుగా పెంచాడు. ఆమెకు పద్మవల్లి అని పేరు పెట్టి అపురూపంగా చూసుకునేవాడు. అంతఃపురంలో పరివారమంతా ఎప్పుడూ తన వెంటే ఉంటూ తనతో ఆడి, పాడేవారు. జాబిలి తునకలా మెరిసిపోయే పద్మవల్లి అందం చూడటానికి వేయికళ్ళు సరిపోయేవి కావు. తల్లి మొదలు అంతఃపురంలో స్త్రీలందరికీ ఆమెను అందముగా ముస్తాబుచెయ్యటం నిత్యకృత్యం. వనమంతా తిరిగి మేలైన పూలు తెచ్చి దండలు గుచ్చి పద్మ జడను అలంకరించేవారు. ప్రతిరోజూ సరికొత్త వస్త్రాలు, నగలు తెప్పించేవారు. రాజభవనమంతా ఆమె తిరుగుతుంటే చిన్నారి దేవకన్యలా ఉండేది. ముద్దులొలికే ఆమె రూపం గురించి విని పట్టణంలో ప్రజలు కూడా తరుచూ రాజభవనానికి వచ్చి ఆమెను చూసి వెళ్ళేవారు.

పద్మవల్లికి పెళ్ళీడు వచ్చింది. రత్నదీపునికి ఆమె వివాహం ఒక పెద్ద సమస్యగా పరిణమించింది. ఆమె సౌందర్యం గురించి ఆనోట ఈనోట విని దేశ దేశాల రాజులు, చక్రవర్తులు ఎందరో ఆమెను వివాహం చేసుకోవాలని ఆరాటంతో రత్నదీపునికి వర్తమానం పంపారు. తనంత అందగాడు వస్తే తప్ప వివాహం చేసుకునేది లేదని పట్టుబట్టి కూర్చుంది పద్మవల్లి.

ఏ రాకుమారుని చిత్రపటం తెచ్చినా కన్ను వంకర, ముక్కు వంకర అంటూ తిరస్కరించేది. రత్నదీపుడు ఆమెకు గొప్ప వీరుల గురించి, వారి వంశచరిత్ర గురించి చెప్పి ఒప్పించాలని చూసాడు. కానీ పద్మవల్లి తండ్రి ప్రయత్నాలన్నింటినీ తిరస్కరించింది. ఆమె అంగీకారం లేనిదే వివాహం జరిపించుటకు రత్నదీపునికి మనస్కరించలేదు.

తాము పంపిన వర్తమానాన్ని తిరస్కరించినందుకు సాటి రాజులు, చక్రవర్తులు రత్నదీపుని పై శతృత్వం పెంచుకున్నారు. రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఆమెకు వీలయినంత తొందరలో వివాహం చేయమని హితోభిలాషులు రత్నదీపుని హెచ్చరించారు. ఎటూ పాలుపోని రత్నదీపుడు కొలువుకు రావటం మానుకున్నాడు. దిగులుతో అంతఃపురంలోనే ఉంటూ, రాజ్యభారాన్ని మంత్రులకు అప్పగించాడు.

ఒక పౌర్ణమి నాటి రాత్రి పద్మవల్లి వెన్నెల్లో వనవిహారం చేస్తుండగా మొగలిపూల వాసన ఆమెను తాకింది. సమ్మోహనురాలైన పద్మవల్లి మొగలిపొదలను వెతుకుతూ వాటిని సమీపించింది. ఆమె ఆ పరవశంలో ఉండగా బుస్సుమంటూ భయంకరమైన విషసర్పం ఆ పొదల్లో నుండి బయటకి వచ్చింది. పద్మవల్లి నిశ్చేష్టురాలై నిలబడిపోయింది. మెరుపువేగంతో ఆ సర్పం పద్మవల్లిని కాటేసేందుకు పడగనెత్తింది. పద్మవల్లి కళ్ళు మూసి గట్టిగా కేకపెట్టింది.

ఆమె కళ్ళు తెరచి చూసేసరికి చెట్లమాటు నుండి ఒక యువకుడు ఒక్క ఉదుటున వచ్చి చాకచక్యంతో ఆ సర్పాన్ని పట్టుకుని దూరంగా విసిరేసాడు. పద్మవల్లి భయంతో స్పృహ కోల్పోయి కూలబడిపోయింది. ఆమె తిరిగి లేచేసరికి ఆ యువకుడు ఆమెకు సపర్యలు చేస్తూ కనిపించాడు. అంతఃపుర వనంలో ఎవరీ పరపురుషుడు? అనే స్పృహ ఆమెకు రాగానే చప్పున లేచి పక్కకు తప్పుకుంది.

ఆ యువకుడు కాస్త కంగారుపడి, వెను వెంటనే ఆమె భావాల్ని అర్థంచేసుకున్నవాడై తాను సమీపాన గల ఆనందపురాన్ని పరిపాలించే సామంతరాజునని, తన పేరు ఆనందవర్ధనుడని వివరాలు చెప్పాడు. పద్మవల్లి తన మేలిముసుగులో నుండి ఓరకంట అతడ్ని గమనించింది. స్పురద్రూపి, మాటతీరు మృదువుగా ఉంది. అన్నింటికీ మించి తన ప్రాణాలు కాపాడినవాడు. ఆమె ఆ క్షణమే అతడ్ని వరించింది.

ఆనందుడ్ని అంతఃపురంలోనికి ఆహ్వానించింది. తండ్రిని పిలిచి తన నిర్ణయాన్ని ప్రకటించింది. ఆనందుడు అందగాడన్న మాటే తప్ప మిగిలిన ఏ విషయాల్లోనూ రత్నదీపుడు సంతృప్తి చెందలేదు. ప్రాణాలను కాపాడిన ఆప్తునిగా అతడ్ని సత్కరిద్దాం, ఆజన్మాంతం ఋణపడి ఉందాం అంతే కాని వివాహం తగదని పద్మవల్లితో చెప్పి చూసాడు. ఆమె అందుకు అంగీకరించలేదు. నా అంతటి అందగాడు అతడేనని, దేవుడి సంకల్పంతోనే తాము కలుసుకోగలిగామని చెప్పి మొండితనం వహించింది. చేసేదేమీ లేక రత్నదీపుడు ఆమె వివాహం, ఆనందునితో జరిపించాడు. ఆనందుడు ఆమెను తీసుకుని వెంటనే తన రాజ్యానికి వెళ్ళిపోయాడు.

పద్మవల్లి వివాహ వార్త అన్ని రాజ్యాలకు చేరింది. తమను కాదని ఒక సామంతుకు ఆమెనిచ్చి వివాహం జరిపించటం అవమానంగా భావించి రాజులంతా ఏకమై రత్నదీపుని పైకి దండెత్తారు. ఈ పరిస్థితిని ముందే ఊహించిన రత్నదీపుడు ఒక్క రక్తపుబొట్టు కూడా నేల రాలకుండా, రాజ్యాన్ని వారికి అప్పగించి భార్యతో సహా అడవులకు వెళ్ళిపోయాడు.

ఆనందపురంలో పెళ్ళివేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. రాజభవనమంతా రంగురంగుల కాంతులతో శోభాయమానంగా ఉంది. లోక ప్రసిద్ధమైన అందాలరాశిని తమ ప్రభువు వరించి తీసుకుని వచ్చాడని తెలిసి రాజ్యమంతా సంబరాలు చేసుకుంటున్నారు. పట్టణంలో ప్రజలంతా విందు విలాసాల్లో మునిగి తేలిపోయారు. పద్మవల్లికి పట్టరాని ఆనందంగా ఉంది. అందగాడైన ఆనందవర్ధనుడితో తన జీవితం మొదలు కాబోతోంది. తమ జంట భావితరాలకి గొప్ప ఉపమానం కాబోతోందని ఆమె ఉత్సాహపడుతోంది.

ఆనందపురంలో ప్రజలంతా ఈ మైకంలో ఉండగా శతృదేశపు రాజు నరసింహభూపతి పెద్దసైన్యంతో దండెత్తి వచ్చాడు. ఆనందపురంలో భద్రతా సిబ్బంది, సైన్యం ఎవరూ అప్రమత్తులై లేకపోవటంతో సునాయాసంగా నరసింహుడు తన సైన్యంతో నేరుగా రాజభవనంలోకి ప్రవేశించాడు. ఆ హటాత్పరిణామానికి అందరూ నివ్వెరపోయారు. నరసింహుని సైన్యం మంత్రి సహా సకల సిబ్బందిని క్షణాల్లో బంధించారు. వివాహ వేడుక తమకంలో ఉన్న ఆనందుడు నిస్సహాయుడై నరసింహుని ముందు నిలబడ్డాడు. ఆనందుడు బంధింపబడ్డాడని తెలియగానే పద్మవల్లి అంతఃపురం నుండి పరుగున వచ్చింది.

నరసింహుడు మిక్కిలి దర్పంతో ఆనందుడ్ని చూసి "నీ రాజ్యంలో నేను తీసుకుని వెళ్ళేందుకు నా దగ్గరలేనివి, అమూల్యమైనవి ఏమున్నాయి? ఏమీలేవు. ఈ రాజ్యాన్ని, ఈ సంపదను నీవే ఉంచుకో. కాని అపురూప సౌందర్యరాశియైన పద్మవల్లిని మాత్రం నాకప్పగించు" అని అవహేళనగా పలికాడు.

నిస్సహాయుడైన ఆనందుడు ఆ అవమానాన్ని భరించలేకపోయాడు. నరసింహుడు అవసరమైతే తనని చంపైనా సరే పద్మవల్లిని తీసుకునే వెళతాడన్న విషయం అతనికి అర్ధమయ్యింది. నరసింహుని వైపే తీక్షణంగా చూస్తూ, ఎవరూ ఊహించని విధంగా తన శిరస్సుని ఖండించుకున్నాడు. నరసింహుని సహా అందరూ ఒక్క క్షణం తత్తరపాటుకి లోనయ్యారు. పద్మవల్లి కన్నీరు మున్నీరుగా రోదించింది.

పద్మవల్లిని తనతోపాటు తీసుకుపోయిన నరసింహుడు అంతఃపురంలో ప్రత్యేక మందిరాన్ని కేటాయించి సకల మర్యాదలతో చూసుకోసాగాడు. నరసింహునికి మాత్రం మానసిక శాంతి కొరవడింది. ప్రాణత్యాగం చేస్తూ ఆనందుడు చూసిన చివరి చూపు అతడి మస్తిష్కంలో ముద్రించుకుపోయింది. రాత్రులు నిద్రపట్టేది కాదు. కళ్ళు మూస్తే దీనంగా చూస్తున్న ఆనందుడి మొహం కనిపించేది. అతడు భళ్ళున తన మీద రక్తం కక్కినట్టుగా కలలో కనిపించేది. నరసింహుడు కంగారుగా లేచి తన శరీరమంతా తడిమి చూసుకునేవాడు. ఈ వ్యధలో అతడికి అన్న,పానియాలు సహించేవి కావు. ఆహారం, నిద్ర లేక క్రమంగా నీరసించిపోయాడు.

ఏడాదికాలం గడిచిపోయింది. పద్మవల్లి దుఃఖం నుండి బయటపడింది. ఏడాదికాలంగా తనను ఏవిధంగాను బాధపెట్టని నరసింహుని ఔదార్యాన్ని గ్రహించింది. తన మందిరంలోని పరిచారికల ద్వారా నరసింహుని గుణవిశేషాలు తెలుసుకుని ద్వేషభావాన్ని వీడింది. కానీ నరసింహునికి మాత్రం శాంతి లభించలేదు. నరసింహుని స్థితి తెలుసుకుని రాజవంశ హితం కోరే పెద్దలంతా దేశ దేశాల నుండి విచ్చేసారు. పండితులనూ, పురోహితులనూ పిలిచారు. మహారాజు మానసికస్థితిని, అతడనుభవిస్తున్న మానసికవ్యధను వివరించారు. పండితులు నరసింహుని నక్షత్రబలాలు, జాతకచక్రాలు పరిశీలించి పుణ్యక్షేత్ర దర్శనాన్ని సూచించారు.

అంతఃపురకాంతలతో సహా నరసింహుని తీసుకుని కాశీకి ప్రయాణమయ్యారు. గంగానదిలో స్నానం చేయించారు. ఆ పవిత్ర గంగానదీ తీరంలోనే యజ్ఞాలు నిర్వహించారు, ప్రాయశ్చిత్తాలు జరిపించారు. మానసిక శాంతి కలిగేందుకు వేదపఠనం, పురాణకాలక్షేపాలు

చేయించారు. కాశీపట్టణంలో గంగానది తీరంలో ఒక భవనాన్ని నిర్మించి, అన్ని వసతులు కల్పించి, తగినంతమంది పరిచారికలను అప్పగించి, పద్మవల్లిని అక్కడే నివసించమని సగౌరవంగా చెప్పి ఆమెను అక్కడే విడిచి నరసింహుడు తన అనుయాయులతో తన రాజ్యానికి తిరిగి వెళ్ళిపోయాడు.

పద్మవల్లి జీవితం మరలా మోడుబారింది. ఆ భవనంలోఒంటరిగా నిస్సారమైన జీవితాన్ని గడిపేది. ఆనందుడు, నరసింహుడు ఆమె స్మృతిపథంలో చెరిగిపోయినా, తండ్రి గుర్తొచ్చేవాడు. తండ్రి గుర్తొచ్చిన రోజుల్లో ఒంటరిగా తన మందిరంలో కూర్చుని రోజంతా ఏడ్చేది. పరిచారికలు ఆమెను ఓదార్చటానికి ఎన్నో విధాలుగా అనునయించేవారు. ఎప్పుడు తినేదో ఏం తినేదో తెలిసేది కాదు. పరిచారికలు మాత్రం సమయానికి ఆమెకు అన్ని అందుబాటులో ఉంచేవారు. రోజంతా తన మందిరంలో నిలబడి దూరంగా కనిపిస్తున్న గంగానదిని చూస్తూ ఉండేది. తనకంటే ఆ గంగానదిలో తిరిగాడే పడవలు, చేపల కోసం నదిపై ఎగురుతూ తిరిగే కొంగలు అదృష్టవంతులు అనుకునేది.

ఏళ్ళు గడిచిపోయాయి. పరిచారికలు కొందరు చెప్పకుండా వదిలి వెళ్ళిపోయారు. పద్మవల్లి పై అభిమానం కల కొందరు మాత్రమే మిగిలారు. పద్మవల్లి జీవనంలో కొత్త మార్పులేవీ రాలేదు. ఎప్పటిలానే ఒకరోజు తనమందిరం నుండి గంగానదీ తీరంలో వచ్చిపోయే పడవల్ని చూస్తూ కూర్చుంది. నదీతీరంలో ఇసుకతిన్నెలపై తిరుగాడుతున్న వ్యక్తి పడిపోవటం గమనించింది. కొంత వ్యవధి గడిచినా అతడు లేవకపోవటం చూసి తన పరిచారికలను వెంటతీసుకుని నదీతీరానికి వెళ్ళింది.

చూడగా అతడొక వృద్ధుడు. దుస్తులు, ఆభరణాలను చూస్తే ఏ రాజ్యానికో రాజల్లే అనిపిస్తుంది. పరిచారికల సాయంతో అతడ్ని భవనానికి చేర్చి సపర్యలు చేసింది. వైద్యుడిని పిలిపించి అతడిని పరీక్షించమని చెప్పింది. వైద్యుడు పరీక్షించిన పిమ్మట రోగి మనోవ్యథతో బాధపడుతున్నాడని, నీరసించి ఉన్నాడని చెప్పి మందులిచ్చి వెళ్ళాడు. సమయానికి మందులిస్తూ, మంచి భోజనం అందే ఏర్పాట్లు చేసి అతడు కోలుకునేవరకూ కనిపెట్టుకునే ఉంది పద్మవల్లి.

అతడు కోలుకుని తాను కాశీ పట్టణానికి సమీపంలో ఉన్న విధ్యాపురి అనే గొప్ప రాజ్యానికి ప్రభువునని, తన పేరు కార్తికేయుడని, భార్యా వియోగం వలన కలిగిన దుఃఖముతో గంగానదీ తీరంలో సంచరిస్తూ ఉన్నానని తన వృత్తాంతం చెప్పాడు. పద్మవల్లి సేవకులను పిలిచి అతడి రాజ్యానికి కబురు పంపింది. మంత్రి, సైన్యాధ్యక్షులతో కూడి అతడి పరివారం తరలి వచ్చింది. ఆరోగ్యవంతుడైన తమ ప్రభువుని చూసి వారు ఎంతో సంతోషించి, పద్మవల్లికి తమ కృతజ్ఞతలు తెలియజేసారు.

కార్తికేయుడు తన రాజ్యానికి వెళ్ళే ముందు పద్మవల్లిని సమీపించి, "చూడగా ఈ కాశీ పట్టణంలో ఒంటరిగా నివసిస్తున్నారు. జీవితమందు అనురక్తి లేని వారు అంత్యకాలమందు గడిపే జీవనం సాగిస్తున్నారు. కారణాంతరాలు ఉండి ఉండొచ్చు గాక, నేను ప్రశ్నించను. కానీ సాదారణ జీవితం గడిపాలనే కోరిక మీలో ఉంటే నేను మిమ్మల్ని వివాహం చేసుకోవాలనుకుంటున్నాను" అని అడిగాడు.

నిస్సారమైన జీవితం గడుపుతున్న పద్మవల్లికి ఎటువంటి ఆసక్తీ కలుగలేదు. కానీ ఆమె పరిచారికలు ఆమెకు ఎన్నో విధాలుగా హితవు పలికి ఆ వివాహానికి అంగీకరింపజేసారు. ఆమె కార్తీకుడితో విద్యాపురి చేరుకుంది. ఆ పట్టణమంతా పెద్ద పెద్ద ప్రాకారాలతో, గొప్ప రాజప్రాసాదాలతో నిండి ఉంది. ప్రభువైన కార్తీకుడు కళారాధకుడు. మందిరాలన్ని నిత్యం సంగీతంతో, మంజీరనాదాలతో ప్రతిధ్వనిస్తున్నాయి.

పద్మవల్లి జీవితం వర్ణరంజితమయ్యింది. నిలువెత్తు ఆనందాన్ని ఆమె జీవితంలో ఎవరో కడవలతో పోస్తున్నట్టుగా ఉక్కిరిబిక్కిరయ్యింది. గొంతెత్తి పాడింది, గజ్జె కట్టి ఆడింది. వనమంతా మయూరంలా పరుగులు తీసింది. కార్తీకుడు ఆమెను ఎంతో ఆప్యాయంగా, ప్రేమగా చూసుకునేవాడు. ఆమెలో కలిగిన మార్పులు గుర్తించి ఆమెను ప్రోత్సహించేవాడు. కార్తీకుడు ఆమెకు గొప్ప గొప్ప దేవాలయాలు, విద్యాలయాలు, వనాలు, అడవులు, జలపాతాలు చూపించాడు. ఆమె కార్తీకుడ్ని ఎంతగానో ఆరాధించింది. ఆమెలో దాగిన కళలు తిరిగి ఊపిరిపోసుకున్నాయి.

ఒకరోజు ప్రాతఃకాలంలో నదీతీరంలో కార్తీకుడు సంధ్యావందనం చేస్తున్నాడు. ఆ సుందర దృశ్యాన్ని చూసి ఆమె పులకరించి ఆ దృశ్యాన్ని చిత్రపటంగా చిత్రించింది. కార్తీకుడు సంధ్యావందనం ముగించుకుని నీళ్ళు విడిచాడు, ఉత్తరక్షణంలో ప్రాణాలు కూడా. పద్మవల్లి నింగి కూలి తనపై పడ్డట్టుగా బిగుసుకుపోయింది, దుఃఖాదిదేవతే అయ్యింది. ఆమెను వారించటానికి ఎవరికీ తరం కాలేదు. ప్రాణత్యాగానికి సిద్ధపడింది. పరివారమంతా అమెను పట్టి నిలువరించారు. ఆమె కళ్ళ ఎదుటే కార్తీకుడు కదలి వెళ్ళిపోయాడు. రాజ్యంలో ఉన్న ప్రజలు, కళాకారులు, పండితులు వచ్చి భోరున విలపించారు. కార్తీకుని పై తనకున్న అనురాగానికి గుర్తుగా దేశ దేశాల నుండి బ్రాహ్మణులను రప్పించి ఉత్తరక్రియలు ఘనంగా జరిపించింది పద్మవల్లి.

పద్మవల్లికి ఇక ఒక్క బాధ్యత మిగిలిపోయింది. కార్తీకునికి మొదటి భార్య వలన కలిగిన ప్రదీపవర్మ అప్పటికింకా పసి ప్రాయంలో ఉన్నాడు. మంత్రి,ఆచార్యులతో చర్చించి అతడిని పట్టాభిషిక్తుడ్ని చేసింది. తాను వానప్రస్థం స్వీకరించి పట్టణం వెలుపుల నదీతీరంలో ఒక ఆశ్రమాన్ని నిర్మించుకుని అక్కడే వసించనారంభించింది. ప్రదీపుడు, మంత్రులు అను నిత్యం వచ్చి ఆమెను సందర్శించి వెళ్ళేవారు. ప్రజల బాగోగులు, ప్రదీపునికి ఎదురయ్యే పరిపాలనా చిక్కులు అడిగి తెలుసుకునేది పద్మవల్లి. ప్రదీపునికి అవసరమైన సూచనలు, హెచ్చరికలు చేసేది. తండ్రి వలనే పండితులను, కళాకారులను, వీరులను, విద్యావేత్తలను ఆదరించమని ప్రజలను ప్రేమగా పరిపాలించమని హితవు చెప్పేది. తండ్రిని మించిన ప్రభువు కమ్మని ఆశీర్వదించేది. ప్రదీపుడు యుక్తవయస్సుకు రాగానే అతడికి వివాహం జరిపించింది. అతడి సుఖసంతోషాలను చూసి ఆనందించింది.

ఒకనాటి రాత్రి ఆమెకు కలలో తండ్రి, ఆనందుడు, కార్తీకుడు కనిపించారు. వారికి కొంత దూరంలో గొప్ప వెలుగు కనిపించింది. ఆ ముగ్గురూ ఒక్కరొక్కరుగా వెళ్ళి ఆ తేజస్సులో ఐక్యమయిపోయారు. ఆమె నిద్ర నుండి మేల్కొని ఆశ్రమాన్ని వదిలి వెళ్ళిపోయింది. ఉదయాన్నే వచ్చి చూసిన ప్రదీపునికి ఆమె జాడ తెలియలేదు. సైన్యాన్ని పంపి నలు దిక్కులా వెతికించాడు అయినా ఆమె జాడ ఎవ్వరికీ ఎప్పటికీ తెలియలేదు.

పద్మవల్లి కథను చెప్పటం ముగించిన గోపన్న అందరినీ చూసి "ఆనందమయమైన జీవితానికి సౌందర్యమూ, సంపద ముఖ్యమనుకునే వారికి పద్మవల్లి కథే ఒక కనువిప్పు. ఏది ప్రాప్తమో అదే దక్కుతుంది. సంతోషమైనా, దుఃఖమైనా పూర్వజన్మ కర్మఫలాలుగా సంప్రాప్తిస్తాయి." అని చెప్పాడు.

అమలను పెళ్ళాడాలని తగవు పడుతున్న యువకులిద్దరినీ పిలిచి “ఋణాను బంధ రూపేణా పశు పత్నీ సుతాలయా” అని హితవు చెప్పి, ఆమె అభీష్టాన్ని తెలుసుకోమని సూచించాడు.

అమలను ఆశీర్వదిస్తూ "నీకు నచ్చిన వారిని నువ్వే ఎంపిక చేసుకో. ఎంపిక చేసుకునేప్పుడు పద్మవల్లి కథ గుర్తుంచుకో" అని చెప్పి, అందరినీ సావధాన పరిచి ఇళ్ళకు పంపించాడు గోపన్న. రాకుమారులు **కూడా గోపన్న చెప్పిన హితవును మనసులో నింపుకుని విడిదిలోకి నడిచారు.**

**"అటుకులిచ్చినింట బాధలన్ని**

**చిటికెలోన తీర్చెనంట**

**శరణన్న నరునికి**

**నారాయుడై కాచెనంట**

**నల్లనయ్య తోటి చెలిమి**

**నట్టింట్లో కలిమి కదా**

**కిట్టయ్య తోడుంటే**

**గుండెల్లో బలిమి కదా"**

తూరుపు వాకిట వెలుతురు అడుగిడి, పొద్దుకు ఆహ్వానం పలుకుతోంది. అగ్రహారమంతా ఉదయరాగం వినిపిస్తోంది. ఆడవారంతా వాకిట రంగవల్లులు దిద్దుతున్నారు. గోపాలురు పాటలు పడుకుంటూ గోవుల వెంట అడవి దారి పట్టారు. రాకుమారులు ముగ్గురూ నదీ తీరంలో సంధ్య వార్చుకుంటున్నారు. గోపన్న అప్పుడే సూర్య నమస్కారాలు ముగించుకుని, నుదుటికి నామాలు దిద్దుకుంటున్నాడు. కొంతమంది గోప యువకులు అక్కడే నీటిలో ఆటలాడుతున్నారు.

దూరంగా గుర్రపు డెక్కల చప్పుడు వినపడింది. సైనిక దుస్తుల్లో ఉన్న ఇద్దరు అటు వైపుగా వస్తున్నారు. గోపన్న కనుసైగతో ఇరువురు గోప యువకులు వారికి ఎదురెళ్ళారు. సైనికులిద్దరూ గుర్రాలు దిగి నడిచి వచ్చి గోపన్న చేతికి ఒక లేఖను అందజేసారు. ఆ లేఖను పంపింది త్రికూటమనే రాజ్యాన్ని పాలించే రాజు శంభుదేవుడు. అతడు కళింగదేశానికి, రాజ వంశానికి ఎంతో ఆప్తుడు. రాకుమారుల తండ్రి సుకేతుడనిన శంభునికి ఎంతో అభిమానం.

జరిగిన వృత్తాంతం ఆలస్యంగా తెలిసిందని, రాకుమారుల జాడ తెలిసిన తనకు తెలియజేయమని, వారి రక్షణ బాధ్యత తాను వహిస్తానని లేఖ సారాంశం.

లేఖ చదివిన గోపన్న ఒక్క క్షణం దీర్ఘంగా ఆలోచించి, రాకుమారుల జాడ తెలియగానే తానే స్వయంగా తోడ్కొని వస్తానని తన మాటగా ప్రభువులతో చెప్పమన్నాడు గోపన్న. సాదారణ దుస్తుల్లో ఉన్న రాకుమారులను ఆ సైనికులు గుర్తించలేకపోయారు. సైనికులు అక్కడ నుండి వెళ్ళిపోయారు.

వెంటనే గోపన్న అక్కడున్న యువకులందరినీ పిలిచి, అడ్డదారిలో వెళ్ళి ఆ సైనికులని బంధించి, కాళ్ళు చేతులు కట్టి పులులు, సింహాలు తిరిగే లోయలో పడేయమని చెప్పాడు. గోపన్న మాట ముగియటంతోనే యువకులంతా చిరుతల్లా పరుగందుకున్నారు.

జరుగుతున్నదేంటో అర్ధం కాని రాకుమారులు నిర్ఘాంతపోయి గోపన్ననే చూస్తూ నిలబడిపోయారు. వారి ఆశ్చర్యాన్ని గ్రహించిన గోపన్న దగ్గరకు పిలిచి రాకుమారులారా, “రాజ్యాన్ని పరిపాలించే రాజు నిత్యం అప్రమత్తుడై ఉండాలి. అందులోనూ మీరిప్పుడు ఆపదలో ఉన్నారు. ఆసరాకు ఏదో ఒక మార్గం దొరికిందని భావించి తెలియని వారితో చేతులు కలిపితే అది మీ ప్రాణాలకే ప్రమాదం.

ఈ లేఖలో శంభు మహారాజు గారి రాజముద్ర లేదు గమనించారా? ఆ సైనికుల వేషభాషలు, తీరు ఏవీ శంభు మహారాజావారి సంప్రదాయంలో లేవు. అత్యంత సాత్వికుడైన శంభురాజు గారు ఇలాంటి వారినా మీ కోసం పంపేది? ఇందులో ఏదో కుట్ర ఉంది. వారి మొలలో ధరించిన చురకత్తులను గమనించారా? ఆ కత్తుల చివర ఒక రంధ్రంలా గుంట కనిపించింది. సాదారణంగా ఇలాంటి రంధ్రం కలిగిన కత్తులను విష ప్రయోగం కోసం ఉపయోగిస్తారు. ఆ గుంటలో కాలకూట విషం ఉంటుంది. మోసంతో శత్రువులను మట్టుబెట్టాలనుకునే వారే ఇలాంటి కత్తులను ఉపయోగిస్తారు. శంభు మాహారాజు గారితో, మీ తండ్రి గారికి ఉన్న సాన్నిహిత్యాన్ని అడ్డుపెట్టుకుని మీ జాడను పసిగట్టేందుకు వచ్చిన చారులు వీరు” అని చెప్పాడు గోపన్న.

రాకుమారులు పెద్దముప్పు తప్పిందన్న విషయాన్ని గ్రహించారు. గోపన్న సూక్ష్మబుద్ధికి, సునిశిత పరిశీలనకు ఆశ్చర్యపడ్డారు.

“మరి ఆ దుర్మార్గులను ఇక్కడే ఎందుకు సంహరించలేదు?” అని పిడికిలి బిగిస్తూ అడిగారు రాకుమారులు.

గోపన్న చిరునవ్వు నవ్వి “ఈ చారులు కళింగ రాకుమారులను వెతుక్కుంటూ మన అగ్రహారం వరకూ వచ్చిన వార్త అన్ని గ్రామాల్లోనూ తెలిసే ఉంటుంది. వారిని ఇక్కడే మట్టుబెడితే, శత్రువుకి మనమే దారి చెప్పినట్టవుతుంది” అని చెప్పాడు.

విక్రమసేనుడు మనసంతా భారమయ్యింది, తమ్ములను దగ్గరకి తీసుకుని, గద్గద స్వరంతో

"ఈ కుట్ర పన్నిన దుర్మార్గులెవరో? మా తండ్రిగారు స్నేహితులను ఎంతగానో ఆదరించేవారు. అలాంటిది ఆయన ఆప్తుల పేరిట జరిగిన ఈ కుట్రను ఎలా అర్ధం చేసుకోవాలో తెలియటం లేదు" అని బాధపడ్డాడు.

గోపన్న రాకుమారులని సమీపించి "అంతా మన మంచికే. అడవిలో పులి గాండ్రింపు వినేంత వరకూ మేకపిల్ల అడవంటే స్వేచ్ఛ, ఊరంటే మెడకట్టు అనుకుంటుంది. పొదలో ఆపదను గుర్తించటానికి కంటిచూపు మాత్రమే సరిపోదు, అడవిని తెలుసుకున్న అనుభవం కావాలి. ఇలాంటి ప్రమాదాలే మనల్ని అప్రమత్తులను చేస్తాయి. మీ తండ్రిగారు స్నేహితులందరినీ ఒకేలా ఆదరించినా ఆయన వైభవాన్ని, గొప్పతనాన్ని చూసి ఓర్వలేని ఎందరో అసూయపడేవారు. ఆయన స్నేహితులే కొందరు కళింగ పతనం కోరుకున్నారు. అందుకే ఈ రోజున కళింగ రాకుమారులు ఇలా అగ్రహారంలో తలదాచుకున్నారు" అని నిట్టూర్పు స్వరంతో చెప్పాడు.

ఈలోకంలో దుర్మార్గులైన స్నేహితులు కూడా ఉంటారని చెప్పే కార్తికేయ మహారాజు కథ చెబుతాను వినండి అని కార్తికేయ మహారాజు కథను చెప్పనారంభించాడు గోపన్న.

*కార్తికేయ మహారాజు కథ*

పూర్వం సర్వసిద్ది అనే మహాముని గురుకులంలో కార్తికేయుడనే రాకుమారుడు విద్యనభ్యసించేందుకు వచ్చాడు. ఆ ఆశ్రమంలోనే ఉంటున్న మరో రాకుమారుడు నాగేంద్రవర్మతో అతనికి స్నేహం కుదిరింది. కార్తికేయుడు వినయశీలి, మృదుస్వభావి. గురువుగారికి మిక్కిలి భక్తి,శ్రద్ధలతో సుశృష చేసేవాడు. గొప్ప చక్రవర్తి కుమారుడైనాసరే గురుకులంలో అందరితో సమానంగా మసలేవాడు. అందరితోనూ స్నేహంగా ఉండేవాడు. గురుకులంలో సహాధ్యాయులతో కలిసి అడవికి వెళ్ళి కట్టెలు తేవటం, పూజకు పువ్వులు తేవటం, నది నుండి నీటిని తేవటం వంటి ఆశ్రమ బాధ్యతల్లో ఉత్సాహంగా పాలు పంచుకునేవాడు. ఆశ్రమంలో అందరికీ అతడంటే ఎంతో అభిమానం.

నాగేంద్రుడికి ఈ ఒరవడి నచ్చేది కాదు. అతడు రాకుమారుడనే దర్పాన్ని ప్రదర్శించేవాడు. గురువు ముందు వినయం ప్రదర్శిస్తూ, గురువు లేనప్పుడు అందరిపై అజమాయిషీ చేసేవాడు. మిత్రుడు కార్తికేయుడు ఎంత హితవు చెప్పినా నాగేంద్రుడు చెవికెక్కించుకునేవాడు కాదు. అతడి స్వభావాన్ని అర్ధం చేసుకున్న స్నేహితులు సర్దుకుపోయేవారు.

కార్తికేయుని వినయ విధేయతలకు ముగ్దుడైన గురువు సర్వసిద్ధి అతడిని తన ప్రియశిష్యునిగా ప్రకటించి, తనకు తెలిసిన విద్యలన్నీ నేర్పేవాడు. అది నాగేంద్రునికి గిట్టేది కాదు. అయినా కార్తికేయునితో స్నేహం నటిస్తూ ఉండేవాడు.

ఒకనాడు గురువు ఒక ప్రత్యేకమైన ధ్యానం కోసం సూర్యోదయానికి ముందే చీకటిలోనే నిద్ర లేచి, తన వెంట కార్తికేయుడిని, నాగేంద్రుడిని తీసుకుని నదీతీరానికి బయల్దేరాడు. తన నిద్ర చెడగొట్టినందుకు మనసులో గురువుని తిట్టుకుంటూ నాగేంద్రుడు వారిని అనుసరించాడు. కార్తీకేయుడు అప్రమత్తంగా పరిసరాలు గమనిస్తూ ముందుగా నడుస్తుండగా మిగిలిన ఇద్దరూ అతడినే అనుసరిస్తున్నారు.

ముగ్గురూ దట్టమైన అడవిలో పొదల మధ్య నుండి ఇరుకు దారిలో నడుస్తుండగా, గుబురుగా ఉన్న ఒక చెట్టు పై నుండి ఒక కొండచిలువ వారి పైన పడింది. ఆ బరువుకి ముగ్గురూ తూలి క్రింద పడ్డారు. వెంటనే తేరుకున్న నాగేంద్రుడు వేగంగా కదిలి కొండచిలువ పట్టు తప్పించుకున్నాడు. ఆకలిగా ఉన్న కొండచిలువ గురువుని, కార్తికేయుడిని గట్టిగా చుట్టుకున్నది. కొండచిలువకు తల వైపు ఉన్న కార్తికేయుడు చురుకుగా కదిలి, దాని నోరు తెరవనీకుండా బలంగా ఒడిసి పట్టుకున్నాడు.

నాగేంద్రుని సహాయం కోసం గట్టిగా అరిచాడు కార్తికేయుడు. కార్తికేయుని పై అసూయ, తనకంటే కార్తికేయుని ప్రియంగా చూకుంటున్న గురువు మీద కోపంతో ఉన్న నాగేంద్రుడు ఇదే తగిన సమయమని భావించాడు. ఇద్దరినీ వదిలించుకుని ఆశ్రమానికి వెళ్ళి కొండచిలువ మింగేసిందని మింగేసిందని చెబితే అందరూ ఏడ్చి ఊరుకుంటారు. ఎలాగూ తన విద్య పూర్తికావొచ్చింది కాబట్టి తాను తన రాజ్యానికి వెళ్ళి సుఖంగా జీవించవచ్చని భావించాడు. కానీ తన కుటిలబుద్ధిని బయటపెట్టకుండా

“మిత్రామా ఉండు బలమైన కట్టె తీసుకుని వస్తాను” అని చెప్పి అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

వృద్ధుడైన గురువుగారి కష్టాన్ని గ్రహించిన కార్తికేయుడు ప్రాణత్యాగానికి సిద్దపడ్డాడు. కొండ చిలువపట్టునంతా తన పైకి బలంగా లాక్కుని, ఆ పట్టు నుండి గురువుగారిని తప్పించాడు. కొండచిలువ నోటిని మాత్రం బలంగా పట్టుకునే ఉన్నాడు. ఆగ్రహంతో చిలువ

కార్తికేయుని మరింత గట్టిగా చుట్టేసింది. అప్పటివరకూ శ్వాస అందక ఇబ్బందిపడ్డ గురువు స్థిమితపడి కార్తికేయుని రక్షించే ప్రయత్నం చేసాడు. తన కోసం ప్రమాదం కొనితెచ్చుకోవద్దని, తక్షణమే అక్కడి నుండి వెళ్ళిపొమ్మని కార్తికేయుడు గురువుతో చెప్పాడు.

కార్తికేయుని గురుభక్తికి, త్యాగానికి గురువు కదిలిపోయాడు. స్వప్రయోజనం కోసం ఎప్పుడూ వినియోగించని తన మంత్రశక్తితో భగవంతుడ్ని ప్రార్ధించగానే, పొదల్లో నుండి ఒక చిరుత వారి మధ్యకు దూకుంది. కార్తికేయుని చుట్టేసిన కొండచిలువను నోటకరిచి విసురుగా లాగి ఈడ్చుకుంటూ అడవిలోకి మాయమయ్యింది.

గురువు కార్తికేయుని సమీపించి ఆలింగనం చేసుకున్నాడు. ఆ ఆనందంలో తనకు తెలిసిన మంత్ర,తంత్ర విద్యలన్నీ కార్తికేయునికి ధారపోసాడు. అంతేగాక తన మానసపుత్రికగా లోకోత్తర సౌందర్యవతిగా జనించిన అమృతమయిని కార్తీకునికి ఇచ్చి వివాహం జరిపించాడు.

సకల విద్యాభ్యాసం ముగించుకుని, అమృతమయి తోడుగా రాజ్యంలో అడుగుపెట్టిన కార్తికేయినికి తల్లిదండ్రులు ఘనస్వాగతం ఏర్పాటుచేసారు. తన కుమారుడు సాధించిన విజయాలు, గురువుల ప్రశంసలూ విని కార్తికేయిని తండ్రి మిక్కిలి సంతోషించి

“రాజ్యాన్ని పరిపాలించగలిగే శక్తియుక్తులు నువ్విప్పుడు సంపాదించుకున్నావు. ఇక రాజ్యభారాన్ని నువ్వే స్వీకరించు” అని అతడికి అప్పగించాడు.

రాజ్యంలో ప్రజందరినీ తన సొంత మనుషులుగా భావించి అందరినీ ఆదరిస్తూ కార్తికేయుడు అందరి మన్ననలు అందుకున్నాడు. రాజ్యమంతటినీ ఒక్కతాటిపై నడిపిస్తూ ప్రజలందరిలో మంచిని నింపాడు. ఆ రాజ్యంలో ధర్మం నాలుగుపాదాలా నడవసాగింది. కవులు, కళాకారులు ఆ రాజ్యానికి వచ్చి కార్తికేయుని కొలువులో చేరాలని ఉత్సాహపడేవారు. పండితులు, మునులు కార్తికేయుని ఆతిధ్యం స్వీకరించేందుకు ఎంతో సంతోషించేవారు. కార్తికేయుని కీర్తి నేల నాలుగు చెరగులా పాకింది.

ఈ ప్రశంసలన్నీ నాగేంద్రుని చెవిలో పడ్డాయి. అతడు అసూయతో రగిలిపోయాడు. ఒకే గురువు వద్ద అభ్యసించినా, సమానహోదా కలిగి ఉన్నా తనకి దక్కని కీర్తి కార్తికేయుడికి దక్కడం అతడికి నచ్చలేదు. ఎలా అయినా కార్తికేయుని ఈ భూమ్మీద లేకుండా చేయాలనే కుటిలమైన ఆలోచన అతడికి తోచింది. మిత్రుని కలుసుకోవాలనే నెపంతో అతిధిగా కార్తికేయుని కోటలో అడుగుపెట్టాడు.

కార్తికేయుడు మిక్కిలి సంతోషంతో తన మిత్రుడిని ఆహ్వానించి అతడికి స్వయంగా అతిధి సత్కారాలన్నీ జరిపించాడు. ఏ లోటు కలుగకుండా గౌరవించమని సేవకులను నియమించాడు. కార్తికేయుని రాజ్యవైభవాన్ని చూసి నాగేంద్రునికి మరింతగా కళ్ళుకుట్టాయి. ఎలా అయినా కార్తికేయుడిని చంపి అతడి రాజ్యాన్ని కూడా చేజిక్కించుకోవాలనుకున్నాడు. భోజనాల వేళ కార్తికేయునితో వేటకు వెళ్ళ మనసయ్యిందని ప్రస్తావించాడు నాగేంద్రుడు. స్నేహితుడు అడిగిందే తడువుగా కార్తికేయుడు వేటకు తగిన ఏర్పాట్లు చేసాడు.

ఇద్దరూ అడవికి వెళ్ళి అలసిపోయేవరకూ జంతువులను వేటాడి ఒక చెట్టు కింద విశ్రాంతికి ఉపక్రమించారు. అవకాశం దొరికితే కార్తికేయుడిని మట్టుబెట్టాలని కాచుకుని కూర్చున్నాడు నాగేంద్రుడు. నాగేంద్రుడి మోసాన్ని, కపటస్నేహాన్ని గ్రహించలేకపోయాడు కార్తికేయుడు. మాటల మధ్యలో నాగేంద్రుడు

"మిత్రమా అలసిన మనపై ఏ సింహమో దాడిచేస్తే ఎలా తప్పించుకోవటం?" అని అడిగాడు.

కార్తికేయుడు నవ్వుతూ

"ఇదిగో మన వద్ద చచ్చిపడి ఉన్న ఏ మృగంలోనికో పరకాయప్రవేశం చేసి ఆ సింహంపై దాడిచేస్తాను" అన్నాడు.

నాగేంద్రుడు ఇలాంటి విద్యలు నిజంకావు, కేవలం కల్పితం అని వాదానికి దిగాడు. మిత్రుని నమ్మించేందుకు కార్తికేయుడు అక్కడే పడి ఉన్న చిరుత శరీరంలో ప్రవేశించి చూపించాడు. అంతవరకూ చచ్చిపడి ఉన్న చిరుత లేచి తిరగటంతో నాగేంద్రునికి నమ్మకం కలిగింది. తిరిగి స్వశరీరంలోనికి వచ్చిన కార్తికేయునితో తనకు ఆ మంత్రాన్ని చెప్పమని ప్రాధేయపడ్డాడు. మిత్రుని మీద నమ్మకంతో కార్తికేయుడు ఆ విద్యను నాగేంద్రునికి నేర్పించాడు.

మంత్రాన్ని మననం చేసుకుంటున్న నాగేంద్రునికి ఒక దుర్మార్గమైన ఆలోచన వచ్చింది.

"మిత్రమా ఒకసారి మన మిద్దరం విగతజీవులైన ఆ జింకపిల్లల శరీరాల్లో ప్రవేశించి వనమంతా తిరిగి వద్దాం" అని అడిగాడు. మిత్రుని మాటను మన్నించాడు కార్తికేయుడు. ఇద్దరూ ఒకేసారి మంత్రాన్ని పఠించి జింకపిల్లల శరీరాల్లోనికి ప్రవేశించారు. మరుక్షణంలోనే నాగేంద్రుడు జింకపిల్ల శరీరాన్ని వీడి కార్తీకేయుని శరీరంలోకి ప్రవేశించాడు. కార్తీకేయుడు జరిగిన మోసాన్ని గ్రహించేలోపే అతడి శరీరంలో ఉన్న నాగేంద్రుడు కోటకు వెళ్ళిపోయాడు.

కార్తికేయుడే అని భావించిన సేవకులంతా అతనికి రాచమర్యాదలు చేస్తున్నారు. అక్కడ అడవిలో జరిగిన మోసాన్ని గ్రహించిన కార్తికేయుడు, అక్కడే పడి ఉన్న నాగేంద్రుని శరీరంలోనికి ప్రవేశించి కోటకు వచ్చాడు. కార్తికేయుని రూపంలో ఉన్న నాగేంద్రుడు అతడిని కోట బయటే అడ్డగించమని, రాజ్యంలో అడుగుపెట్టనివ్వవద్దని సైనికులను ఆజ్ఞాపించాడు. నాగేంద్రుని రూపంలో ఉన్న కార్తికేయుడు ఎంత చెప్పినా వినకుండా సైనికులు అతడిని కోట నుండి వెళ్ళగొట్టారు.

అడవికి వెళ్ళి వచ్చినప్పటి నుండి తన భర్తలో ఏదో మార్పు వచ్చిందని అమృతమయి గమనించింది. అతడి విపరీత చర్యలు, భాష ఆమెను కలవరపెట్టాయి. అతడిని సమీపించేందుకు ఆమె మనసు అంగీకరించక పోవటంతో ఆమె అతడికి ఎదురుపడకుండా తప్పుకు తిరగసాగింది. తన మనసులో చెలరేగిన ఈ అలజడి సద్దుమణిగేందుకు ఆమె దేవాలయానికి వెళ్ళింది. ఆమె ఏ క్షణమైనా అక్కడికి వస్తుందని ముందే అక్కడికి చేరుకుని నాగేంద్రుని రూపులో ఉన్న కార్తికేయుడు వేచి ఉన్నాడు.

అమృతమయిని చూడగానే ఉత్సాహంగా కదిలి, ఆలింగనం చేసుకునేందుకు ముందుకు వస్తున్న అతడిని ఆమె హెచ్చు స్వరంతో నిలువరించింది. ఆమె కళ్ళు ఆగ్రహంతో ఎరుపెక్కాయి. పరిస్థితిని అర్థం చేసుకున్న కార్తికేయుడు ఆమెకు అడవిలో జరిగినదంతా చెప్పాడు. అతడి సమీపంలో కార్తీకుని భావన అమృతమయి మనసుకి తెలుస్తోంది. పూర్తిగా నమ్మకం కుదరకపోయినా ఆమె అతడు చెప్పిన విషయాలన్నీ విని, "మీరే నా భర్తని ఎలా నమ్మగలను? అదే వాస్తవమయినా కూడా ఈ సమస్యకు పరిష్కారమేంట"ని అడిగింది.

నాగేంద్రుడు తన శరీరాన్ని ఏ పరిస్థితుల్లోనూ వీడడని సంశయించిన కార్తికేయుడు, ఆమెకు ఒక ఉపాయాన్ని చెప్పాడు. ఆమెకు ఒక మంత్రాన్ని ఉపదేశించాడు. ఆ రాజ్యం నుండి కొన్ని వందల యోజనాల దూరం ప్రయాణించిన పిమ్మట ఒక వింత ప్రదేశం చేరుకోవచ్చని, ఆ ప్రదేశమంతా తెల్లని కాంతితో వెలిగిపోతూ ఉంటుందని, అక్కడ పట్టపగలే నక్షత్రాలు, గ్రహాలు అతి సమీపంలో కనిపిస్తాయని చెప్పాడు. ఆ ప్రదేశంలో అరుణగిరి అనే ఒక పర్వతం ఉందని, ఆ పర్వతాన్ని ఎక్కి ఈ మంత్రం జపిస్తే చంద్రమండలానికి చేరుకోవచ్చని చెప్పాడు. నాగేంద్రుడిని ఎలా అయినా అక్కడికి తీసుకు రమ్మని చెప్పాడు.

కోటకు చేరుకున్న అమృతమయి నాగేంద్రుని సమీపించి

"మా తండ్రిగారు వర్తమానం పంపారు, చంద్రమండలాన్ని చేరుకుని అక్కడి శ్వేతఖడ్గాన్ని పొందటం ద్వారా, మీరు ప్రపంచ చక్రవర్తి కావటం తండ్రిగారి అభిమతం" అనిచెప్పింది. ప్రపంచాధిపత్యం అనే మాట వినగానే నాగేంద్రునికి అత్యాశ కలిగింది. వెంటనే రధాన్ని సిద్ధం చేయించి, అమృతను వెంట తీసుకుని ఆమె చెప్పిన మార్గంలో వింతప్రదేశం వైపు సాగాడు.

కొన్ని వందలమైళ్ళు దాటిన తర్వాత వారికి కాసేపు కళ్ళు కనిపించని చీకటి ఎదురయ్యింది. ఆ చీకటిలోనే ఎన్నో బాధలు పడుతూ కాసేపు ముందుకు సాగిన పిమ్మట కార్తికేయుడు చెప్పిన వింతలోకం కనిపించింది. అక్కడంతా వెలుగే, తెల్లని వెలుగు, గాలంతా పరిమళం. మొక్కలకు వేళ్ళు లేవు గాలిలో తేలుతున్నాయి. ఆ మొక్కలకున్న పెద్ద పెద్ద పూలు పరిమళం వెదజల్లుతున్నాయి. చేతికందేంత దగ్గరిలో నక్షత్రాలు మెరుస్తున్నాయి.

ఇద్దరూ ఆశ్చర్యంగా ఆ వింతలను చూస్తూ ముందుకు సాగారు. అప్పుడు ఎదురయ్యింది వారికి అతి పవిత్రమైన అరుణగిరి. రథం దిగి ఇద్దరూ పర్వతాన్ని అదిరోహించారు. పర్వత శిఖరానికి చేరిన పిమ్మట అమృత ఆ మంత్రం చదివింది. ఇద్దరూ స్పృహ కోల్పోయారు. కొన్ని నిమిషాల చీకటి తర్వాత ఇద్దరూ కళ్ళు తెరిచి చూసే సరికి ఒక కొత్తలోకంలో ఉన్నారు. చుట్టూ గమనించారు. తెల్లని ఇసుక, తెల్లని రాళ్ళతో నిండి ఉందాలోకం. ఎక్కడా మరోప్రాణి జాడలేదు. దూరంగా ఆకాశంలో భూమి కనిపించింది. అప్పుడు గ్రహించారు వాళ్ళిద్దరూ తామున్నది చంద్రమండలమని.

అమృత అతడిని చూసి ఆశ్చర్యపోయింది. తన ఎదుట ఇప్పుడు ఉన్నది కార్తికేయుని రూపం కాదు, నాగేంద్రుని రూపం. ఆమె కళ్ళలో ఆశ్చర్యాన్ని చూసి అతడు తనని తాను చూసుకున్నాడు. అతడు కూడా ఆశ్చర్యానికిలోనయ్యాడు. అసలు విషయం అమృతకు తెలిసిపోయినందుకు ఎలా తప్పించుకోవాలా అని ఆలోచించసాగాడు. శ్వేతఖడ్గాన్ని ధరించిన కార్తికేయుడు వారి మధ్యకు వచ్చాడు.

"ఈ లోకానికి ఎవరూ సశరీరంగా రాలేరు. కేవలం మన సూక్ష్మదేహాలు మాత్రమే వస్తాయి. అందుకే సహజరూపాలు కనిపిస్తున్నాయి. మిత్రమా నేటితో నీ మోసానికి, నీకు ముగింపు" అని పలికాడు కార్తికేయుడు. నాగేంద్రుడు తన ఖడ్గాన్ని తీసుకుని కార్తికేయునితో పోరాటానికి సిద్ధపడ్డాడు. కార్తికేయుడు కొద్ది నిమిషాల్లోనే నాగేంద్రుడిని జయించి అతడిని సంహరించాడు.

అమృత జరిగినదంతా చూసి, ఈ ప్రమాదం నుండి బయటపడి నందుకు సంతోషించింది. ఇద్దరూ తిరిగి భూమి పైకి చేరుకున్నారు. కార్తికేయుడు తన స్వశరీరం లోనికి ప్రవేశించాడు.

ఆ విధంగా స్నేహితులలో శ్రేయోభిలాషులే కాకుండా, నయవంచకులు కూడా ఉంటారని గ్రహించిన కార్తికేయుడు అప్రమత్తుడై ఎన్నో ఏళ్ళు రాజ్యాన్ని ఏలాడు అని కథ చెప్పటం ముగించాడు గోపన్న. తమ భవిష్యత్తుకి, జీవితానికి ఉపయోగపడే ఒక గొప్పపాఠాన్ని నేర్పించినందుకు రాకుమారులు అతడికి కృతజ్ఞతలు చెప్పారు.

“మాయతో వచ్చినోడు మాయలోనే సచ్చినాడు

రూపుమార్చొచ్చినాడు రూపులేకపోయినాడు

ఒడుపు చూపబోయినోడు ఒడలు విరిగి ఒరిగినాడు

మనసారా కొలిచినోడు మారాజై ఎలిగినాడు

మాయలన్నిటినీ మాపే పెనుమాయ కన్నయ్య

మదిలోన నిలిపితే మమ్మేలు కిట్టయ్య...”

చెట్టు నీడన కూర్చుని గోపన్న కమ్మనిపాట వింటున్నారు గోపాలురు. గోవులన్నీ అప్పటివరకూ మేసి గుంపుగా కూర్చుని నెమరేసుకుంటున్నాయి. రాకుమారులు ముగ్గురూ చెట్లెక్కి ఫలాలు కోస్తున్నారు. ఉన్నట్టుండీ చిన్నవాడు చిత్రసేనుడు పట్టుతప్పి క్రిందపడ్డాడు. పెద్దవాడు విక్రముడు హడలిపోయి చెట్టు మీద నుండి దూకి రెండు చేతులతో తమ్ముడిని ఎత్తుకుని గోపన్న వద్దకు తీసుకుని వచ్చాడు. చిత్రసేనుడికి స్పృహ లేదు. సుసేనుడు తమ్ముడి కోసం బిగ్గరగా ఏడుస్తున్నాడు. గోపన్న ఒక్క అంగలో వారిని చేరుకుని ఏం జరిగిందో తెలుసుకున్నాడు.

పక్కనే ఉన్న సెలయేటి నుండి నీటిని తెప్పించి చల్లనినీరు చిత్రసేనుడి మొహాన చల్లి, తడిగుడ్డతో శరీరం మొత్తం తుడిచాడు గోపన్న. కాస్త సపర్యల అనంతరం చిత్రసేనుడు స్పృహలోకి వచ్చాడు. మండు వేసవికాలం ఎండ సోకటం వల్ల జరిగిందని, ప్రమాదంలేదని చెప్పి విక్రముడిని, సుసేనుడ్ని బుజ్జగించాడు. చిత్రసేనుడికి చెట్టు నీడన పడుకునేందుకు ఏర్పాటుచేసారు.

ఒక గోపాల యువకుడు విచారవదనంతో "ఎండకన్నెరుగని మారాజు బిడ్డలు ఎన్ని కష్టాలు పడుతున్నారో. ఏ సామో వచ్చి మాయో, మంత్రమో వేసి ఈ పిల్లల కష్టాలు తీసేయ్యొచ్చు కదా గోపన్న తాత" అని అడిగాడు.

గోపన్న అతని అమాయకత్వానికి నవ్వాడు. జింకపిల్లను తరుముకుంటూ వచ్చే పులే మాయ, ఆ పులికి చిక్కకుండా జింక చేసే ప్రయత్నమే నిజమైన మంత్రం. మంత్రాలనే నమ్ముకున్న విద్యానగర రాజవంశం ఏమయ్యిందో చెబుతాను వినండి అని కథ చెప్పనారంభించాడు గోపన్న.

### *గోపన్న చెప్పిన నరసింహగజపతి కథ*

పూర్వం విద్యానగరమనే పట్టాణాన్ని ఏలే మహారాజు నరసింహగజపతి శతృభయంకరుడు. చిన్ననాటి నుండే అతడికి వీరగాధలన్న ఎంతో మక్కువ. పసిప్రాయంలోనే యుద్ధవిద్యలన్నీ క్షుణ్ణంగా అభ్యసించాడు. నూనూగుమీసాల ప్రాయానికే మిక్కిలి ఉత్సాహంతో

యుద్ధరంగంలో అడుగుపెట్టాడు. కాకలు తీరిన యోధులను మొదటియుద్ధంలోనే మట్టి కరిపించాడు. అతడు సింహాసనానికి వచ్చేనాటికి విద్యానగరం దరిదాపుల్లో ఉన్న అన్ని కోటలను జయించి ఒక గొప్ప సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసాడు.

అతడి వీరత్వాన్ని కథలు కథలుగా విన్న ఎందరో రాజులు అతడిని అల్లుడిగా చేసుకోవాలని ఉత్సాహం చూపారు. అతిలోక సౌందర్యరాశులైన ముగ్గురు కన్యలను ఎంపిక చేసుకుని వివాహం చేసుకున్నాడు నరసింహుడు. భయపెట్టే శత్రువులు లేకపోవటంతో విద్యానగర ప్రజలు, రాజ్యం ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేవారు. తమ ప్రభువు వీరత్వమే తమ రక్ష అని భావించేవారు ప్రజ. సేవకులు, సైన్యం, మంత్రులు ఎల్ల వేళలా నరసింహుని శక్తియుక్తులను కీర్తిస్తూ ఉండేవారు. నరసింహునికి అది మిక్కిలి ఆనందాన్ని కలిగించేది.

రోజులు గడిచిన కొద్దీ అతడి బలమే అతడి బలహీనతగా మారింది. అతడి మదిలో ఒక సంశయం మొదలయ్యింది. తన వంశంలో పుట్టే తర్వాతి తరాల్లో తనంతటి వీరులు లేకపోతే విద్యానగర సామ్రాజ్యం ఏమవుతుందో అనే భయం అతడి మదిలో మొదలయ్యింది. ఆ మనోవ్యధ అతడిలో ఇంతింతై పెరిగి అతడిని పూర్తిగా తొలిచివేయనారంభించింది. నిద్రలో తాను గెలిచిన కోటల్లోని సైన్యాలన్నీ ఏకమై విద్యానగరం మీద దండెత్తినట్టు, తన వారసులను అతి కిరాతకంగా సంహరించినట్టు కలగనేవాడు.

రోజు రోజుకి బలహీనమైపోతున్న ప్రభువుని గమనించిన మంత్రులు అతడి మనోవ్యధకు కారణం విచారించారు. ప్రభువు తన సంశయం వారితో చర్చించాడు. ప్రభువుని సమాధానపరిచేందుకు సింహంజాతిలో సింహమే పుడుతుందని, తమ వీర లక్షణాలు వారసులకు సంక్రమిస్తాయని వారు అనేక హితవచనాలు పలికారు. ఎందరు ఎన్ని చెప్పినా నరసింహుని వ్యధ తీరలేదు. పండితగోష్టులు జరిపించారు, బ్రాహ్మణులతో ఆశీర్వచనాలు పలికించారు. ఎంత చేసినా అతడికి ధైర్యం కలగలేదు. ఏం చెయ్యాలో పాలుపోని సంకటస్థితిలో పడ్డారు మంత్రులు.

ఆస్థాన పండితులందరినీ సమావేశపరిచి ప్రభువును కాపాడే ఉపాయం చెప్పమని అడిగారు మంత్రులు. ఎంతో చర్చించిన పిమ్మట మంత్రం వలన కానిది తంత్రం వలన మాత్రమే సాధ్యమవుతుందని, తాంత్రికులను కలవమని చెప్పారు. నరసింహుడు గొప్ప తాంత్రికులను వెతుకుతూ అడవులు పట్టాడు. ఎంతోమంది గొప్ప తాంత్రికులను కలిసినా అతనికి సహాయం లభించలేదు. చిట్టచివరిగా మహాకాళుడనే మాంత్రికుని గుహకు చేరాడు. గుహలో అడుగుపెట్టిన నరసింహునికి మరణావస్థలో ఉన్న మహాకాళుడు కనిపించాడు. నరసింహుడు పరుగున వెళ్ళి అతడికి సపర్యలు చేయబోయాడు.

మహాకాళుడు అతడిని వారించి "మహారాజా, నా మరణం తథ్యం, నీది అనవసరమైన శ్రమ. నీ ఈప్సితం నేనెరుగుదును. అనేక ఏళ్ళుగా నా దగ్గర బందీయై బానిసలుగా ఉన్న ఏకాక్షి అనే రాక్షసుడిని, ఏకశిఖ అనే భూతాన్ని నీవశం చేస్తున్నాను. అవి నీ వంశానికి రక్షగా ఉన్నంత వరకూ నీ సామ్రాజ్యానికి ఎదురులేదు. కానీ రాజా కత్తి పట్టిన వాడు కత్తికి, తంత్రాన్ని నమ్మినవాడు తంత్రానికి బలి అవుతాడు అనే మాట మరిచిపోకు. సరియైన మార్గంలో ఉపయోగించే సమర్ధుడు మాత్రమే ఈ స్థితిని దాటగలడు" అని హెచ్చరించి ప్రాణాలు విడిచాడు.

నరసింహుడు సంకటస్థితిలో పడ్డాడు. మహాకాళుని హెచ్చరిక అతడికి భయాన్ని కలిగించింది. కానీ అక్కడే ఉన్న అతని మంత్రులు "మహాప్రభూ, సంశయించకండి. సమర్ధులైన మంత్రిసామంతుల ఉపాయాల మధ్య , పండితుల హితవచనాల మధ్య ఈ శక్తులు దుర్వినియోగం

జరిగే అవకాశం లేదు" అని నమ్మకంగా పలికారు. వారి మాటలకు అంగీకరించిన నరసింహుడు ఏకాక్షిని, ఏకశిఖను పిలిచాడు. భూమ్యాకాశాలను కలిపే శరీరాలతో వారి ముందు ప్రత్యక్షమయ్యారు ఏకాక్షి, ఏకశిఖ. నరసింహునికి నమస్కరించి "మహారాజా, నీ శక్తియుక్తులు ఎరినిగినవారమై నీకు లోబడి ఉండేందుకు అంగీకరిస్తున్నాం. తలచిన తక్షణం ఎదుట నిలచి నీ ఆదేశము శిరసావహించగలవారము" అని పలికి మాయమయినారు.

ఇనుమడించిన ఉత్సాహంతో రాజ్యానికి చేరుకున్నాడు నరసింహుడు. ఎన్నో రోజుల తర్వాత అతడిలో కనిపిస్తున్న వెలుగును చూసి ప్రజలంతా సంతోషించారు. అడవిలో జరిగిన వృత్తాంతమంతా ప్రజలు కథలుగా చెప్పుకున్నారు. నరసింహుడు ప్రశాంత చిత్తంతో పరిపాలన కొనసాగించాడు. ఏళ్ళు గడిచాయి. అతడికి ముగ్గురు కుమారులు జన్మించారు. వారే విజయేంద్రగజపతి, రాజేంద్రగజపతి,జయరామగజపతి. లేక లేక పుట్టిన సంతానం కావటంతో అల్లారు ముద్దుగా పెంచారు.

నరసింహుడు శౌర్యం, ప్రతాపం, విద్యాభ్యాసం అని ఎంత చెప్పినా రాణులు వినకుండా పుత్రులను ఎండకన్నెరుగకుండా పెంచారు. తమ తండ్రిలా కాక ముగ్గురూ యుక్తవయస్సు వచ్చేంత వరకూ గురుకులానికే పోలేదు. గురుకులంలో చేరిన పిమ్మట కూడా విజయేంద్రుడు, రాజేంద్రుడు విద్యాసక్తి కనబరచలేదు. జయరాముడు మాత్రం భక్తి,శ్రద్ధలతో గురువులను సేవించేవాడు. తండ్రికి తగ్గ తనయుడిగా వెలుగొందుతావని జయరాముడిని గురువులు కొనియాడేవారు. కానీ అతడు తండ్రి వలే కేవలం యుద్ధవిద్యలయందే కాక సకలశాస్త్రాలయందు అనురక్తుడై ఉండేవాడు.

నరసింహునికి ఈశ్వరాదేశమయ్యింది. అతడు తన ప్రాణాలు విడిచేలోపు తన ముప్పురు పుత్రులను పిలిచి వారికి ఏకాక్షి, ఏకశిఖలను గురించి వివరించాడు. దుర్వినియోగ పరచరాదని హితవు పలికి పరలోకప్రాప్తి పొందాడు. తమకు అంత గొప్ప శక్తులు తోడై ఉన్నాయని తెలిసుకున్న విజయేంద్రుడు, గజేంద్రుడు విద్యాభ్యాసం పూర్తిగా విడిచిపెట్టారు. జ్యేష్ఠుడిగా విజయేంద్రుడు సింహాసనం అధిష్టించాడు. నరసింహునియందుకల భయభక్తులతో సామంతులంతా విజయేంద్రునికి సహితం లోబడి ఉన్నారు.

కానీ అనతికాలంలోనే విజయేంద్రునికి గర్వం పెచ్చుమీరింది. పరిపాలనను నిర్లక్ష్యం చేసాడు. నిత్యం మద్యం మత్తులో ఉండేవాడు. సామంతుల కోటలకు విహారయాత్రలకు వెళ్ళి అందమైన కన్యలను బలవంతాన వరించి తీసుకుని వచ్చేవాడు. అతడి చర్యలకు ప్రజలు బెంబేలెత్తిపోయారు. అందరూ మహామంత్రికి తమ కష్టాలు వివరించారు. మహామంత్రి ఇక చేసేది లేక సామంతులందరినీ పిలిపించి సమావేశపరిచాడు.

సామంతులంతా "మన మహారాజు నరసింహుడు కోరుకున్న వారసుడు వీడు కాదు. సమర్థులైన వారసులు రావాలని, ఈ సామ్రాజ్యం ఎప్పటికీ సురక్షితంగా ఉండాలనేదే అతని అభిమతం. కావున విజయేంద్రుడు తన సమర్థతను నిరూపించుకోవాలని " అని ముక్తకంఠంతో తేల్చి చెప్పారు.

మహామంత్రి జరిగిన విషయాన్ని నరసింహుని ముగ్గురు భార్యలకు, విజయేంద్రునికి వివరించాడు. విజయేంద్రుడు ఉగ్రరూపం దాల్చాడు. నరసింహుని వారసుడైన తనను సామర్ధ్య పరీక్షకు పురికొల్పిన అందరినీ తక్షణమే నాశనం చేస్తానని పరుశంగా మాట్లాడి ఏకాక్షిని, ఏకశిఖను తలచుకున్నాడు.

పెనుగాలుల మధ్య ఆకాశాన్ని తాకే పరిమాణంలో ఉన్న ఏకాక్షి, ఏకశిఖ అతడి ముందు నిలిచారు. వారిని చూడగానే మొదట విజయేంద్రుడే తత్తరపాటుకి లోనయ్యాడు. కానీ వారు తన బానిసలే అనే నమ్మకంతో భయాన్ని పోగొట్టుకుని, తన సామంతులనంతా సంహరించమని ఆదేశించాడు. ఆ విపరీతాదేశానికి ఇద్దరూ సంశయించి "రాజా, నీ తండ్రి మమ్ములను దుష్టకార్యములకు నియోగించనని చెప్పియున్నాడు. అతడి వారసుడివైన నీవు ఇటుల ఆనతీయుట ఉచితముగా తోచుటలేదు." అని పలికారు.

విజయేంద్రుడు పట్టరాని ఆగ్రహంతో "బానిసలైన మీకు ఉచితానుచితములు వివరించు పని నాకు లేదు. ఇది నా ఆజ్ఞ" అని హెచ్చుస్వరంలో పలికాడు. అతడి ప్రవర్తనకు ఇద్దరిలోనూ దాగిన రాక్షసలక్షణాలు పెల్లుబికినాయి. వికృతంగా అరుస్తూ విరుచుకుపడ్డారు. క్షణాల్లో రాజమందిరాన్ని నాశనం చేసారు. మంత్రి,సామంతులంతా పరుగులు తీసారు. పరివారమంతా ప్రాణాలు దక్కించుకునేందుకు మందిరాన్ని విడిచిపోయారు.

నీవు చేసిన అకృత్యాలకు నీకు తగిన శిక్ష ఇదే అని విజయేంద్రుని ఒక్క దెబ్బతో సంహరించారు. రాజమందిరమంతా స్మశానంలా మిగిలింది. ఏకాక్షి, ఏకశిఖ నగరం మీద పడి విలయం సృష్టించారు. చివరగా వెళ్ళిపోతూ ఇక నుండి ప్రతి పౌర్ణమికి వస్తాం. మమ్ములని జయించు సమర్ధుడు ఉంటే వచ్చి తలపడండి లేదా మీకు ఈ శాస్తి తప్పదు అని హెచ్చరించి వెళ్ళిపోయారు.

ప్రజలెంతగానో విచారించారు. రాజకుటుంబం మిక్కిలి దుఃఖించింది. విజయేంద్రుడు మరణించినందున రాజేంద్రుడిని సింహాసనం పై కూర్చుండబెట్టారు. కానీ తన కళ్ళ ముందే అన్నగారి మరణాన్ని చూసిన రాజేంద్రుడికి కంటి మీద కునుకులేదు. మరలా ఆ భూతాలు పౌర్ణమికి వస్తాయనే భయంతో అతడు వణికిపోసాగాడు. అందరూ అతడికి ధైర్యాన్ని నూరిపోసేందుకు పూనుకుని తన తండ్రి శౌర్యం గురించి కథలు చెప్పారు. అతడి వారసుడికి ఎంత వీరత్వం ఉండాలో బోధించారు. వారంతా చెప్పిన మాటలు అతడిలో ధైర్యాన్ని కాస్త పెంచాయి. తన తండ్రి ఏ యుద్ధం చేయకుండానే వారిని వశం చేసుకున్నాడని తెలుసుకున్నాక అతడికి కాస్త భయం తగ్గింది.

పౌర్ణమి దగ్గరపడుతుందంటేనే ప్రజలు భయంతో వణికిపోయారు. మానవులు రాక్షసులను జయించేదెలా, ఇక మనకి చావు తప్పదని కృంగిపోయారు. సామంతులంతా విద్యానగరంతో సంబంధాలు రద్దు చేసుకున్నారు. ఆ రాక్షసులను జయించుట కల్ల అని భావించి నరసింహుడు గెలిచిన కోటలన్నీ తమని తాము స్వతంత్రులుగా ప్రకటించుకున్నాయి. ఎన్ని పరిణామాలు జరిగినా రాజేంద్రుడు మాత్రం మిన్నకుండిపోయాడు. మంత్రులు అతడికి ఈ తిరుగుబాట్ల గురించి వివరించినా ఆ రాక్షసులను వశపరుచుకుంటే ఈ కోటలన్నీ క్షణాల్లో తన సొత్తుగా మారుతాయని, అందరితో యుద్ధం చేయు పనిలేదని చెప్పి అందరి మాటలను పెడచెవిన పెట్టాడు.

పౌర్ణమిరోజు వచ్చింది. చీకటి పడుతుండగా రెండు భారీ శరీరాల నీడ కోటను సోకింది. ఆ నీడలు చూడగానే విషయం గ్రహించి అందరూ ఇళ్ళలోకి పరుగులు తీసారు. ఏకాక్షి, ఏకశిఖ రాజమందిరం వద్దకు చేరుకున్నారు. ఎవడురా లోపల, తలపడేది ఉందా లేక ప్రాణాలు విడుస్తారా అని గర్జించారు. వారి ఉగ్రరూపాలని చూస్తూ నిలబడేందుకు ఎవరూ సాహసించలేకపోయారు. రాజేంద్రుడు వణుకుతూ వచ్చి ఆ భారీ శరీరాలను చూడగానే భీతిచెంది వారి కాళ్ళపై బడ్డాడు. ఇద్దరూ వికటాట్టహాసం చేసి "చచ్చుదద్దమ్మ, శరణన్న వాడిని చంపములే. పో పోయి ఎక్కడో గుహల్లో తలదాచుకో. ఈ రాజ్యంలో ఉన్నావని తెలిసిందో నీ అన్న దగ్గరికే పంపిస్తాం" అని హెచ్చరించి వెళ్ళిపోయారు.

రాజేంద్రుడు తక్షణమే రాజ్యం వదిలి వెళ్ళిపోయాడు. గురుకులంలో ఉన్న కడపటి వారసుడు జయరాముడికి వర్తమానమందింది. రాజ్యానికి రానే రావద్దని అతడి తల్లి సందేశం పంపింది. తన అన్నల దుస్థితి తెలుసుకుని చింతించిన జయరాముడు, తన తండ్రి కీర్తి ప్రతిష్టలు నిలుపుట తన కర్తవ్యమని భావించి కోటకు పయనమయ్యాడు.

రాజ కుటుంబమంతా అతడి దుస్సాహసానికి నిందించారు. అతడు అందరినీ అనునయించి, నరసింహ చక్రవర్తి కీర్తిచంద్రిక నిలబెట్టుట తన కర్తవ్యమని, బీరువు వలే పారిపోయిననూ తాను చచ్చినవానితో సమానమేనని చెప్పాడు. అందరూ ఊరడిల్లారు. పరివారమంతా అతడిని సింహాసనం అధిరోహించమని పిలిచారు. అతడు మందస్మితంతో తిరస్కరించి నా సమర్థత నిలుపుకున్న నాడే నేనందుకు అర్హుడినని చెప్పాడు.

జయరాముడు నగరమంతా తిరిగి అందరికీ ధైర్యం చెప్పాడు. తన ప్రాణాలర్పించైనా ప్రజలకు రక్షణనిస్తానని చెప్పాడు. ముక్కుపచ్చలారని ఆ పసివాడి ధైర్యం వారికి విస్మయాన్ని కలిగించింది. తండ్రికి తగ్గ తనయుడితడే అని అందరూ విశ్వసించారు. రాజ్యంలో సాదారణ పరిస్థితులు నెలకొన్నాయి. అందరి మనసుల్లో ఉత్కంఠత మాత్రం తొలగలేదు. మరలా పౌర్ణమి వచ్చేసింది.

జయరాముడు పౌర్ణమినాడు ఉదయాన్నే లేచి తమ కులదైవానికి, రాజ్య రక్షణగా భావించే దేవతలందరికీ పూజలు చేసాడు. తన తండ్రికి తగురీతిన తర్పణమిచ్చాడు. ప్రశాంతచిత్తుడై సాయంత్రం వరకూ వేచి చూస్తూ కోత ముందే నిలుచున్నాడు. ఆ పసివాడి సంకల్పానికి, మనోఃధైర్యానికి అందరూ జేజేలు పలికారు.

చీకటి పడుతుండగానే భారీ శరీరాలతో, పెద్ద పెద్ద అంగలు వేస్తూ ఏకాక్షి, ఏకశిఖ రాజమందిరం ముందుకు వచ్చారు. వారిని చూసి క్షణకాలం కూడా తత్తరపాటుకు లోను కాకుండా నిలబడిన జయరాముడిని చూసి ఇద్దరూ ఆశ్చర్యానికి లోనయ్యారు. గట్టిగా గర్జిస్తూ "ఏం రాకుమారా, పోరుకి సిద్దమా" అని అడిగారు. "సిద్దమే" అని స్థిరంగా పలికాడు జయరాముడు.

ఏకాక్షి గాలిలో చేయి చాపాడు. అతడి చేతిలో ఒక ముళ్ళదండం వచ్చిపడింది. జయరాముడిని చూసి ఏకశిఖ "రాకుమారా, వాడు నీ బలాన్ని పరీక్షిస్తాడు. నేను నీ బుద్ధిబలాన్ని పరీక్షిస్తాను. కానీ ఈ రెండూ ఒకేసారి జరుగుతాయి" అని చెప్పింది.

"రాకుమారా, ఏ బలం మానవునికి అన్ని వేళలా తోడు నిలుస్తుంది? శారీరక బలమా? బుద్ధిబలమా?" అని ప్రశ్నించింది ఏకశిఖ. ఆ ప్రశ్న వింటుండగానే ఏకాక్షి తన ముళ్ళదండంతో మీద పడ్డాడు. తరాలుగా తమవంశం శౌర్యాన్ని నిలుపుతున్న ఖడ్గాన్ని ధరించిన జయరాముడు ఏకాక్షి దెబ్బను ఒడుపుగా అడ్డుకున్నాడు. "ఆత్మబలం మాత్రమే మనిషికి అన్ని వేళలా తోడు నిలిచేది" అని ఏకశిఖకు సమాధానం చెప్పాడు.

ఏకాక్షి తిరిగి బలాన్ని కూడదీసుకుని మరో దెబ్బవేసాడు. ఆ దెబ్బను ఆపుకునేందుకు జయరాముడు సిద్దపడుతుండగానే "రాకుమారా, ఈ లోకంలో శాశ్వతమైనదేది సౌభాగ్యమా, యశస్సా?" అని అడిగింది ఏకశిఖ. ఏకాక్షి దెబ్బను తప్పుకుని ఏదురుదెబ్బ వేస్తూనే "ఈ పంచభూతాత్మకమైన లోకంలో శాశ్వతమైనదేదీ లేదు" అని స్థిరంగా చెప్పాడు.

దైవాన్ని, తన పితృదేవతలను స్మరించి తన ఖడ్గంతో విసురుగా ఏకాక్షి పై ఒక దెబ్బవేసాడు జయరాముడు. ఆ దెబ్బను అడ్డుకునే ప్రయత్నంలో తూలి పడ్డాడు ఏకాక్షి. సరిగ్గా అప్పుడే "చివరి ప్రశ్న, నీవు విశ్వసించేదేది మంత్రమా, తంత్రమా?" అని అడిగింది ఏకశిఖ. "నేను కేవలం నా స్వశక్తిని మాత్రమే విశ్వసిస్తాను" అని చెబుతూనే ఏకాక్షిని సంహరించేందుకు ఖడ్గాన్ని ఎత్తి పట్టుకున్నాడు జయరాముడు.

మరుక్షణంలో ఇద్దరూ అతని పాదాక్రాంతమయ్యారు. " రాకుమారా, మేము మా ఓటమిని అంగీకరిస్తున్నాం. ఇక పై నీ ఆజ్ఞాబద్ధులం" అని పలికారు. ప్రజల హర్షద్వానాలు మిన్నంటాయి. జయరాముడు ప్రసన్నంగా నవ్వి "మీరు ఇక పై ఎవరికీ బానిసలై వసించే పనిలేదు. మీకు స్వేచ్ఛనిస్తున్నాను. ఎవరికీ ఏ హానీ కలిగించకుండా బ్రతకండి" అని ప్రకటించాడు.

సామాంతులంతా అతడి ఏలుబడిని అంగీకరించారు. నరసింహుడే తిరిగి వచ్చాడని కొనియాడారు. అందరీ ఆశీస్సులతో జయరాముడు చిరకాలం విద్యానగరాన్ని పరిపాలించాడు.

కథ చెప్పటం ముగించిన గోపన్న విక్రముడితో "మీరు కూడా మీ తండ్రి కీర్తిని కాపాడాలి" అని చెప్పాడు.

“అత్తగారి కొడుకైనా ఆ నూరు వక్కలే

అమ్మగారి అన్నైనా మన్నింపు దక్కలే

ధర్మాన్ని కాసితేను సుట్టమై ఉంటాడు

దాయాదుల కష్టబెడితే కడతేర్చమంటాడు

నల్లనోడే ఆ నల్లనోడే

అందరినీ నడిపించే మాయలోడే

నల్లనోడే మా నల్లనోడే

ఎవ్వరికీ చిక్కని అల్లరోడే"

మిట్ట మధ్యాహ్నంవేళ సూర్యుడు నడినెత్తిన తీక్షణంగా ఉన్నాడు. నాగావళి చడీచప్పుడు లేకుండా మెల్లగా ప్రవహిస్తుంది. అడవిగాలి రివ్వున తిరిగి ఎండవేడిని తగ్గిస్తూ ఉంది. ఆవులు చెట్ల నీడల్లో చేరి అప్పటి వరకూ తిన్న రుచి నెమరేస్తూ ఉన్నాయి. కొంతమంది యువకుల్ని కాపుకి ఉంచి, మిగిలిన గోపాలురంతా కూటి కునుకులో ఉన్నారు. గోపన్నతో పాటు రాకుమారులకు కూడా మాగన్నుగా నిద్ర పట్టేసింది. కాపలా కాస్తున్న యువకులంతా ఒకచెట్టు నీడన చేరి వైకుంఠపాళీ ఆట మొదలెట్టారు.

ఆట మహారంజుగా సాగుతూ ఉంది. పాము నోట పడ్డవాడు అయ్యో అని నిట్టూరుస్తుంటే, మిగిలినవారు విరగబడి నవ్వుతున్నారు. నిచ్చెనలెక్కుతున్న వాళ్ళు గీర్వాణాలు పోతున్నారు. చెట్లక్రింద చతికిలబడ్డ ఆవులంతా లేచి, మోరలెత్తి చూడసాగాయి. ఆటలో పడిన యువకులకు ఆవుల ధ్యాసే లేదు. కాస్త దూరంగా ఉన్న ఆవులు "అంబా" అంటూ అరవటం మొదలుపెట్టాయి. మందలో ఒక్కసారిగా అలజడి మొదలయ్యింది. ఆ ఆవుల అరుపులో భయం ధ్వనించగానే గోపన్నకు చప్పున తెలివొచ్చింది. నిద్ర నుండి లేస్తూనే అప్రమత్తుడై, అలజడి మొదలైన వైపు చూపు సారించాడు.

దూరంగా ఉన్న ముళ్ళపొదల్లో ఏదో జంతువు నక్కినట్టు గోపన్న గ్రహించాడు. అతని చూపు ఆ పొదపైనే నిలిచిపోయింది. అతని చెవులు, ముక్కు కూడా అప్రమత్తంగా అన్నింటినీ గ్రహిస్తున్నాయి. ఆ పొదల పై నుండి వచ్చిన గాలి ముక్కున సోకగానే పొదల్లో బెబ్బులిరా అని పెద్ద కేక పెట్టాడు గోపన్న. అంతే అక్కడ నిద్రలో ఉన్న వారంతా ఉలిక్కిపడి ఒక్కసారి లేచారు. వైకుంఠపాళీ ఆడుతున్న కుర్రాళ్ళు పరుగున అక్కడికి వచ్చారు. అందరూ పెద్దగా అరుస్తూ ఆ పొద వైపుగా పెద్ద పెద్ద రాళ్ళు విసురుతూ, బరిసెలతో ముందుకు ఉరికారు. ఆ సందడికి కంగారు పడిన పెద్దపులి ముందుకి ఉరికేందుకు చూసినా, అంతమంది జనాల్ని చూసి వెనక్కి తగ్గి అడవిలోకి పారిపోయింది.

నట్టడివిలో కాపుకి వచ్చినప్పుడు కనిపెట్టుకుండాలని తెలియదా? ఆ పులినోట ఒక్క ఆవు పడినా గోహత్య చేసిన పాపం మనందరికీ చుట్టుకుంటుంది. పని మీద శ్రద్ధ ఉండాలి. అడవి మధ్యలో ఆదమరిచి ఉంటే పశువులకే కాదు, మనుషులకి కూడా ప్రమాదం తప్పదు. గాలిలో వచ్చే వాసనలతో, వినిపించే శబ్దాలతో దాపులకు ఏ జంతువు వచ్చిందో గ్రహించాలి. మనం శ్రద్ధగా వింటే చెట్టు మీద పిట్ట కూడా హెచ్చరిస్తుంది. ఆవులు మోరలెత్తి అరుస్తాయి, భయంతో పరుగులు పెడతాయి. పరిసరాలు గమనించక పోతే ఎలా? అని కాపలా ఉన్న యువకులను మందలించాడు గోపన్న.

చేసిన తప్పుకి వారు క్షమాపణలు చెప్పుకున్నారు. వారం రోజులపాటు అగ్రహారంలో గుడిని శుభ్రం చెయ్యమని వారికి శిక్ష విధించాడు గోపన్న. యువకులంతా తలదించుకుని ఆ శిక్షకు అంగీకరించారు. చీకటి పడుతుండటంతో అందరూ కదిలి అగ్రహారం వైపు నడిచారు.

సాయంత్రం గోపన్న గుడి బయట కూర్చుని ఉన్నాడు. యువకులు నది నుండి కావళ్ళతో నీళ్ళను తెచ్చి గుడిని శుభ్రం చేస్తూ ఉన్నారు. రాకుమారులు గోపన్న దగ్గరకు వచ్చి "గోపన్న తాత, పాపం ఈ యువకులంతా ఎంతో మంచివారు, మీరంటే భయం,భక్తి ఉన్నవారు. ఏనాడు తప్పు చేసి ఎరుగరు కదా. ఈ ఒక్కరోజు చేసిన తప్పుకి వారిని శిక్షించటం, వారిని చిన్నబుచ్చినట్టు కాదా?" అని అడిగారు.

గోపన్న నవ్వి "నాయనలారా, ప్రజలను ఏలే ప్రభువులైనా, గ్రామాన్ని కాచే పెద్దలయినా ముందుగా గుర్తించాల్సింది సమూహ రక్షణ. ఈ బాధ్యతలో ఏ చిన్న అలసత్వానికి అవకాశాన్నిచ్చినా అది సమూహానికి పెను ప్రమాదంగా దాపురిస్తుంది. సదా సత్పురుషులను పూజించే

యాదవకులం కేవలం ఒకనాడు ఒక మహర్షిని అవమానించిన పాపానికి నాశనం కావటం తెలుసు కదా. అంతే కాదు పరిపాలనలో తన,పర అనే విచక్షణ కూడదు. సమన్యాయం కలిగిన నాడే అది ధర్మబద్ధమైన పరిపాలన. బంధుప్రీతితో సమన్యాయాన్ని ఉపేక్షించి తగిన ఫలితం అనుభవించిన విశ్వనాధ భూపతి కథ చెబుతాను వినండి అన్నాడు గోపన్న.

## *గోపన్న చెప్పిన విశ్వనాధ భూపతి కథ*

పూర్వం సింహపురిని విశ్వనాధ భూపతి అనే గొప్ప చక్రవర్తి పరిపాలించేవాడు. అతడు సకలశాస్త్రకోవిదుడు, వీరుడు. తన పూర్వీకులు స్థాపించిన రాజ్యాన్ని సురక్షితంగా కాపాడుతూ గొప్ప పరిపాలకుడిగా పేరు గడించాడు. కులదైవమైన బాలత్రిపురసుందరిని భక్తి,శ్రద్ధలతో కొలిచేవాడు. అతడికి అమ్మ కటాక్షం కలిగిందని, అతడు పిలిస్తే పలుకుతుందని అందరూ నమ్మేవారు. దానికి గుర్తుగా అన్నట్టు రాజమందిరానికి ఎదురుగా ఉండే చెట్టు తొర్రలో ఒక బంగారు చిలుక ఉండేది. ఆ చిలుక ఎక్కడి నుండి వచ్చిందో ఎవరికీ తెలియదు. పగలంతా కొమ్మలపై వాలి రాజమందిరం వైపు చూస్తూ ఉండేది. చీకటి పడుతుండగా తొర్రలోకి వెళ్ళిపోయేది.

ఆ చిలుక ఏదైనా తిన్నట్టుగా ఎప్పుడూ ఎవరూ చూడలేదు. కొందరు పిల్లలు సరదా పడి పళ్ళూ, తినుబండారాలు పెట్టి పిలిచినా ఆ చిలుక కన్నెత్తైనా చూడలేదు. కొంతమంది ఉత్సాహవంతులైన యువకులు ఆ చిలక సంగతేంటో తేలుస్తాం, రాత్రిపూట తొర్రలో ఉండగా పట్టేస్తాం అని ముందుకు వచ్చారు. రాజుగారికి ఆ మాట తెలిసి "ఆ చిలుకను పట్టుకునేందుకు వస్తే రాజ్యం నుండి బహిష్కరిస్తానని" దండోరా వేయించారు. దానితో బయపడి ఎవరూ ఆ చిలుక జోలికి రాలేదు. ఏళ్ళు గడిచినా ఆ చిలుకకు వన్నె తగ్గలేదు, ముసలితనం రాలేదు. ప్రజలంతా ఆ చిలుక బాలత్రిపురసుందరి అంశ అని నమ్మసాగారు.

ప్రతీ ఏడాదిలానే ఒకసారి రాజ్యంలో విజయదశమి ఉత్సవాలు జరుగుతున్నాయి. పదిరోజులపాటూ సాగే ఆ ఉత్సవాల్లో రథోత్సవం, తెప్పోత్సవం అంటూ అనేక సంబరాలు ఉంటాయి. ఆ రోజు చీకటి పడుతుండగా అమ్మవారికి తెప్పోత్సవానికి సిద్ధం చేసారు. రాజ్యంలో ప్రజలంతా వచ్చి అమ్మవారి కోనేరు ఒడ్డున నిలుచున్నారు. మహారాజు గారికోసం అందరూ ఎదురు చూస్తున్నారు. మహారాజు తన మరిది సూరవర్మతో సహా అక్కడికి చేరుకున్నాడు. ఉత్సవాన్ని ప్రారంభించారు. ప్రభువు పూజలో ఉండగా అతడి మరిది సూరవర్మ అక్కడ అందంగా అలంకరించుకుని ఉన్న స్త్రీలను గమనించ సాగాడు.

కళావతి అనే కన్య అతడి దృష్టిని ఆకర్షించింది. నవయవ్వనంతో, అపురూప లావణ్యంతో మెరిసిపోతున్న ఆమెను చూడగానే అతడి బుద్ధి పక్కదారి పట్టింది. సమయం, సందర్భం తానున్న ప్రదేశం అన్నీ మరిచి ఆమె వైపుగా సాగాడు. కళావతి ఆ సంబారాలను తిలకిస్తూ దేవాలయమంతా తిరుగుతూ ఉంది. సూరవర్మ ఆమెను అనుసరించాడు. ఎవరూ లేని సమయంలో ఆమెను సమీపించి ఆమెను నిర్బంధించాడు. బిత్తరపోయిన కళావతి బిగ్గరగా ఎవరు నువ్వని అరిచింది. అతడు తన వివరాలు చెప్పి తనను అంగీకరిస్తే రాజభోగాలు కల్పిస్తానని ఆశ చూపాడు. ఆమె అతడి నుండి చేతిని విడిపించుకుని దూరంగా జరిగి తనకు ఎటువంటి ఆశలూ లేవని, తన బావ ఆదిత్యుడే తన కాబోయే భర్త అని చెప్పింది.

కళావతిని వెతుక్కుంటూ అప్పటికే అక్కడకు వచ్చిన ఆదిత్యుడు, సూరవర్మ దౌర్జన్యాన్ని చూసి ఆగ్రహోదగ్రుడయ్యాడు. సరాసరి పిడిగుద్దులతో అతడి మీదకి దూకాడు. ఒక స్త్రీ ముందు తనకి జరిగిన అవమానాన్ని భరించలేని సూరవర్మ అతడి పైకి కత్తి దూసాడు. ఆదిత్యుడు

కూడా అతన కత్తితో అతడి పై తలబడ్డాడు. ఇద్దరి మధ్య ద్వంద్వయుద్ధం సాగింది. ఆ అలజడికి దాపులనే ఉన్న రాజభటులు అక్కడకు చేరుకున్నారు. సూరవర్మతో తలపడుతున్న ఆదిత్యుడిని బంధించారు.

మరునాడు విశ్వనాధుడు కొలువు చేసాడు. ఆదిత్యుడిని అతడి ముందు ప్రవేశపెట్టారు. రాజభటులు అతడి పై అభియోగాన్ని మోపుతూ రాజబంధువు పై తిరుగుబాటు రాజ్యద్రోహమని, తగిన శిక్ష విధించమని చెప్పారు. ఆదిత్యుడు మహారాజుకి నమస్కరించి జరిగిన వృత్తాంతం వివరించాడు. మహారాజు వెంటనే భటులను పిలిచి కళావతిని సభకు తోడ్కొని రమ్మన్నాడు. కళావతి మిక్కిలి దుఃఖితయై జరిగినది వివరించింది. ఆమె మాటలతో సత్యాన్ని గ్రహించిన మహారాజు దుందుకుడుతనం వదులుకొమ్మని సూరవర్మను హెచ్చరించి, ఆదిత్యుడిని విడువమని భటులను ఆదేశించాడు. సభలో అందరూ విశ్వనాధుని ధర్మబుద్దిని ప్రశంసిస్తూ కీర్తించ సాగారు. బంధుప్రీతి లేని పరిపాలకునిగా కొనియాడారు.

ఆదిత్యుడు మాత్రం ఆ తీర్పుని గర్హించాడు. "మహారాజా, ఏ తప్పు చెయ్యని నన్ను బంధించి సభకు లాక్కుని వచ్చారే, తప్పు చేసాడని తేలిన సూరవర్మను ఎందుకు బంధించలేదు? కేవలం మందలింపుతో సరిపెట్టారు, ఎందుకు శిక్షించలేదు?" అని ప్రశ్నించాడు. సభలో అందరూ నివ్వెరపోయారు. తన తమ్ముడిని శిక్షించే పరిస్థితి వస్తుందని గ్రహించిన మహారాణి, రాజబంధువుని ప్రజల సమక్షంలో సామాన్యుడిలా శిక్షిస్తే రాజకుటుంబం విలువ దిగజారుతుందని రాజుని హెచ్చరించింది. మహారాజు తీర్పుని ఎదిరించిన ఆదిత్యుడిని రాజద్రోహిగా పరిగణించి అతడికి నూరు కొరడా దెబ్బలు శిక్ష విధించమని మహామంత్రికి ఆజ్ఞాపించింది. మహారాజు ఆమె మాటలు కాదనలేక మౌనంగా అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

ఆదిత్యుడిని పట్టణ వీధుల్లో ఊరేగించి, శిక్షాస్థలికి తీసుకుని పోయి ప్రజల సమక్షంలో నూరు కొరడా దెబ్బలు కొట్టి వదిలారు. ఆదిత్యుడు బాధను మునిపంట అణుచుకున్నాడు. శిక్ష పూర్తి కాగానే ఆకాశం వైపు చూస్తూ "దేవతలారా, మా రాజు ధర్మం తప్పాడు. అర్భకుడినైన నన్ను నిష్కారణంగా శిక్షించాడు. అతడికి తగినబుద్ధి చెప్పే అవకాశమివ్వండి" అని బిగ్గరగా అరిచాడు. ఆ క్షణంలో రాజమందిరానికి ఎదురుగా ఉన్న బంగారు చిలుక రివ్వున గాలిలో ఎగురుతూ ఎటో వెళ్ళిపోయింది. ఆ చిలుక మరి తిరిగి రాలేదు. రాజ్యమంతా ఆందోళన మొదలయ్యింది. రాజు చేసిన పనికి అమ్మ రాజ్యాన్ని వదిలి వెళ్ళిపోయిందని అందరూ చెప్పుకున్నారు.

మహారాజు జరిగినది తెలుసుకుని మిక్కిలి విచారించాడు. ఆనాటి నుండి అతడి పూజలలో, బాల త్రిపురసుందరి ధ్యానంలో అతడికి ఏకాగ్రత కుదిరేది కాదు. రాజ్యంలో వర్షాలు కరువయ్యాయి. దొంగతనాలు, అల్లర్లు చోటు చేసుకున్నాయి. ఇదివరకెన్నడూ చూడని దారుణాలు రాజ్యంలో మొదలయ్యాయి.

ఆదిత్యుడు కళావతిని వివాహం చేసుకున్నాడు. రోజులు గడుస్తున్నాయి కానీ అతడు జరిగిన అవమానం మరిచిపోలేకపోతున్నాడు. కళావతి ఎన్నో విధాలుగా అతడి మనసు మరల్చేందుకు యత్నించింది. పెద్దలు పలువిధాలుగా బోధించారు. అయినా అతడి మనసు నిర్విరామంగా మండుతూనే ఉంది. ఆ దంపతులకు ఒక కుమారుడు కలిగాడు. కళావతి ఎంతో సంతోషించింది. బిడ్డను చూసైనా ఆదిత్యుడు లోకంలో పడతాడని అనుకుంది. ఒకనాడు అర్ధరాత్రి అందరూ ఆదమరిచి నిదిరిస్తుండగా ఆదిత్యుడు ఇల్లు వదిలి వెళ్ళిపోయాడు. ఉదయాన్నే అందరూ ఊరు,వాడ వెతికించారు. ఆదిత్యుడి జాడ తెలియలేదు. కళావతి ఆ రోజు నుండి దుఃఖిస్తూనే ఉంది.

ఏన్నో ఏళ్ళు గడిచిపోయాయి. విశ్వనాథ మహారాజు వృద్ధుడయ్యాడు. సింహపురి కళతప్పి ఎప్పుడూ కరువుకటకాలతో అల్లాడేది. ఎన్ని పూజలు చేసినా, యజ్ఞాలు చేసినా ఫలితం దక్కలేదు. మహారాజుకి పదహారేళ్ళ కూతురు ఉంది. ఆమె గొప్ప జాతకురాలు. కులదేవత పేరు మీద ఆమెకు బాలామణి అని పేరు పెట్టుకున్నాడు మహారాజు. ఆమె పుట్టిన తర్వాత రాజ్యంలో కష్టాలు తీరొచ్చని పండితులు చెప్పారు. కానీ ఆమెకు పదహారేళ్ళొచ్చినా రాజ్యం పరిస్థితిలో మార్పు రాలేదు. మహారాజుకి ఆశ సన్నగిల్లింది. ప్రాయశ్చిత్తంతో అతడి మనసు దహించుకుపోతుంది.

మహారాజు ఒకనాడు కూతురిని తీసుకుని దేవాలయానికి వెళ్ళి వస్తుండగా క్షణాల్లో వాతావరణం మారి పెనుగాలి వీచింది. సేవకులంతా చెట్టుకోకరు, పుట్టకొకరుగా కొట్టుకుపోయారు. మహరాజు కంగారుపడి చూస్తుండగా, ఒక మాంత్రికుడు అతని ముందుకు వచ్చాడు. మహరాజు చూస్తుండగానే బాలమణిని బంధించి అక్కడి నుండి అదృశ్యమయ్యాడు. మహారాజు నివ్వెరపోయాడు. నేలపై పడి "బాల బాల" అని ఏడ్వసాగాడు. పరివారమంతా అక్కడకు చేరి అతడిని నిలువరించేందుకు ప్రయత్నించసాగారు.

మహారాజు నిలుచున్న చోటే పండితులను, మంత్రులను రప్పించాడు. సైన్యాన్ని నలుదిక్కులా పంపించాడు, అంజనం వేయించాడు, జాతకాలు చూపించాడు. ఎవ్వరికీ ఏమీ అంతు చిక్కలేదు. రాకుమారి జాతకంలో అన్నీ గొప్ప యోగాలే ఉన్నాయి. మృత్యుభయం లేదు అని మాత్రం చెప్పారు. రోజులు గడిచిపోతున్నా రాకుమారి జాడ తెలియలేదు. విసుగు చెందిన మహారాజు రాకుమారిని తెచ్చినవారికి ఆమెనిచ్చి వివాహం చేస్తానని, తన రాజ్యాన్ని ధారపోస్తానని చాటింపు వేయించాడు.

కళావతి కుమారుడు విజయుడు అప్పటికి పెరిగి పెద్దవాడయ్యాడు. ఈ చాటింపు విన్నాడు. తల్లి దగ్గరకు వెళ్ళి తను రాకుమారిని వెతుకేందుకు వెళతానని, తనని ఆశీర్వదించమని అడిగాడు. ఆమె అతడిని వారించింది. మాంత్రికులను ఎదిరించటం సామాన్యులకు సాధ్యం కాదని చెప్పింది. అయినా అతడు తన మొండి పట్టుదల వీడలేదు. చివరకు ఆమె ఆంగీకరించి సింహపురి సమీపంలో ఉన్న పర్వతాల్లో వెతకమని, అక్కడే మంత్రగాళ్ళు ఉంటారని చెప్పింది. అమ్మకు నమస్కరించి విజయుడు పర్వతాల వైపుగా సాగాడు.

రెండు రోజుల ప్రయాణానంతరం విజయుడు ఆ పర్వతాల వద్దకు చేరాడు. అక్కడ వృక్షాల ఫలాలు తింటూ, పగలంతా వెతుకుతూ, రాత్రుల్లు విశ్రమిస్తూ ముందుకు సాగాడు. కొండలు, గుట్టలు, గుహలు, లోయలు ఎంత గాలించినా మరో మనిషి జాడే కనిపించలేదు. తిరిగి తిరిగి మనిషి సుష్కించిపోయాడు. ఒకనాడు అడవిలో గాలిస్తుండగా అతడికి ఒక పాడుబడిన దేవాలయం కనపడింది. విశ్రాంతి కోసం ఆ దేవాలయం మండపంలో కూర్చున్నాడు.

కాసేపటికి అతడికి పెద్ద పెద్ద శబ్ధాలు వినపడసాగాయి. ఆ శబ్ధాలను అనుసరిస్తూ అతడు ఆ గుడిలోకి ప్రవేశించాడు. గర్భగుడిలో కాళీమాత భారీ విగ్రహం కనిపించింది. చూసేందుకు ఆ విగ్రహం భీతిగొలుపుతూ ఉంది. అక్కడంతా వెతికినా మనుషులెవరూ కనిపించలేదు. అలా వెతుకుతున్న విజయుడికి అమ్మవారి చేతిలోని శూలం తగిలింది. అది కొద్దిగా అమ్మవారి చేతి నుండి జారినట్టయ్యింది. దానిని సరి చేసేందుకు విజయుడు విగ్రహం నుండి శూలాన్ని వేరు చేసాడు. వెంటనే పెద్ద శబ్ధంతో విగ్రహం వెనుకనున్న రహస్య ద్వారం తెరుచుకుంది.

విజయుడు ఆ శూలాన్ని పట్టుకుని ఆ రహస్యద్వారం గుండా లోపలికి ప్రవేశించాడు. లోపల కళ్ళుపొడుచుకున్నా కనపడని చీకటి. ఆ చీకటిలోనే అలా ముందుకు కాసేపు నడిచాడు విజయుడు. కాసేపటికి మరో మందిరం కనిపించింది. అక్కడ దివిటీల వెలుగులో ఒక

మాంత్రికుడు కనిపించాడు. అతడు ధ్యానంలో ఉన్నాడు. విజయుడు చుట్టూ చూసాడు ఎక్కడా రాకుమారి జాడలేదు. "దుర్మార్గుడా, నీ కపట పూజలు చాలించి లే. మా రాకుమారిని ఎక్కడ దాచావో చెప్పు" అని గట్టిగా అరిచాడు విజయుడు.

ఆ మాంత్రికుడు ధ్యానంలో నుండి లేచి విజయుడిని చూసాడు. పట్టరాని కోపంతో విజయుని పైకి ఆయుధంతో వచ్చాడు. విజయుడు తన దగరున్న శూలంతో అతడిని ఎదిరించాడు. ఇద్దరూ దీటుగా తలపడ్డారు. ఒకరినొకరు తీవ్రంగా గాయపరుచుకున్నారు, అయినా పోరు ఆగలేదు. అలా కొన్ని గంటలు గడిచాయి, మాంత్రికుడి శక్తి సన్నగిల్లి నేలపై చతికిలబడ్డాడు. విజయుడు అలుపు తీర్చుకునేందుకు అక్కడే ఉన్న శిలాప్రతిమపై ఒరిగిపోయాడు. విజయుని స్పర్శ సోకగానే ఆ శిల బాలామణిగా మారింది.

మాంత్రికుడు, విజయుడు ఇద్దరూ ఆశ్చర్యానికి లోనయ్యారు. జరుగుతున్నదేమీ అర్థం కాని బాల బిత్తర చూపులు చూడసాగింది. అప్పుడే అక్కడకు ఎగురుతూ బంగారు చిలుక వచ్చింది. ఆ బంగారు చిలుకను చూడగానే మాంత్రికుడు, విజయుడిని "ఎవరు నీవు? నీకు ఈమెకు గల సంబంధం ఏమిటి?" అని అడిగాడు. విజయుడు తాను కళావతి కుమారుడనని, రాకుమారిని కాపాడాలని వచ్చానని చెప్పాడు.

ఆ మాంత్రికుడు విజయుడిని కావలించుకుని "కుమారా, నేను నీ తండ్రి ఆదిత్యుడిని. మహారాజు పై పగతో మీ అందరిని వదిలి ఇలా దీక్ష పట్టాను. కానీ భగవంతుడు మరోలా న్యాయం చేసాడు" అని చెప్పి, రాకుమారిని,విజయుడిని వెంటబెట్టుకుని విశ్వనాధుని చెంతకు వచ్చాడు. జరిగినదంతా తెలుసుకుని విశ్వనాధుడు ఆదిత్యునికి, కళావతికి క్షమాపణలు చెప్పి, ఇచ్చిన మాట ప్రకారం బాలామణిని, విజయునికిచ్చి వివాహం జరిపించాడు. వివాహ సమయంలో రాజమందిరంలో బంగారు చిలుక వచ్చి కనిపించి మాయమయ్యింది.

విజయుడు మహారాజయ్యాడు. రాజ్యంలో తిరిగి వర్షాలు కురిసాయి, పంటలు పండాయి. చోరభయం తగ్గింది. శాంతి,సౌభాగ్యాలు వెల్లి విరిసాయి. ధర్మాన్ని తప్పితే జరిగే వినాశం తెలిసిన విజయుడు, కలకాలం నీతిగా పరిపాలించాడు.

కథను మొత్తం విన్న రాకుమారులు "గోపన్నతాత, పరిపాలన లో బంధుప్రీతి కూడదని, చిన్న నేరమైనా ఉపేక్ష కూడదని, ప్రజలందరినీ సమ దృష్టితో చూస్తేనే భగవంతుడు హర్షిస్తాడని మేము తెలుసుకున్నాము. ఇంత గొప్ప నీతిని నేర్పిన నీకు ఋణపడి ఉంటాం" అని చెప్పారు. గుడిని శుభ్రం చేయటం పూర్తికావటంతో అందరూ ఇళ్ళకు నడిచారు.

“నిప్పులోన వేస్తాడు

నీళ్ళలోకి తోస్తాడు

నిమ్మళంగా వచ్చి చేయందిస్తాడు

మాయలెన్నో చేస్తాడు

మిధ్యలో వొదిలేస్తాడు

మాయపొరలన్నిటిని తీసిపారేస్తాడు

మాయలోడే మహా మాయలోడే

మాయలన్నిటికీ మాయ ఆ నల్లనోడే"

ఆవేళ ఎండ మండిపోతూ ఉంది. గోవులన్నీ ఎండకు తాళ లేక చెట్ల నీడన సేద తీరుతూ ఉన్నాయి. పక్షులన్నీ గుబురుచెట్లలో కూర్చుని చప్పుడు చెయ్యకుండా ఉన్నాయి. యువకులంతా ఒక కంట గోవుల్ని గమనిస్తూ, మరోపక్క ఆటపాటల్లో మునిగిపోయారు. రాకుమారులు కూడా ఆ యువకులతో ఉల్లాసంగా గడుపుతున్నారు. గోపన్న ఆకాశాన్ని చూసి భోజనం వేళయ్యిందని గ్రహించి, యువకులందరినీ కూటికి రమ్మని కేకేసి, కాళ్ళు కడిగేందుకు యేటిలోకి దిగాడు.

దూరంగా అగ్రహారం నుండి పెద్దగా కేకలు, అరుపులు వినబడసాగాయి. గోపన్న వెంటనే యేటిలో నుండి బయటకు వచ్చి అగ్రహారం వైపు చూపు సారించాడు. అగ్రహారంలో ఏదో కలవరం మొదలయ్యింది. గోపన్న ఇద్దరు యువకుల్ని విషయం తెలుసుకు రమ్మని పంపాడు. ఇద్దరు యువకులూ ఊరిలోకి పరుగుతీసారు. గుడి మలుపులో ఉండే మల్లన్న కొడుకు ఎంకన్న ఉన్నవాడు ఉన్నట్టుగా నేల మీద విరుచుకుని పడిపోయాడు. మనిషి మెలుకువగానే ఉన్నాడు కానీ, మనలో లేడు. గాలిలోకి చూపులు చూస్తున్నాడు. ఎవరితోనో మాట్లాడుతున్నాడు. ఉన్నట్టుండి గాట్టిగా నవ్వుతున్నాడు, వెంటనే ఏడుస్తున్నాడు. ఎంకన్న తల్లి సూరమ్మ శోకాలు మొదలెట్టింది. ఆడవారంతా చేరి ఆమెను ఓదారుస్తున్నారు.

"ఓరి నా కొడుకో కొడుకా.. ఒక్కగానొక్క కొడుకో కొడుకా.. లేక లేక పుట్టిన పుణ్యాల పురుడా.. నీకోసం దేశాలన్నీ తిరిగి... ఎన్ని దేవుళ్ళకి మొక్కానురా.. ఎన్ని ముడుపులు కట్టానురా... ఏ దిష్టి సోకిందిరా నీకు... ఎవరి కళ్ళు పడ్డాయిరా నీకు.. ఏ గాలి సోకిందిరా నీకు..." అంటూ సూరమ్మ శోకాలతో ఉరంతా ఒక్కచోట చేరింది.

విషయం తెలుసుకున్న గోపన్న భూతవైద్యుడిని తోడ్కొని రమ్మని ఒక యువకుడిని పంపి, మిగిలిన వారితో అగ్రహారం చేరుకున్నాడు. నేరుగా మల్లన్న ఇంటిలోకి వెళ్ళాడు. ఎంకన్న కనుగుడ్లు పెద్దవి చేసి గోపన్నను చూసి దెయ్యంలా ఒక నవ్వు నవ్వాడు. చిన్నవారైన ఇద్దరు రాకుమారులు సుసేనుడు, చిత్రసేనుడు భయంతో గజగజ వణుకుతూ అన్న విక్రముడి వెనుక దాక్కున్నారు. విక్రముడు కాస్త ధైర్యంగా ఉన్నా, ఎంకన్న విచిత్ర ప్రవర్తన గమనించసాగాడు.

ఇంతలో భూతవైద్యుడు అక్కడకు చేరుకున్నాడు. అతడిని చూడగానే ఎంకన్న భయంతో గట్టిగా కేకలు వేస్తూ అక్కడి నుండి పారిపోయే ప్రయత్నం చేసాడు. బలమైన యువకులు నలుగురు పట్టుకున్నా ఎంకన్నని ఆపలేకపోతున్నారు. భూతవైద్యుడు గట్టిగా అరుస్తూ వచ్చి చేతిలో ఉన్న మంత్రదండంతో ఎంకన్న తలమీద ఒక దెబ్బవేసాడు. ఎంకన్న లోని ఆవేశం ఒక్కసారిగా తగ్గిపోయింది. తలదించుకుని వేలాడిపోయాడు. భూతవైద్యుడు పసుపు, కుంకుమలతో ఒక ముగ్గు వేసి "వచ్చి ఇక్కడ కూర్చో" అని ఆజ్ఞాపించాడు. ఎంకన్న కుక్కపిల్లలా అతడి వెనుకే వచ్చి ముగ్గులో కూర్చున్నాడు. అతని ఎదురుగా భూతవైద్యుడు కూర్చున్నాడు. ఎంకన్న మెల్లగా మూలుగుతూ ఏడుపు అందుకున్నాడు.

"నన్ను తరిమేయకండిరా.. నన్ను వదిలేయండిరా.. నేనెక్కడికీ పోనురా.. నన్ను సుఖంగా ఉండనివ్వండిరా.." అని ఎంకన్న ఆడవాళ్ళ తీరున ఏడుపు అందుకున్నాడు.

"ఎవరు నువ్వు.. చెప్పు ఎవరు నువ్వు?" అని గద్దించాడు భూతవైద్యుడు. "నేను అమ్మిగారిచెరువు పక్కన మామిడితోటలో కాపురమున్న పేరిశాస్త్రిగారి కోడల్నిరా. నా పేరు అలివేలురా.. అలివేలు. మా ఆయన రామశాస్త్రి మీద బెంగపెట్టుకున్నానురా.. మా ఆయన తిండిలేక నిద్రలేక కష్టపడి పోతున్నాడురా... మా ఆయన్ని నాతో తీసుకుపోతానురా..." అని ఎంకన్న శోకాలు పెడుతూ చెప్పాడు.

"మరి ఇక్కడికి ఎందుకొచ్చావ్.. ఈ పిల్లాడిని ఎందుకు పట్టుకున్నావ్.." అని గద్దించాడు భూతవైద్యుడు. "మా ఆయన దగర మంత్రముంది.. విద్యలున్నాయి.. దేవుళ్ళు తిరుగుతారు. ఆ గుమ్మంలోకి పోలేక తోటలోనే తిరుగుతున్నాను.. వీడు తోటలోకి వచ్చి చిక్కాడు.. వీడిని వదలను.. నన్ను వదిలించాలని చూస్తే వీడిని చంపేస్తా.. వీడి మెడ కొరికి చంపేస్తా..." అని చెప్పింది ఎంకన్నలోని దెయ్యం.

భూతవైద్యుడు నిప్పుల్లో సాంబ్రాణి వేసి పొగబెట్టాడు. "నీకు ఏం కావాలో చెప్పు ఆ చల్లని తల్లి చేసిపెడుతుంది. ఆ తల్లి బిడ్డను వదిలిపో" అని సూరమ్మని చూపిస్తూ చెప్పాడు భూతవైద్యుడు. సూరమ్మ వచ్చి ఎంకన్న ముందు మోకరిల్లి "అవును తల్లి అవును. నీకు ఏం కావాలన్నా చేసి పెడతాను. బాపానోలింటి బిడ్డవి ఇది నీకు తగదు. నా బిడ్డను వదిలిపో" అని చెప్పింది.

"నాకు పొంగలి కావాలి, గారెలు కావాలి, అరిసెలు కావాలి, ఎర్రకోక కావాలి, అడవిలో దెయ్యాలకోనలో గుహకు వేలాడుతున్న పుట్టతేనె కావాలి" అని ఎంకన్నకు పట్టిన దెయ్యం తన కోరికలు చెప్పింది. "ఇప్పుడే అన్నీ చేసి పెడతాను" అని సూరమ్మ ఉరుకులు మీద వంటకు ఏర్పాటు చేసింది. ఊరిలో ఆడాళ్ళంతా సాయంగా వెళ్ళారు. వంటలు తయారవుతున్నాయి కానీ ఆమె కోరిన పుట్ట తేనె, అందులోనూ దెయ్యాలకోనలో గుహ గోడకు వేలాడుతున్న తెనెపట్టు నుండి ఎలా తేవటమని ఊరిలో మగవాళ్ళంతా తల పట్టుకున్నారు.

గోవులను కాచే చిట్టడివి దాటి, దట్టమైన అడవిలో ఉండే ఆ దెయ్యాలకోన పేరు వినటమే కాని సాహసించి ఎవరూ అటువైపే పోలేదు. అటుపోయి తిరిగొచ్చిన మానవమాత్రుడే లేడంటారు. ఆ దెయ్యాలకోనలో ఉన్న గుహలో దెయ్యాలు నివాసముంటాయని, అడవిలోని బలిసిన ఏనుగులని, దున్నలను పీక్కుతుంటాయని చెప్పుకుంటారు. అన్నింటిలోనూ నరమాంసమంటే వాటికి ఎంతో ప్రీతి అని అనుకుంటారు. అలాంటి కోనకు వెళ్ళి పుట్టతేనె తెచ్చే మొనగాడెవ్వడు? ఆ దెయ్యానికి వదిలిపోవటానికి ఇష్టంలేకే ఇలా చెప్పింది అని అందరూ చర్చించుకోసాగారు.

వంట చేస్తూనే సూరమ్మ "నా కొడుకుని కాపాడే మొనగాడే లేడే ఈ ఊరిలో? ఇలాంటి ఊరిలో దెయ్యాలు కాక మనుషులు బ్రతకగలరా?" అంటూ శోకాలు పెడుతూనే ఉంది. చేవగల వీరులు, యువకులు ఎందరున్నా ఒక్కరూ అడుగు ముందుకు వెయ్యలేదు. భూతవైద్యుడు గోపన్న వద్దకు వచ్చి "తాతా నన్నే పొమ్మందువా, నేను దెయ్యాలకోనకు పోతాను. కానీ భూతవైద్యుడిని అంటి పెట్టుకోని తిరగటం దెయ్యాలకు మాములే. అలా నా వెనుకే దెయ్యాలు ఊరిలో జొరబడినా జొరబడతాయి. అందుకే సంశయిస్తున్నా" అని చెప్పాడు.

అన్నీ గమనిస్తూ కూర్చున్న గోపన్న తన మునకాల కర్ర అందుకుని అక్కడ నుండి కదిలాడు. గోపన్న ఆంతర్యం గ్రహించిన విక్రముడు తన తమ్ముళ్ళను తను తిరిగి వచ్చేంత వరకూ అక్కడే ఉండమని చెప్పి గోపన్న వెంట కదిలాడు. కొంతమంది గోపయువకులు గొడ్డళ్ళు, బరిసెలు అందుకుని వారి వెంటే నడిచారు.

అందరూ ఏరు దాటి చిట్టడవి, చిట్టడవి దాటి దట్టమైన అడవిలోకి ప్రవేశించారు. దెయ్యాలకోన అని వినటమే కాని ఎప్పుడూ వెళ్ళకపోవటం వలన ఎవరికీ దారి తెలియదు. ఎవరో చెప్పగా విన్న అనవాళ్ళే ఆధారంగా అందరూ ముందుకు చొచ్చుకుపోతున్నారు. ఆ దండును చూసి చెట్లపై పక్షులన్నీ కలవరపడుతున్నాయి. వేటగాళ్ళెవరో వచ్చారని భయపడి జంతువులు దూరంగా పారిపోయాయి. అలా ఎంతో దూరం అడవిలో నడిచాక వారికి కుళ్ళినమాంసపు దుర్వాసన వచ్చింది. అక్కడే పరీక్షగా చూస్తే దట్టమైన వృక్షాల వెనుక వారికి ఒక చీకటి గుహ కనిపించింది.

అందరిలో కాస్త భయం తొంగి చూసింది. అక్కడ పడి ఉన్న జంతు కళేబరాలు, అస్తిపంజరాలు వారి భయాన్ని మరింత పెంచాయి. యువకులంతా గొడ్డళ్ళు, బరిసెలు తీసి సిద్దంగా పట్టుకున్నారు. ఒక్కో అడుగు వేస్తూ ముందుకు కదిలారు. గోపన్న అందరినీ ఆపి ఒక చెట్టు చాటు నుండి ఆ చీకటిగుహను గమనించాడు. అందరూ అతడి వైపే చూస్తూ నిలుచున్నారు. కాసేపు శాంతంగా గమనించాక గోపన్న మొహం కాస్త తేలికపడింది. నవ్వుతూ యువకుల వద్దకు వచ్చి, దెయ్యాలు లేవు భూతాలు లేవు. ఆ గుహ వాకిట చూడండి సింహం కాలిగుర్తులు కనిపిస్తున్నాయి. ఈ జంతువుల్ని చంపి తిన్నది ఆ సింహమే. మృగరాజు గుహలో ఉన్న జాడలు లేవు. అది రాక ముందే మన పని ముగించుకుని పోవాలి అని అందరిని పురమాయించాడు.

గోప యువకులంతా కదిలి ఆ తేనెపట్టుకి పొగబెట్టారు. తేనెటీగలు దాడికి దొరక్కుండా అందరూ పొదలు మాటున నక్కారు. ఆ పొగకు తేనెటీగలన్నీ పట్టును వదిలి దూరంగా ఎగిరి వెళ్ళాయి. తేనెటీగలు పట్టుని వదిలి వెళ్ళగానే ఆ పొగలోనే యువకులు వెళ్ళి ఆ పట్టుని ఆకుల్లో చుట్టి గోపన్న వద్దకు తెచ్చారు. ఉత్సాహంతో అందరూ కేకలు పెట్టారు. అందరూ తిరిగి ఊరి వైపు కదిలారు.

విక్రముడు గోపన్న వద్దకు వచ్చి "గోపన్న తాతా, యువకులు ఇందరు ఉండి సాహసించలేకపోయారు. మీరు మాత్రం ఎందుకు అంత చొరవ తీసుకున్నారు?" అని అడిగాడు.

గోపన్న నవ్వి "ఊరి పెద్దగా యువకుల్లో ధైర్యం నింపాల్సిన భాధ్యత నాదే కదా. ఇక్కడ నిజంగా దెయ్యాలే ఉంటే అవి నన్ను పీక్కుని తింటే, ఈ అడవిలోకి రావటం ప్రమాదమని ఊరిలో అందరికి చెప్పిన వాడినవుతాను. అలాకాకుండా అందరిలానే నేను కూడా కదలకుంటే ఊరికి పిరికితనాన్ని నేర్పినవాడినవుతాను.

ప్రభువు అంటే పల్లకి నెక్కేవాడే కాదు, అపాయమొచ్చిన వేళ అందరికంటే ముందు నిలబడేవాడు. నేను నాలుగు అడుగులు వేస్తే, ఊరిలో ఎందరు ముందుకు కదిలారో చూడు. నాయకత్వమంటే నడిపించటం కాదు నడవాలనే స్పృహ కలిగించటం, ఉత్తేజాన్ని రేకెత్తించటం" అని చెప్పాడు.

ఇలాంటి సమస్యే ఎదురైనప్పుడు ప్రజలే ముఖ్యమని భావించిన సుశర్మ అనే రాజు కథ చెబుతాను వినండి అని చెప్పనారంభించాడు గోపన్న. యువకులంతా ఉత్సాహంగా కథ వింటూ ముందుకు నడవసాగారు.

పూర్వం పాటలీపుత్రాన్ని పరిపాలించే సుశర్మ గొప్ప ధర్మవర్తనుడు, దయాహృదయం కలవాడు. ప్రజలను కన్నబిడ్డల్లా పరిపాలించేవాడు. ప్రజలకు కూడా అతడంటే ఎంతో అభిమానం అంతకు మించిన నమ్మకం. అతడి పాలనలో రాజ్యం ఎల్లప్పుడూ సుభిక్షంగా

కళకళలాడుతూ ఉండేది. సామంతరాజులు ప్రభువుకి విధేయులై ఉండేవారు. సకాలంలో వర్షాలు పడుతూ ఉండేవి. పాడిపంటలకు లోటులేకుండా ఉండేది. ప్రజలెంతో సంతోషంగా బ్రతుకుతుండేవారు.

రాజుగారికి ఒక్కగానొక్క కుమార్తె అందాల బరిణె దమయంతి. రాచకార్యాలు తీరిన పిమ్మట , సమయమంతా కూతురుతోనే గడిపేవాడు మహారాజు. ఆమెతో పాటు తోటల్లో ఆడేవాడు. వనాల్లో విహరించేవాడు. ఆమెకు నచ్చిన పూలు, పళ్ళు తెచ్చి అందించేవాడు. కూతురంటే అతనికి పంచప్రాణాలు. మహారాణి ఇందుమతీదేవికి వారి ఆటలు చూస్తేనే కడుపు నిండిపోయేది. లేక లేక కలిగిన సంతానం కనుక దమయంతి ఆనందమే తమ ఆనందంగా భావించేవారు రాజదంపతులిద్దరూ.

ఒకనాడు మహారాజు తోటలో కుమార్తెతో ఉల్లాసంగా గడుపుతున్నాడు. ఇంతలో ప్రవేశద్వారం వద్ద ఏదో అలజడి మొదలయ్యింది. భటులు ఎవరినో గట్టిగా హెచ్చరిస్తున్నారు. మహారాజు అది గమనించి అటుగా వచ్చాడు. ఒక విప్రుడు వీపు మీద మూటతో అక్కడ నిలబడి ఉన్నాడు. అతడి వెంట అతని కుమారుడు పదేళ్ళ పాపడు కూడా ఉన్నాడు. ఏం జరిగిందని భటులను అడిగాడు మహారాజు. "ప్రభువులు విహారంలో ఉన్నారు, ప్రవేశం నిషిద్ధమని చెబుతున్నా వినకుండా వేధిస్తున్నాడు ఈ విప్రుడు" అని చెప్పారు భటులు.

"విప్రోత్తమా, మీరెవరు? మీరు వచ్చిన కారణము?" అని అడిగాడు సుశర్మ.

"ప్రభు, నేను మీ రాజ్యం వాడినే. బాటసారినై నగరానికి వచ్చాను. పనులను ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యేంతలో సంధ్య వాలిపోయింది. నేటికి ఇక్కడ విశ్రమించవచ్చని పాపడితో వస్తే మీ భృత్యులు ఇలా నిలువరించారు" అని చెప్పాడు విప్రుడు.

"బ్రాహ్మణోత్తమా, మీకు అభ్యంతరం లేకపోతే నా ఇంట అతిధి గృహాలున్నవి. దయ చేయండి. నేటికి మా ఇంట అతిధ్యం గ్రహించండి" అని ఆహ్వానించాడు సుశర్మ.

" ప్రభూ, బడుగు బాపడను. ఆ విలాసవంతమైన భవనల్లో విడిది మాకు ముళ్ళపై నడక వంటిది. మీరు అనుమతినిస్తే ఈ వనమందే విశ్రమిస్తాం" అని చెప్పాడు బ్రాహ్మణుడు.

"అభ్యంతరమేమున్నది అటులే కానిండు. ఆ కనిపిస్తున్న మల్లెపందిరి క్రింద అనుకూలురై విశ్రమించండి" అని చెప్పి కూతురితో సహా అక్కడి నుండి వెళ్ళిపోయాడు. భటులను పిలిచి బ్రాహ్మణునికి, అతని కుమారునికి భోజన సదుపాయం చూడమని చెప్పాడు సుశర్మ.

మహారాజు పంపిన విందు భోజనం ఆరగించి, సంతుష్టులై ఆ బ్రాహ్మణులిద్దరూ అక్కడే మత్తుగా నిద్రలోకి జారుకున్నారు. నడిరాతిరిలో బ్రాహ్మణ కుమారుడు పెద్దకేకతో లేచి కూర్చున్నాడు. అతని అరుపులకి బ్రాహ్మణుడు కూడా లేచాడు. ఆ బ్రాహ్మణ బాలుడు వికృతమైన శబ్ధాలు చేస్తూ, వింతగా ప్రవర్తించసాగాడు. అతడిని నిలువరించటం బ్రాహ్మణుడి వల్ల కావటంలేదు. తోటలో కాపలా కాస్తున్న భటులు ఆ సందడికి అక్కడికి చేరుకున్నారు. వారు కూడా ఆ బాలుడిని ఆపేందుకు ప్రయత్నించారు. ఆ బాలుడు బలమైన నలుగురు భటుల్ని విసిరికొట్టాడు. ఒక్కోడు ఆమడ దూరంలో పడ్డారు. కొందరు భటులు అతడ్ని తాళ్ళతో కట్టేందుకు ప్రయత్నిస్తే గడ్డిపరకల్ని తెంపినట్టు తెంపి పారేసాడు ఆ యువకుడు.

భటులంతా పెద్దగా కేకలు పెడుతూ "బ్రహ్మరాక్షసి బాబోయ్ బ్రహ్మరాక్షసి" అంటూ అరుస్తూ కోటలోకి పరుగులు పెట్టారు. వారి అరుపులు విని మహారాజు బయటకు వచ్చాడు. జరిగిన వృత్తాంతం తెలుసుకుని, రాజవైద్యులకు, భూతవైద్యులకు కబురుపెట్టాడు. భూతవైద్యుడు వచ్చి మంత్రం వేసి, బూడిద చల్లి ఆ బాలుడిని శాంత పరిచాడు. స్థిమితపడిన ఆ బాలుడి పిలక పట్టుకుని "ఎవరు నువ్వు? ఈ పిల్లాడ్ని వదుల్తావా? లేదా?" అని గద్దించాడు భూతవైద్యుడు.

"పిచ్చివాడా, నీ విద్యలు దెయ్యాలను భయపెడతాయేమో, నేను బ్రహ్మరాక్షసిని. నన్ను నువ్వు ఏం చెయ్యలేవు" అని గట్టిగా నవ్వుతూ చెప్పాడు బాలుడు.

"ఈ పిల్లవాడిని వదిలి వెళ్ళిపోవటానికి ఏం చెయ్యాలో చెప్పు" అని అడిగాడు భూతవైద్యుడు.

"అల్లారా దారికి. ఊరి చివర చిట్టడివిలో నా సవితి రాక్షసి కాపురమున్న గుహలో చెట్టుకు కాసిన మామిడిపండు కావాలి. అది ఏడాదికి ఒకే కాయ కాస్తుంది. ఆ కాయ తెచ్చిస్తే వీడిని వదులుతాను" అని చెప్పింది బ్రహ్మరాక్షసి.

"ఆ భటులు ఆపినప్పుడే పోవాల్సింది. ఎందుకు ఈ తోటలోకి వచ్చి పడ్డామో. రాజు కోసం వచ్చిందో, రాణి కోసమొచ్చిందో ఈ రాక్షసి నా పిల్లాడ్ని పట్టుకుంది. ఇప్పుడు నేనేమి చెయ్యగలను?" అంటూ బ్రాహ్మణుడు పెద్దగా ఏడవసాగాడు.

మంత్రిగారు అక్కడికి చేరుకుని కొంతమంది సైనికులని అడవిలోనికి పంపుతానని మహారాజుతో చెప్పాడు. మహారాజు విచారవదనంతో "మంత్రి, ఇది నా వైఫల్యం. నా ఇంట ఒక అతిథికి, బాటసారికి అందునా ఒక బ్రాహ్మణునికి రక్షణ లేకున్న నేనెట్టి ప్రభువును? ప్రయాణానికి ఏర్పాటు చెయ్యండి. నేనే స్వయంగా అడవికి వెళతాను" అని చెప్పాడు.

ప్రయాణినికి మహారాజు సిద్ధమయ్యి గుర్రాన్ని అధిరోహించాడు. అప్పుడు బ్రహ్మరాక్షసి ఒక ఎండిన ఆకుని తీసి ఉఫ్ఫుమని ఊదింది. ఆ ఆకు ఎగురుతూ పోసాగింది. బ్రహ్మరాక్షసి "మహారాజా, ఆ ఆకు వెంటే పో. అదే నీకు దారి చూపుతుంది" అని చెప్పింది. మహారాజు తన గుర్రాన్ని వేగంగా దౌడుతీయించాడు.

ఆ ఆకు పట్టణం దాటి, పల్లెలు దాటి, వాగులువంకలు దాటి అడవిలోకి ఎగురుతూ సాగింది. మహారాజు అ ఆకునే అనుసరిస్తూ ముందుకు సాగాడు. ఆ ఆకు వెళ్ళి వెళ్ళి ఒక గుహముందు క్రిందపడింది. మహారాజు ఆ గుహదగ్గరకు చేరుకుని తన గుర్రాన్ని బయట ఉంచి, గుహలోకి అడుగుపెట్టాడు. చిమ్మచీకటిగా ఉన్న ఆ గుహలోకి జాగ్రత్తగా ఒక్కో అడుగు వేస్తూ వెళ్ళాడు మహారాజు. గుహ మధ్యకు చేరుకునేసరికి వెలుతురు కనిపించింది. ఆ గుహకు పైకప్పు లేకపోవటంతో సూర్యకాంతి లోపల పడుతుంది.

మహారాజు చుట్టూ గమనించాడు. అక్కడ మనుష్యులు కాని దెయ్యాలు కానీ ఉన్నట్టు కనిపించలేదు. ఒక మూల అతనికి మామిడిచెట్టు కనిపించింది. మహారాజు అక్కడెవరూ లేరని నిర్ధారించుకుని మామిడిచెట్టుని సమీపించాడు. మామిడిచెట్టుకి దగ్గరగా రాగానే, చెట్టు చుట్టూ గిరి గీసినట్టు మంటలు ఎగసిపడ్డాయి. మహారాజు వెనక్కి తగ్గాడు. ఒరలో నుండి కత్తిని తీసి సిద్ధంగా పట్టుకున్నాడు.

అప్పుడు అతనికి చెట్టుపై నుండి బ్రహ్మరాక్షసి మాటలు వినిపించాయి "ఎవడ్రా నువ్వు? నా గుహలోకి వచ్చి అమూల్యమైన మామిడిపండు తీసుకుపోవాలని చూస్తున్నావ్?" అని అడిగింది. మహారాజు ఆవేశపడకుండా జరిగిన విషయమంతా చెప్పాడు.

అంతా విన్న ఆ బ్రహ్మరాక్షసి "ఓహో ఇది నా సవితి రాక్షసి పనా? దానికి చేత కాక నిన్ను పంపిందా?" అని బిగ్గరగా వికటాట్టహాసం చేసింది.

"ఓ రాక్షసి, పూర్వజన్మలో ఏ పాపాలు చేయటం వలనో నీకు ఈ రాక్షసజన్మ కలిగింది. ఒక బాలుని ప్రాణరక్షణ కోసం వచ్చాను నేను. నన్ను అడ్డుకుని మరింత పాపం మూటగట్టుకోకు" అని హెచ్చరించాడు మహారాజు.

"రాజా, ధర్మపన్నాలు మాని నేను చెప్పేది శ్రద్ధగా విను. ఈ చెట్టుకి ఏడాది ఒకే ఒక్క పండు కాస్తుంది. అది ఆరునెలలకు ఎండి నేలరాలిపోతుంది. ఈ పండుతిన్నవానికి పునర్జన్మలుండవు. జననమరణ చక్రం నుండి బయటపడతాడు. ఈ ఫలాన్ని ఇంతవరకూ ఎవరూ పొందలేదు. వందల ఏళ్ళగా పళ్ళన్నీ ఎండి నేల రాలిపోతున్నాయి. ఇలాంటి అపురూపమైన ఫలం నీకు కావాలంటే, ఇక్కడకు నూరు క్రోసుల దూరంలో పాతాళబావి ఒకటుంది. ఆ బావిలో పూచిన కమలాన్ని తెచ్చి నాకివ్వు" అని చెప్పింది.

ఆ చెట్టు మీద నుండి కొన్ని మిణుగురులు మిలమిలా మెరుస్తూ కదిలాయి. బ్రహ్మరాక్షసి ఆ మిణుగురుల వెలుగును అనుసరిస్తూ వెళ్ళమని మహారాజుతో చెప్పింది. మహారాజు పరుగున తన గుర్రాన్ని చేరుకుని ఆ మిణుగురులను అనుసరిస్తూ ముందుకు కదిలాడు. ఆ మిణుగురులు అడవిలోని సరస్సులనూ, కొండలను, గుట్టలను దాటి ముందుకు సాగి ఒక బావి దగ్గర మాయమయ్యాయి.

మహారాజు గుర్రాన్ని దిగి ఆ బావిలోకి చూసాడు. ఏంతో లోతుండి విశాలమైన ఆ బావిలో క్రిందకు చేరుకునేందుకు సోపానపంక్తి ఉంది. మహారాజు మెల్లగా అడుగులు వేస్తూ బావిలోకి దిగి అక్కడ పూచిన కమలాన్ని అందుకోబోయాడు. వెంటనే బావిలో నీళ్ళు ఎగసిపడుతూ, సుడిగుండాలు ఏర్పడ్డాయి. మహారాజు వెనక్కి తగ్గాడు.

"ఎవడవురా నువ్వు? నరమానవుడన్నవాడు సమీపించని నా బావి దగ్గరకు వచ్చి ఈ అమూల్యమైన పుష్పాన్ని చేజిక్కించుకోవాలని ప్రయత్నిస్తున్నావు?" అని ఒక రాక్షసస్వరం వినిపించింది. మహారాజు కలవరం చెందక జరిగిన వృత్తాంతమంతా వివరించి చెప్పాడు.

"అయితే ఇదంతా నా ఇద్దరి పెళ్ళాల పనన్నమాట. వారి దుష్టబుద్ధి భరించలేక వదిలేసి వస్తే, వారిని చేరనివ్వనని నిన్ను ఇలా పంపారా?" అని గర్జించాడు.

"దుష్టబుద్ధిలేని వాడివని నువ్వే అన్నావుగా. ఒక పసివాడి ప్రాణాల కోసం వచ్చిన నాకు సహకరించు" అని మహారాజు అడిగాడు.

"రాజా అలాగే సహాయం చేస్తాను. ఈ బావిలో విరిసిన కమలం ఎంత విలువైనదో నీకు తెలుసా. ఈ కమలం సాక్షాత్తు మహాలక్ష్మి వరం. ఈ పుష్పాన్ని పూజలో సమర్పించిన ప్రాణి మహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రుడై అనంతంగా వైకుఠంలోనే కొలువై ఉంటాడు. అటువంటి ఈ పుష్పాన్ని నీకు ఇవ్వాలంటే నాకు నువ్వొక పనిచేసి పెట్టాలి. ఈ బావి నుండి ఉత్తరానికి యోజనం దూరంలో ఉన్న కొండపైన ఉన్న అమృతవల్లి అనే మొక్కను తెచ్చి నాకు ఇవ్వు" అని చెప్పాడు.

ఆ బావి నీటిలో నుండి ఒక జలపక్షిలేచి ఎగరసాగింది. రాక్షసుడు చెప్పినట్టు మహారాజు ఆ పక్షిని అనుసరిస్తూ వెళ్ళాడు. అలా వెళ్ళి వెళ్ళి కొండను చేరుకున్నాడు. కొండ నిలువుగా ఉండటం వలన గుర్రంతో ప్రయాణం సాధ్యం కాదని గ్రహించిన రాజు గుర్రాన్ని అక్కడే వదిలి

కొండను ఎక్కనారంభించాడు. ఎంతో ప్రయాసతో పైకి చేరుకున్నాడు. అక్కడ వరకూ దారి చూపిన జలపక్షిఅక్కడ నీరుగా కరిగిపోయింది. ఆ కొండపైన బంగారు రంగుతో మెరిసిపోతున్న మొక్కను చూసి అదే అమృతవల్లి అని గ్రహించిన మహారాజు ఆ మొక్కను సమీపించాడు.

మహారాజు సమీపించగానే ఆ మొక్క అదృశ్యమయిపోయింది. వెంటనే ఒక బ్రహ్మరాక్షసుని భయంకరమైన నవ్వు వినిపించింది. " దేవతలకే అందుకొనగ సాధ్యంకాని అమృతవల్లిని అందుకునేందుకు వచ్చిన నరుడా నీకు అయువు తీరినదిరా" అని హెచ్చరించాడు రాక్షసుడు. మహారాజు ఆ హెచ్చరికకు ఏ మాత్రమూ చలించకుండా మొత్తం వృత్తాంతం వివరించాడు.

"అయితే ఇది నా మాయదారి కొడుకు పనన్నమాట. వాడికి ఇవ్వకపొమ్మన్నానని నిన్ను పంపాడా?" అని నవ్వాడు. మహారాజు ప్రాధేయపడ్డాడు.

"రాజా, ఈ అమృతవల్లి సాదారణమైనది కాదు. ఇంద్రుని ఇంట ఉన్న పారిజాతానికి తోబుట్టువు. పారిజాతం ఉన్నవాడు దేవలోకాధిపతి అయినట్టే ఈ అమృతవల్లి కలిగినవాడు ఈ భూమండలాన్ని ఏలే చక్రవర్తి కాగలడు. వాడికి చావు లేదు. అలాంటి ఈ అమృతవల్లిని నీకు ఇస్తాను. కానీ ప్రతిఫలంగా నువ్వేమివ్వగలవు?" అని అడిగాడు రాక్షసుడు.

"నీవు కోరితే నా ప్రాణాలైనా ఇస్తాను" అన్నాడు సుశర్మ. "వయసుడిగిన నీ ప్రాణాలతో నాకేమి పని? నీ కుమార్తె ప్రాణాలు కావాలి. నేను ఆమెను పట్టి, ఆమె రక్తాన్ని పీల్చి నా యవ్వనాన్ని తిరిగి పొందుతాను. అందుకు సమ్మతమయితే చెప్పు అమృతవల్లిని నీకు ఇస్తాను." అని చెప్పాడు.

సుశర్మ నివ్వెరపోయాడు, స్థాణువై నిలుచుండిపోయాడు. అతడి పై ప్రాణాలు పైనే పోయాయి.

"మహారాజా, ప్రజల ప్రాణమా? నీ కన్న ప్రాణమా? తేల్చుకో నీకు వ్యవధి లేదు. ఆ బాలుడు మరణానికి దగ్గరవుతున్నాడు" అని హెచ్చరించాడు రాక్షసుడు.

నోటమాటైనా రాక నిలుచుండిపోయాడు సుశర్మ. తన ప్రాణాలు తీసుకోమని ఎంతగా అర్థించినా ఆ రాక్షసుడు అంగీకరించలేదు. రాకుమార్తె ప్రాణాలే కావాలని పట్టుబట్టాడు. దైవమే తనకు విధించిన పరీక్షగా భావించి, ప్రజల రక్షణే ప్రభువు ధర్మమని తన కూతురి ప్రాణాలు తీసుకొమ్మని చెప్పాడు సుశర్మ. నరుల మాటలు నీటి మూటలు తాను నమ్మజాలనని, ఆ రాక్షసుడు మహారాజును అతని వంశపెద్దలపైన, కులదైవము పైన, అతడి ముద్దుల కూతురు దమయంతి పైన ప్రమాణం చెయ్యమని అడిగాడు. గుండెను రాయి చేసుకుని ప్రమాణం చేసాడు సుశర్మ. వెంటనే అతడి ముందు అమృతవల్లి ప్రత్యక్షమయ్యింది.

"రాజా నీవు ధర్మాత్ముడివి. ప్రజల కోసం కన్నకూతురిని పణంగా పెట్టేందుకు అంగీకరించావు. నీ కథ చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఇది కేవలం నా పరీక్ష అమృతవల్లిని గ్రహించు" అని చెప్పాడు రాక్షసుడు.

అమృతవల్లిని తీసుకుని మహారాజు పాతాళబావికి చేరుకుని ఆ నీళ్ళల్లో అమృతవల్లిని విడిచి పెట్టాడు సుశర్మ. అమృతవల్లి తక్షణమే అదృశ్యమయ్యింది. ఆ బావిలోని కమలం మెల్లగా సుశర్మ చేతి దగరకే వచ్చింది. "మహారాజా, అమృతవల్లిని పొందినవాడు భూమండలాధిపతి కాగలడని తెలిసి కూడా వచ్చి దాన్ని నాకు అర్పించావు. నీవు ఉత్తముడవు. ఈ కమలాన్ని గ్రహించు" అని పలికాడు జలరాక్షసుడు.

ఆ కమలాన్ని గ్రహించి మహారాజు గుహ వద్దకు చేరుకున్నాడు. ఆ కమలాన్ని తీసుకుని వెళ్ళి మామిడిచెట్టు మొదల్లో వదిలాడు. ఆ కమలం ఎగురుతూ మామిడిచెట్టు పైకి పోయింది. "రాజా, ఈ కమలం వలన కలిగే ప్రయోజనం తెలిసి కూడా దీనిని నాకు వదిలేస్తున్నావు. స్వార్థంలేని నీ మంచి మనసుకి ఇదే నా కానుక" అని పలికింది బ్రహ్మరాక్షసి. మామిడిపండు వచ్చి సుశర్మ చేతిలో పడింది.

సుశర్మ ఆ మామిడిపండుని తీసుకుని వెళ్ళి ఆ బ్రాహ్మణ బాలుడికి ఇచ్చాడు. ఆ బాలుడిని పట్టిన బ్రహ్మరాక్షసి వెంటనే విడిచి వెళ్ళిపోయింది. ఆ సమయంలో ఆకాశవాణి వినిపించింది. " మహారాజా, ఆ మామిడిపండు నీకు మోక్షాన్నివ్వగలదని తెలిసి కూడా దాన్ని పొందాలని ఆలోచించక, పరుల ప్రాణాల కోసం వెచ్చించావు నీవు త్యాగశీలివి. ఇది నీకు పెట్టబడిన ధర్మపరీక్ష. ఇందులో నీవు నెగ్గావు. నీ త్యాగనిరతి, ధర్మపరిపాలన చిరస్థాయిగా నిలిచిపోతాయి" అని పలికింది ఆకాశవాణి. పైలోకాల నుండి దేవతలు సుశర్మపై పూలవాన కురిపించారు.

కథ చెప్పటం ముగించిన గోపన్న విక్రముడితో "నీవు కూడా అంత గొప్ప చక్రవర్తివి కావాలి" అని ఆశీర్వదించాడు. కథ వింటూ శ్రమ తెలియకుండా అందరూ ఊరిలోనికి చేరుకున్నారు.

సూరమ్మ చేసిన వంటకాలన్ని బాగా తిని పుట్ట తేనె ఏదిరా అని అడుగుతున్న ఎంకన్నలోని దెయ్యం, అప్పుడే అక్కడకు వచ్చిన గోపయువకుల చేతి నుండి తేనెపట్టుని లాక్కొని పిండుకుంటూ తేనే తాగానారంభించింది. మల్లన్న పంపిన కబురందుకుని రామశాస్త్రి అక్కడకు వచ్చాడు. అతడిని చూస్తూనే ఆ దెయ్యం తాగుతున్న తేనెను నేల పై పడేసి వచ్చి రామశాస్త్రి కాళ్ళపై పడింది. పెద్దగా ఏడవసాగింది.

"అలివేలు బ్రతికుండగా పేరాశతో సుఖం,శాంతి లేకుండా గడిపావు. చనిపోయి కూడా అదే అశాంతిలో కాలిపోతున్నావు. నా శక్తితో నీలోని అశాంతిని తొలగిస్తాను. ఈ దెయ్యం రూపం వదిలి పరలోకానికి వెళ్ళు" అని చెప్పి రామశాస్త్రి మంత్రించిన జలం ఎంకన్న పైన చల్లాడు. ఆవేశం తగ్గిన ఎంకన్న రామశాస్త్రి పాదాలకు మొక్కి, దూరంగా కదిలాడు. ఒక్కసారిగా దెయ్యం ఎంకన్నను వదిలి వెళ్ళిపోయింది. అందరూ రామశాస్త్రికి కృతజ్ఞతలు చెప్పుకున్నారు. ఎవరింటికి వారు కదిలి వెళ్ళటంతో ఊరు సద్దుమణిగింది.

ఆ రోజు గోతీర్థంలో ఉదయాన్నే గొడవ మొదలయ్యింది. గోవులను తోలుకుని అడవికి పోవాల్సిన మగవాళ్ళు, ఇంటిలో వంట చేయాల్సిన ఆడవాళ్ళు అందరూ వాళ్ళ పనులు మాని అందరూ గోపన్న ఇంటి ముందు చేరారు. రాకుమారులంతా వచ్చి అక్కడే వేసిన నులకమంచాల పైన కూర్చున్నారు. గోపన్న పూజలో ఉన్నాడు. అందరూ గోపన్న కోసం ఎదురుచూస్తున్నారు. అందరూ గొడవ గురించి మాట్లాడుకుంటూ, గోపన్న చెప్పబోయే తీర్పు కోసం ఎదురు చూస్తున్నారు. జనాల మధ్యలో ఎర్రన్న, మల్లన్న ఒకరినొకరు చంపేసుకునేలా కోపంగా చూస్తున్నారు. పూజ ముగించుకుని గోపన్న బయటకు వచ్చి అందరిని చూసి విషయం ఏంటని అడిగాడు.

"నేను చెబుతాను తాత, ఏడాది క్రితం ఈ మల్లన్న ఇంట రెండు ఆవులు ఈనాయి. అందులో ఒక దూడని ధర చేసి నేను కొన్నాను. ఏడాదిపాటు ఆ దూడని తల్లితోనే ఉంచి సాకమని పైకం కూడా ఇచ్చాను. ఈ రోజు వాడి ఇంటిలో ఒక దూడ చచ్చిపోయింది. ఆ చనిపోయింది నేను కొనుక్కున్న దూడ కాదు. కానీ ఈ మల్లన్న నా దూడే చనిపోయిందని చెప్పి మోసం చెయ్యాలని చూస్తున్నాడు" అని చెప్పాడు ఎర్రన్న.

మల్లన్న లబోదిబో మని గుండెలు బాదేసుకుని "సత్తె పెమాణకంగా చెబుతున్నా చనిపోయింది ఈ ఎర్రన్న కొన్న దూడే గోపన్నతాతా" అని ఏడుపు అందుకున్నాడు. ఇద్దరూ ప్రమాణల మీద ప్రమాణాలు చేస్తున్నారు. ఏడుపులు పెడబొబ్బలు పెడుతున్నారు. ఎవరు నిజం చెబుతున్నారో ఎవరు అబద్దం చెబుతున్నారో అక్కడున్న ఎవరికీ తెలియటం లేదు.

గోపన్న అందరినీ ఆ రోజుకి వెళ్ళి మరనాడు వస్తే తీర్పు చెబుతానన్నాడు. చనిపోయిన దూడను ఆ ఒక్క రోజుకి ఊరు మధ్యలో ఉండే మఱ్ఱిచెట్టు నీడలో గడ్డిని పరిచి, ఆ గడ్డిపైన ఉంచమని చెప్పాడు. ఎర్రన్న అలాగే చేసి వెళ్ళిపోయాడు. ఊరిలో జనాలంతా చెవులు కొరుక్కుంటూ ఎవరి ఇంటికి వాళ్ళు వెళ్ళిపోయారు. యువకులంతా గోవులను తోలుకుని అడవిలోకి వెళ్ళిపోయారు. సంధ్య వాలుతున్న సమయంలో ఊరంతా వింత చూస్తూ మఱ్ఱిచెట్టు క్రింద చేరారు. చనిపోయిన దూడని వెతుక్కుంటూ ఒక ఆవు వచ్చి దాని పక్కనే కూర్చుని కన్నీళ్ళు పెట్టుకుంది. ఊరంతా ఆ దృశ్యం చూసి కంటతడి పెట్టుకున్నారు.

అప్పుడే అడవి నుండి తిరిగొచ్చిన గోపన్న ఎర్రన్నని, మల్లన్నని అక్కడకు పిలిపించాడు. గోపన్న గద్దిస్తూ "ఏం మల్లన్న అమ్మింది ఈ ఆవు దూడని కాదని చెప్పావు. మరి ఈ గోమాత ఎందుకు బిడ్డను పోగొట్టుకున్నట్టు కన్నీళ్ళు పెట్టుకుంటుంది?" అని అడిగాడు. చేసిన తప్పుకు మల్లన్న లెంపలు వేసుకుని ఎర్రన్నకి క్షమాపణ చెప్పుకున్నాడు. జరిగిన అల్లరికి గానూ పరిహారంగా కొంత సొమ్ము కూడా కట్టాడు.

ఆ రోజు రాత్రి భోజనాలయ్యాక ఊరిలో అందరినీ గోపన్న పిలిచాడు. అందరూ వచ్చి ఇంటి ముందు కూర్చున్నారు. "ఎంతటి సత్తెమూర్తికైనా ఏదో ఒకనాడు దొంగబుద్ధి పుడుతుంది. కానీ ఆ దొంగబుద్దికి లొంగిపోతే ఎం జరుగుతుందో చెప్పే మహామంత్రి మాధవశర్మ కథ మీకు చెబుతాను వినండి" అని చెప్పనారంభించాడు.

***గోపన్న చెప్పిన మహామంత్రి మాధవశర్మ కథ:***

పూర్వం భేరుండపురమనే రాజ్యాన్ని ఆదిత్యవర్ధనుడు పరిపాలించేవాడు. అతడు గొప్ప పరాక్రమశాలి. సింహాసనం ఎక్కిననాటి నుండి అనేక యుద్ధాలు జయించి రాజ్యాన్ని విస్తరించాడు. అతని వద్ద మాధవశర్మ మహామంత్రిగా ఉన్నాడు. ఎన్నో తరాలుగా మాధవశర్మ కుటుంబం రాజవంశాన్ని సేవిస్తూ తమ ప్రభుభక్తిని చాటుకుంటూ ఉంది. మాధవశర్మ గొప్ప తెలివైనవాడు, శాస్త్రవిజ్ఞానం కలిగినవాడు, అన్నింటికంటే మిన్నగా రాజతంత్రం తెలిసినవాడు. అతడి బుద్ధికుశలత భేరుండపురానికి పెట్టనికోటగా కాపుకాస్తూ ఉంది.

మహారాజు కూడా మాధవశర్మను కేవలం ఒక సేవకుడిగా, మంత్రిగా కాక సొంత సోదరునివలే ఆదరించేవాడు. మాధవునికి చెప్పిగాని ఏ నిర్ణయమూ తీసుకునేవాడు కాదు. అతడు వెంట నడవనిదే ఏ కార్యాన్ని చేసేవాడు కాదు. వారి మధ్య అనుబంధం ఆ రాజ్య ప్రజలందరికీ విదితమే. ఎంతటి గొప్ప కీర్తి ప్రతిష్టలున్నా వారిద్దరికీ ఒక కలత అలానే ఉండిపోయింది. ఇద్దరికీ సంతానం కలగలేదు. ఎన్నో పూజలు చేసారు, యాత్రలు చేసారు. ఎందరెందరో దేవుళ్ళను, తపస్వులను సేవించారు. ఎంత చేసినా ఫలితం దక్కలేదు.

ఒకరోజు ఆ రాజ్యానికి హిమాలయాల నుండి ఒక యోగిపుంగవుడు వచ్చాడు. మహారాజు అతడిని సాదరంగా ఆహ్వానించి, సపర్యలు జరిపాడు. మహారాజు వినయవిధేయతలకు మురిసిపోయిన ఆ యోగి "మహారాజా, నీ సేవతో నన్ను సంతృప్తి పరిచావు. నీ మదిలో ఉన్న చింత నాకు తెలుసు. పుత్రకామేష్టి యాగం జరిపించు నీకు పరాక్రమవంతుడు, వంశతిలకం వంటి సుపుత్రుడు ఉదయిస్తాడు" అని చెప్పాడు. "యాగం

ముగిసిననాటి రాత్రి యాగాశ్వాన్ని బలిచ్చి, యాగశాలలో మహారాణిని నిదురించమని చెప్పు. నీకు సుపుత్రుడు ఉదయించే వరకూ ఆమె పర్ణశాలలోనే నివసించాలి" అని బోధించి ఆ యోగి తిరిగి హిమాలయాలకు వెళ్ళిపోయాడు.

మహారాజు పుత్రకామేష్ఠి జరిపించేందుకు ఏర్పాట్లుగావించాడు. మహామంత్రి మాధవశర్మను కూడా తనతో పాటుగా యాగం చేయమని పట్టుబట్టాడు మహారాజు. అనుకున్నట్టే యాగానికి నేల ఈనినట్లుగా దేశదేశాల్లోని బ్రాహ్మణులు, ఋత్విక్కులు, వేదపండితులు తరలివచ్చారు. యాగానంతరం దానధర్మల కోసం లక్షగోవులను సిద్దంచేసారు. బంగారు ఆభరణాలు, ముత్యాలు రత్నాలు మానికలతో కొలిచి రాశులుపోసారు. భూమండలంలో ఈకాలంలో ఇలాంటి గొప్పకార్యం జరిపిస్తున్న రాజు ఆదిత్యుడు మాత్రమే అని ప్రజలంతా చెప్పుకున్నారు. అందరి ఆశీస్సులతో భక్తిశ్రద్ధలతో యాగం అనుకూలంగా ముగిసింది.

యాగాశ్వాన్ని బలిచ్చి ఒక పర్ణశాలలో పరుండబెట్టారు. మహారాణి ఆనాటి నుండి ఆ పర్ణశాలలోనే ఉండాలని యోగి చెప్పాడు. అందుకు తగిన ఏర్పట్లన్నీ చేసారు. మహారాజ దంపతులతో పాటుగా మంత్రి దంపతులు కూడా యాగంలో పాలుపంచుకున్నారు. అందుకే మంత్రిగారి భార్యను కూడా మహారాణితో సహా ఆ పర్ణశాలలో ఉంచేందుకు అన్ని వసతులు కల్పించారు. వారిద్దరికీ సపర్యలు చేసేందుకు ఆంతరంగికులైన అంతఃపురకాంతలను అక్కడే ఉంచారు. రక్షణ ఏర్పాట్లు చేసారు. రాజ్యంలోని ప్రజలెవరూ అటువెల్లకూడదని ఆంక్షలు విధించారు.

మహారాణి, మంత్రిగారి భార్య ఇద్దరూ ఎంతో నిష్ఠతో తమ ఆశ్రమవాసం కొనసాగించారు. ప్రతినిత్యం పురోహితులు, పండితులు వచ్చి వారికి రామాయణ భారత భాగవతాలను వినిపించి వెళ్ళేవారు. ఆ పురాణ కాలక్షేపాలతో స్త్రీ జనమంతా ఎంతో నిర్మలంగా భక్తి శ్రద్ధలతో మెలిగేవారు. మహారాజు,మహామంత్రి వచ్చి వెళుతుండేవారు. కొంతకాలానికి వారి పూజలు ఫలించి ఇద్దరూ గర్భాన్ని ధరించారు. నెలలు నిండే సమయానికి మహారాజు అత్యవసర రాచకార్యంపై పొరుగు రాజ్యానికి వెళ్ళాల్సి వచ్చింది. ఎప్పుడూ తన వెంటే తీసుకుని వెళ్ళే మాధవశర్మను ఆశ్రమం దగ్గరే ఉండమని చెప్పి మహారాజు తన సేవకులతో సహా ప్రయాణమయ్యాడు.

ఆ నాటి రాత్రి మహారాణి, మంత్రిగారి భార్య పండంటి మగపిల్లల్ని కన్నారు. మాధవుడు అక్కడే ఉన్న సేవకులతో మహారాజుగారికి వర్తమానం పంపాడు. బిడ్డను చూసుకునేందుకు పర్ణశాలలోకి మాధవుడు వెళ్ళేసరికి మహారాణి ఇంకా మైకంలోనే ఉంది. చుట్టూ సేవకులెవరూ లేరు. అలాంటి క్షణాల్లో మాధవుడికి ఒక దుర్బుద్ధి పుట్టింది. తన భార్యకు పుట్టిన బిడ్డను తీసుకుని వెళ్ళి మహారాణి పక్కనే పరుండబెట్టి, మహారాణికి పుట్టిన బిడ్డను తెచ్చి తన భార్య పక్కలో పరుండబెట్టాడు. అంతా గమనించిన మంత్రి భార్య భర్తను "బిడ్డలను ఎందుకు మార్చారని?" నిలదీసింది. "నీకు పుట్టిన కొడుకుకి మహారాజయోగం కల్పించాను. ఆనందపడక బాధపడతావేం?" అని కసురుకున్నాడు మాధవుడు. ఆమెలోని తల్లిప్రేమ బిడ్డను వదలలేక దుఃఖిస్తున్నా, మాధవుడిని కాదనలేక ఆమె మౌనం వహించింది.

ఆదిత్యుడు తన పర్యటన ముగించుకుని ఎంతో సంతోషంతో రాజ్యానికి తిరిగి వచ్చాడు. మేలతాళాలతో అట్టహాసంగా మహారాణిని రాజభవంతికి తీసుకుని వెళ్ళారు. బిడ్డ వెళ్ళిపోవటం చూసి మంత్రిభార్య కన్నీళ్ళు పెట్టుకుంది. ఆవిధంగా మహామంత్రికి పుట్టినబిడ్డ సురేంద్రుడనే పేరుతో యువరాజుగా ఎదిగాడు. మహారాజుకి పుట్టినబిడ్డ విక్రమసింహుడనే పేరుతో మహామంత్రి ఇంటిలో పెరిగాడు. సురేంద్రుడు చిన్ననాటి నుండే తన దూకుడుతో అందరిని చికాకు పరిచేవాడు. మహామంత్రి కుమారుడు విక్రముడిని దరిచేరనిచ్చేవాడు కాదు. అతడికి సేవకులన్నా,

రాజ్యపాలనన్నా మిక్కిలి నిర్లక్ష్యం. వేట యందు, యుద్ధములందు అమిత ఆసక్తి. దూకుడుగా పొరుగు రాజ్యాలపై దండెత్తివచ్చేవాడు. ఎప్పుడు ఏ రాజ్యంపైన పడతాడో అని పొరుగురాజ్యాల రాజులు భయపడేవారు.

విక్రముడు బుద్ధికుశలత కలవాడు. మాధవుడు చిన్ననాటి నుండి విక్రముడిని చేరదీసేవాడు కాదు. అతడినొక కుమారుడిలా ఎప్పుడూ సాకలేదు. తండ్రి తనపై చూపించే నిర్లక్ష్యధోరణి అతడిని ఆశ్చర్యపరిచేది. అదే అతడిని ఆలోచనాపరుడిని చేసింది. మంత్రిభార్య మాత్రం విక్రముడిని కన్నబిడ్డలానే పెంచింది. తండ్రికి తెలియకుండా అతడికి ఎన్నో విద్యలు నేర్పించింది. యువకుడైన పిమ్మట విక్రముడు తండ్రి వలే తాను కూడా రాజవంశానికి సేవచేస్తానని తన తల్లిని అడిగాడు. ఆమె అతడి కోరికను మాధవుడికి చెప్పి చూసింది. ఏనాడైన తనలానే కుటిలబుద్ధితో విక్రముడు రాజద్రోహం తలపెడితే తనబిడ్డ ప్రాణానికే ప్రమాదం అని భావించిన మాధవుడు అతడి కోరికను మన్నించలేదు.

మాధవుని ఆలోచనలని గ్రహించిన అతడి భార్య, విక్రముని ప్రాణాలకు కూడా ప్రమాదం ఉందని భావించింది. ఒకనాడు విక్రముడిని పిలిచి "నాయనా, నీవంటి వీరకుమారులు గొప్ప రాజ్యాల్ని పరిపాలించాలి తప్ప తండ్రిగారి వలే కేవలం సేవకుడిగా మిగిలిపోరాదు. దేశాటనకు వెళ్ళు నీకు తగిన మార్గం దొరుకుతుంది. ఇదే నీ తల్లి కోరిక" అని చెప్పింది. విక్రముడు తల్లికి నమస్కరించి ఒంటరిగా దేశాటనకు పయనమయ్యాడు.

ఎన్నో దేశాలు, వనాలు, అడవులు, వింతలువిశేషాలు చూస్తూ విక్రముడు కార్తికేయపురమనే రాజ్యానికి చేరుకున్నాడు. ఆ రాత్రి గడిపేందుకు ఒక పూటకూళ్ళ పెద్దమ్మ ఇంటిలో బస చేసాడు. రాత్రి భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటున్న విక్రమునికి అక్కడే నిద్రిస్తున్న మరికొందరి మాటలు వినిపించాయి. ఆ రాజ్యంలో యువరాణికి వింతవ్యాధి సోకిందని, ఆమె ఎంతోకాలం బ్రతకదని చెప్పుకుంటున్నారు. మరునాడు లేచి తన దారంట తాను వెళ్ళబోతున్న విక్రమునికి ఒక దండోరా వినిపించింది. యువరాణి జబ్బు నయమయ్యేందుకు అవసరమైన మందు తయారుచేసేందుకు అవసరమైన నాగులకోనలో విషసర్పాల కాలకూట విషం తీసుకుని వచ్చిన వారికి ప్రభువులు అర్ధరాజ్యమిచ్చి గౌరవిస్తారహో అని ప్రకటించారు.

విక్రముడు ఆ విషాన్ని తెచ్చేందుకు సిద్దమని కార్తికేయపుర మహారాజుతో చెప్పాడు. ఆ రాజు "కుమారా, రాజ్యం మీద కోరికతో ఎందరో యువకులు ఆ నాగులకోనకు వెళ్ళి తమ ప్రాణాలు కోల్పోయారు. ఈ సాహసానికి పూనుకునేముందు నీకు హెచ్చరించటం నా ధర్మం" అని చెప్పాడు. "మహారాజా, మీ కుమార్తె ప్రాణాలు కాపాడుకోవాలనే స్వార్థాన్ని విడిచి నా శ్రేయస్సును కాంక్షిస్తున్న మీవంటి ఉత్తముల దుఃఖాన్ని తీర్చలేకపోయినచో ఇంక నేను నేర్చుకున్న విద్యలకు ఏమి సార్థకత. మీ ఆశీస్సులు నాతోనే ఉంటే తప్పక సాధించుకు వస్తాను" అని చెప్పి విక్రముడు నాగులకోనగా పిలవబడే భయంకరమైన అడవిలోకి ప్రవేశించాడు.

క్రూరమృగాలు అతడిని వెంబడించాయి అతడు భయపడకుండా వాటిని అదిలించాడు. భయంకర సర్పాలు ఎదురైనప్పుడు తీసి అవతలకు గిరాటేసాడు. అలా ఒక్కో అడుగు వేసుకుంటూ మహాసర్పాలుండే చోటుకి చేరుకున్నాడు. ఆ సర్పాల విషం సేకరించుటెట్లు అని ఆలోచిస్తున్న అతనికి ఒక దివ్యపురుషుడు దర్శనమిచ్చాడు. "రాకుమారా, ఈ లోకంలో ఎవరి ప్రాణాలు శాశ్వతం కాదు. విధి లిఖితంగా నడుస్తున్న ఈ కాలచక్రంలో నిశ్చయించబడిన కర్మను దాటిపోవటం సాధ్యం కాదు. అయిన నీకొక అవకాశం ఇస్తున్నాను. యువరాణికి బదులుగా మరొక ప్రాణం బలికి సిద్దమయితే ఆమె ప్రాణలు నిలిచే అవకాశం ఉంది" అని ఆ దివ్యపురుషుడు విక్రముడికి చెప్పాడు.

విక్రముడు ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా తన ప్రాణాలను తీసుకోమని కోరాడు. విక్రముని త్యాగనిరతికి మెచ్చిన దివ్యపురుషుడు "వేరొకరిని బలి చేస్తానని చెప్పి నీకంటే ముందు వచ్చిన యువకులంతా ప్రాణాలు కోల్పోయారు. స్వార్ధంలేని నీ మంచితనమే నిన్ను కాపాడింది. విషం తీసుకునే పని లేదు. ఇదిగో ఈ నీలమణిని ఆమె నుదుటిపైన పెట్టి నేను చెప్పే మంత్రం చదువు, అమె బ్రతుకుతుంది" అని చెప్పి మణిని ఇచ్చి, మంత్రోపదేశం చేసి ఆ దివ్యపురుషుడు అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

విక్రముడు మిక్కిలి ఉత్సహంతో కార్తికేయపురానికి చేరుకుని ఆ మణి సహాయంతో రాకుమార్తెను బ్రతికించాడు. రాజు మిక్కిలి సంతోషంతో కేవలం అర్ధరాజ్యాన్నే కాక యువరాణిని విక్రమునికిచ్చి వివాహం జరిపేందుకు నిశ్చయించాడు. తన తల్లిదండ్రులకు ఈ విషయం తెలియజేయాలని విక్రముడు ఆ మహారాజుని కోరాడు. ఆ వార్తను మోసుకుని వెళ్ళిన వేగు రెండే రోజుల్లో తిరిగి వచ్చాడు. భేరుండపురంపైన దండయాత్ర జరుగుతుందని సామంతులు, పొరుగు రాజులు మూకుమ్మడిగా దండెత్తి వచ్చారనే వార్తను మోసుకువచ్చాడు.

తనతండ్రి ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందేమోనని భయపడిన విక్రముడు కార్తికేయపుర సైన్యాన్ని వెంట తీసుకుని భేరుండకు చేరుకున్నాడు. వెనుక నుండి వచ్చి మీద పడ్డ కార్తీకేయపుర సైన్యం దాడికి సామంతులు తత్తరపాటుకి లోనయ్యారు. ఒక వైపు భేరుండ సైన్యాన్ని, మరోవైపు విక్రముడు సైన్యాన్ని ఒకేసారి ఎదిరించలేక సామంతులు ఒక్కొరొక్కరిగా లొంగిపోయారు. కానీ ఎన్నోసార్లు సురేంద్రుని వలన దాడికి గురైన పొరుగు రాజ్యాల్లోని కొందరు రాజులు కుట్రపన్ని, అతడిని ఒంటరిని చేసి యుద్ధభూమిలోనే అతడిని చంపేసారు.

కుమారుడి మరణవార్తకు చలించిపోయి మహారాజు, మహారాణి వచ్చి విగతజీవుడైన కూమారుడ్ని ఒడిలోకి తీసుకుని ఏడ్వసాగారు. అదే సమయంలో పుత్రశోకంతో మహామంత్రి భార్య వచ్చి చచ్చి పడి ఉన్న సురేంద్రుడిని చూసి "నాయనా, నీ తండ్రి చేసిన పాపానికి నువ్వు బలయ్యావా?" అని దుఃఖించసాగింది. మహారాజు ఆశ్చర్యంతో మంత్రి భార్యను ప్రశ్నించాడు. ఆమె మాధవుడు చేసిన మోసాన్ని మహారాజుకి చెప్పింది. అప్పుడే విక్రముడు తన సేనలతో అక్కడకు చేరుకున్నాడు.

మహారాజు అసలు విషయాన్ని చెప్పి విక్రముడిని దగ్గరకు తీసుకున్నాడు. మహారాణి కూడా ఇన్నేళ్ళుగా దూరమైన బిడ్డ దక్కినందుకు ఎంతో సంతోషించింది. విక్రముడు మాత్రం మంత్రిభార్య పాదాలపై పడి "అమ్మా, నీ బిడ్డను కాదని తెలిసి కూడా సొంత బిడ్డకంటే మిన్నగా సాకావు. తండ్రి వల్లే నాకు ప్రాణాపాయం ఉందని గ్రహించి నన్ను రాజ్యం నుండి పంపి నాకు పునర్జన్మనిచ్చావు. నీవు ఎప్పటికీ నా తల్లివే" అని ప్రార్ధించాడు.

వారందరిని చూసి సిగ్గుతో మాధవశర్మ తలదించుకున్నాడు. ఆదిత్యుడి కాళ్ళపైనబడి తనని తగినవిధంగా శిక్షించమని కోరాడు. "నీవు చేసిన తప్పుకి దేవుడే పెద్ద శిక్షవేసాడు" అని చెప్పి ఆదిత్యుడు అతడిని విడిచి వెళ్ళిపోయాడు. మాధవుడు పశ్చాత్తాపంతో అడవులకు వెళ్ళిపోయాడు. విక్రముడు భేరుండను, కార్తికేయపురాన్ని ఒక్కటి చేసి గొప్ప చక్రవర్తిగా పరిపాలించాడు.

కథ చెప్పటం ముగించిన గోపన్న దుర్భుద్ధితో మనం చేసే తప్పులకు శిక్ష అనుభవించక తప్పదు సుమా అని అందరిని హెచ్చరించాడు.

అడవిలోన గుంట నక్క

పాచికపై దొంగ లెక్క

నడిరాతిరి మందు లక్క

అన్నిటినీ కూడేస్తాడు

లెక్కలు సరిచేస్తాడు

నల్లనోడే ఆ నల్లనోడే

నమ్మినోళ్ళకు మహా చల్లనోడే

“తూరుపు కొండపైన దీపాలు ఎలిగాయి

అడవిలోన పురుగుపుట్ర లేచి పరుగందుకున్నాయి

నల్లనయ్యా లే మేలుకో

తెల్లవారింది స్వామి లే మేలుకో

రాతిరంతా ఏ లోకాలు కాపు కాచావో

ఆదమరిచి నిదురలో ఏళమరిచావు

చల్లనయ్యా లే మేలుకో

లోకాల గతి ఆగిపోయేను తొరగా మేలుకో”

గోపన్న నదిలో నీళ్ళు వదులుతూ కన్నయ్యను ప్రార్థిస్తున్నాడు. కళ్ళు మూసుకుని పారవశ్యంలో ఉన్న గోపన్నకు మదిలో ఒక దృశ్యం గోచరమయ్యింది. మెలుకువలో ఎదురైన స్వప్నంలా తోచింది ఆ దృశ్యం. ఆ స్వప్నంలో గోపన్న సూర్య నమస్కారం కోసం నదిలో దిగి దోసిలితో నీళ్ళు తీసుకున్నాడు. నీళ్ళతో పాటుగా అతని చేతిలోకి ఒక చిన్న సువర్ణ చక్రం వచ్చింది. ఆశ్చర్యంతో గోపన్న గమనిస్తుండగానే ఆ చక్రం అతని దోసిలి నుండి గాల్లోకి ఎగిరింది. గాల్లో ఎగిరిన ఆ చక్రం చూస్తుండగానే పెద్దదయ్యి సుదర్శన చక్రంగా మారింది. గోపన్న ఆ సుదర్శన చక్రానికి మొక్కాడు. ఆ సుదర్శన చక్రం ఒక ప్రకాశవంతమైన వెలుగుగా మారి అగ్రహారంలో నిదురిస్తున్న రాకుమారుడు విక్రముడిలో ప్రవేశించింది.

భగవంతుని నిర్ణయం ఇలా ప్రకటితమైందని మనసులో గ్రహించిన గోపన్న సాలోచనగా కళ్ళు తెరిచాడు. వడివడిగా అడుగులు వేస్తూ అగ్రహారం వైపు నడిచాడు. అప్పటికే గోపన్న ఇంటి ముందు వేచి ఉన్న గుంపు గోపన్నను చూసి లేచి దండాలు పెట్టారు. వారంతా చుట్టుప్రక్కల గ్రామాల్లో ఉన్న గోపాలకులు. గోపన్న వారందరినీ ఆప్యాయంగా పలకరించి "తెల్లవారే అంతా కలిసికట్టుగా వచ్చారు ఏమిటో విశేషం" అని అడిగాడు. "గోపన్నతాతా, సుకేత ప్రభువులు రాజ్యాన్ని వదిలి వెళ్ళినాక ఏటేటా జరిగే పశువుల ప్రదర్శనలు, సంతలు నిలిచిపోయాయి కదా. ఈ యేడు వర్తకులంతా పట్టుబట్టి రాజుని ఒప్పించి పశువుల సంతకు ఏర్పాటు చేసారు. ఎప్పటిలానే నీ నాయకత్వంలో ఆ ప్రదర్శనకు వెళ్ళాలని మా యోచన" అని ఒక యువకుడు చెప్పాడు.

గోపన్న ఒక్క క్షణం ఆలోచించి వెంటనే "తప్పకుండా అంతా కలిసే వెళదాం. యువకులంతా సిద్ధంకండి. యాత్రకు ఏర్పాట్లు చెయ్యండి" అని తన అంగీకారాన్ని తెలిపాడు. గోపన్న అంగీకరించగానే యువకులంతా ఉత్సాహంగా కేరింతలు కొడుతూ "ఘనంగా ఏర్పాట్లు చేస్తాం తాతా" అంటూ సందడిగా అక్కడి నుండి పరుగుతీసారు.

గోపన్న రాకుమారుల విడిది వద్దకు వెళ్ళి విక్రముడిని కలుసుకున్నాడు. "నాయనా, సమయం వచ్చింది. ఎదరిబలం తెలుసుకునేందుకు ఒక అవకాశం కుదిరింది. పట్టణంలో జరిగే పశువుల సంతకు మనం గోవుల్ని తోలుకుని వెళ్ళి అనుపానులు పసిగట్టాలి. కుదిరితే చెరలో ఉన్న మంత్రిగారిని కలిసిరావాలి" అని చెప్పాడు. ఆ మాటలు మొదట విక్రముడిలో కాస్త ఆందోళన కలిగించినా, ఎదురుచూస్తున్న సమయం వచ్చిందనే ఆలోచన అతనిలో ఉత్సాహాన్ని నింపింది.

ప్రయాణ సమయం రానే వచ్చింది. విక్రముడు మారువేషం ధరించి గోపయువకుల్లో కలిసిపోయాడు. తన తమ్ముళ్ళకు జాగ్రత్తలు చెప్పి అగ్రహారంలోనే ఉండమని చెప్పి, గోపన్న వెంట పట్టణానికి ప్రయాణమయ్యాడు. గోపన్న కొందరు బలిష్టమైన చురుకైన యువకుల్ని అగ్రహారంలోనే రాకుమారులకు రక్షణగా ఉండమని నియమించాడు. చుట్టు ప్రక్కల గ్రామాల్లోని యువకుల జట్లు కూడా వచ్చి ప్రయాణంలో చేరాయి. అందరూ తమ గోవుల్ని అందంగా అలంకరించి తీసుకుని వచ్చారు. ఆటపాటలతో సందడిగా అలుపు తెలియకుండా ప్రయాణం సాగింది.

సంతకు వచ్చే వారి కోసం ఊరి చివర క్రీడాప్రాంగణంలో విడిది ఏర్పాట్లు చేసారు. అంగడులు వెలిసాయి. యువకులంతా ఆ వింతలు విశేషాలు గమనిస్తుండగా గోపన్న, విక్రముడిని తీసుకుని నగర పర్యటనకు వెళ్ళాడు. నగరంలో ఉన్న కావలిని, సైన్యాన్ని గమనిస్తూ వారు ముందుకు సాగారు. అలా వెళుతూ వారు కులదైవమైన వ్యాఘ్రేశ్వర స్వామి ఆలయాన్ని సమీపించారు. ఆలయంలో ఏవో ప్రత్యేకపూజలు జరుగుతున్నాయి. అంతలో పట్టపుటేనుగు అదుపుతప్పి జనాల్లోకి వచ్చింది. జనమంతా చెల్లాచెదురై పరుగులు తీసారు. సైనికులు ఆ ఏనుగును అదుపులోకి తెచ్చేందుకు దానివెంటే పరుగులు పెడుతున్నారు.

వ్యాఘ్రేశ్వర స్వామికి అలంకరించిన ఒక పువ్వులదండను మహారాజుకి ప్రసాదంగా ఇచ్చేందుకు పూజారి ఆలయం నుండి తీసుకుని వస్తున్నాడు. పట్టపుటేనుగు అతడిని సమీపించి అతని చేతిలోని దండను తొండంతో లాగేసింది. ఆ ఏనుగు పరుగు పరుగున వెళ్ళి ఆ దండను

విక్రముడి మెడలో వేసి, అతడి ముందు మోకరిల్లింది. అంత వరకూ భీభత్సం చేసిన పట్టపుటేనుగు అంత ప్రశాంతంగా మోకరిల్లటం చూసి ప్రజలంతా ఆశ్చర్యపోయారు.

ప్రజలు విక్రముడిని గుర్తించక ముందే గోపన్న అతడిని తీసుకుని ఊరిచివర క్రీడాప్రాంగణం వైపు సాగాడు. పట్టపుటేనుగు ఉందతం నుండి విక్రముడు ఇంకా తేరుకోలేదు. గోపన్న చిరునవ్వుతో విక్రముడి వెన్నుతట్టి "అంతా శుభమే" అని ధైర్యం చెప్పాడు.

మరునాడు ఘనంగా సంత మొదలయ్యింది. అందరితో పాటుగా గోపన్న, విక్రముడు సంతలో అడుగుపెట్టారు. అనేక గ్రామాల నుండి వచ్చిన గోపాలురు తమ పశువుల గొప్పతనం ప్రదర్శిస్తూ ఉన్నారు. అన్నింటినీ గమనిస్తూ ముందుకు సాగారు వారిద్దరూ. సంతలో ఒక చిన్న దొమ్మీ చోటు చేసుకుంది. గోపన్న వెంటే వచ్చిన ఇద్దరు యువకులు వేరే గ్రామ యువకులతో కొట్లాటకు దిగారు. ఆ కొట్లాట పెద్దదయ్యింది. ఆ సంత నిర్వహణకు రక్షణగా వచ్చిన సైనికులు ఆ ఇద్దరు యువకుల్ని తీసుకుని వెళ్ళి చెరలో వేసారు. సంత నియమాల ప్రకారం వారికి పక్షం రోజులు కారాగారం తప్పదు. తన పాచిక పారినందుకు గోపన్న సంతోషించాడు. విక్రముడిని తీసుకుని తిరిగి విడిదికి చేరుకున్నాడు. మంత్రిగారి ఆలోచనలేమిటో తెలుసుకునేందుకే వారిని పంపానని విక్రముడికి వివరించాడు.

ఇన్ని జరుగుతున్నా విక్రముడు దిగులుగా ఉండటం గమనించాడు గోపన్న. "నాయనా, అన్నీ మనం అనుకున్నట్లే జరుగుతున్నాయిగా. ఇంకా ఈ విచారమెందుకు?" అని అడిగాడు. "గోపన్నతాతా, నేను మా గురువుల వద్ద అన్ని యుద్ధవిద్యలు నేర్చుకున్నాను. శత్రురాజును స్వయంగా ఎదిరించి సంహరించగలను. కానీ మన తరపున యుద్ధం చేసేందుకు సైన్యమెక్కడిది? ఎలా మనం శత్రువును ఎదిరించగలం?" అని అడిగాడు విక్రముడు.

"దృఢమైన సంకల్పమే నీ ఆయుధం, అదే నీ రథం, అదే నీ బాట. నీ సంకల్పం దృఢమైనదే అయితే, నీకు అన్యాలోచన లేకుంటే, ఈ పోరు తక్క మరో దారిలేదని నీవు నమ్మితే నీ విజయానికి దారులు తెరుచుకుంటాయి. చీకటిగదిలో బంధించి కొడితే చిన్న పిల్లి సైతం బెబ్బులిలా మీద పడుతుంది. చావోరేవో అనే స్థితి అంత బలాన్నిస్తుంది" అని గోపన్న హితవు పలికాడు. విక్రముడి మనసు తేలిక పడేందుకు గోపన్న ఒక కథ చెప్పనారంభించాడు.

### *గోపన్న చెప్పిన మరుగుజ్జురాకుమారుడి కథ*

పూర్వం శాండిల్యపురాన్ని పరిపాలించే వీరవర్మకు ముగ్గురు భార్యలు మైత్రి, సునేత్రి, సుగాత్రి. వీరవర్మ పేరుకు తగినట్టుగా గొప్ప వీరుడు. అనేక రాజ్యాలు జయించాడు. శత్రుభయంకరుడిగా పేరుగాంచాడు. అతడి పరక్రమాలు విని, కని ఇంతటి వీరుడిని అల్లుడిగా పొందటం తమ గౌరవమని భావించి ఎందరో రాజులు తమ కన్యలను స్వీకరించమని కోరగా వారిలో ఈ ముువ్వురిని వరించాడు వీరవర్మ.

వీరవర్మ ముువ్వురు భార్యలనూ ఎంతో ప్రేమగా ఆదరించేవాడు. ఒకరు గొప్ప ఒకరు తక్కువనే భావం లేకుండా చూసుకునేవాడు. వారు కూడా వీరవర్మ తక్క మరో ధ్యాసలేకుండా చరించేవారు. అయిననూ వారికి ఎంతకాలమైనా సంతానం కలుగలేదు. ముువ్వురు రాణులలో సంతానం లేకపోవటం ఒక చింతగా మారింది. వారి మనసు గ్రహించిన వీరవర్మ సంతానం కోసం అనేక పూజలు, శాంతులు జరిపించాడు. అయిననూ ఏ ప్రయోజనమూ కలుగలేదు.

గౌతముడనే గొప్ప మహర్షి తీర్థయాత్రలు చేస్తూ ఒకనాడు శాండిల్యపురానికి చేరుకున్నాడు. ఆ మహర్షి ఆ పట్టణంలో అడుగుపెట్టే సమయానికి వీరవర్మ ధానధర్మాలు, సంతర్పణలు జరిపిస్తున్నాడు. గౌతముడు జరుగుతున్న క్రతువులన్నింటినీ గమనించి, మహారాజు అభీష్టాన్ని గ్రహించాడు. ఇంతటి ధాతకు, వినయశీలికి కలిగిన సంతానలేమి అనే బాధను తొలగించటం దైవకార్యం అని భావించాడు. మహరాజుని సమీపించి "రాజా, తపస్సు ద్వారా నాకు లభించిన మంత్రశక్తితో నేను నీకు సహాయం చేయదలిచాను" అని ఆశీర్వదించాడు. వీరవర్మ ఎంతో సంతోషించాడు. సపత్ని సమేతంగా గౌతముడిని సేవించి అతడి ఆశీస్సులు పొందాడు.

గౌతముడు మంత్రించిన జలాన్ని మహారాజు ఉద్యానవనంలో ఉన్న ఒక మామిడిచెట్టుపై చల్లాడు. మహారాజుని అతడి ముగ్గురు భార్యలను పిలిచాడు. "మహారాజా, నేటికి వారంరోజుల్లో ఈ చెట్టుకి మూడు కాయలు కాస్తాయి. అవి పండేంతవరకూ ఆగి ఒక్కో రాణికి ప్రసాదంగా ఇవ్వు. నీ ఈప్సితం నెరవేరుతుంది" అని ఆశీర్వదించి సెలవు తీసుకుని ముందుకు సాగిపోయాడు.

సరిగ్గా ఏడవరోజుకి మహర్షి చెప్పినట్టుగా ఆ చెట్టుకు మూడు మామిడికాయలు కాసాయి. అందరూ ఎంతో సంతోషించారు. మొదట పండిన కాయను కోసి మహారాజు సునేత్రికి ఇచ్చాడు. అమె ఒక్క రోజులోనే గర్భందాల్చింది. మరో పదిరోజులకి రెండవ కాయ పండింది. ఆ పండును మహారాజు సుగాత్రికి ఇచ్చాడు. ఆమె కూడా గర్భందాల్చింది. కానీ నెలరోజులు గడుస్తున్నా మూడవకాయ పండలేదు. విసుగుచెందిన వీరవర్మ పూర్తిగా పండని ఆ కాయను కోసి మైత్రికి ఇచ్చాడు. వీరవర్మ తొందరపాటు చర్యకు మైత్రి కలవరపడింది. పూర్తిగా పండకుండానే పండుకోసినందున ఏం చెడు జరగనుందోనని ఆమె భయపడింది. మైత్రి కూడా గర్భం దాల్చింది.

నెలలు నిండాకా ముప్పురు రాణులకూ ముగ్గురు పుత్రులు కలిగారు. వారికి జయవర్మ, విజయవర్మ, అజేయవర్మ అని నామకరణం చేసారు. కానీ కొద్దిరోజుల్లోనే వారికి అజేయుడు మరుగుజ్జువాడనే విషయం బయటపడింది. జయవర్మ, విజయవర్మ ప్రాయానికి తగినట్టుగా పెరుగుతున్నా, అజేయుడి పెరుకువ తక్కువగా ఉండేది. అజేయుడు మరుగుజ్జువాడనే విషయం అందరికీ తెలిసి అందరూ మైత్రిని ఆటపట్టించేవారు. మహారాజు కూడా అజేయుడిని తన కుమారుడిగా చెప్పుకునేందుకు ఇష్టపడేవాడు కాదు. అజేయుడిని చూసేందుకు కూడా అయిష్టత ప్రదర్శించేవాడు. మహారాజు ప్రవర్తన మైత్రికి కష్టంగా ఉండేది.

శాండిల్యపుర సామంతులంతా ఒకనాడు విజయగజపతి అనే సామంతరాజు నాయకత్వంలో ప్రభువు పై తిరుగుబాటు చేసారు. అనుకోని ఈ హటత్పరిణామాన్ని ఎదుర్కునేందుకు సన్నద్ధంగా లేని వీరవర్మ యుద్ధంలో వీరమరణం పొందాడు. జయవర్మను, విజయవర్మను శత్రువులు కారాగారంలో బంధించారు. మరుగుజ్జువాడైన అజేయవర్మను మాత్రం ఈ పొట్టివాడు ఏం చేయగలడని హేళన చేసి వదిలేసారు. ముప్పురు రాణులనూ కోట నుండి వెళ్ళగొట్టారు. కొంతమంది హితులు వెంటరాగా ముప్పురు రాణులూ, అజేయవర్మ అడవిలో ఒక రహస్య ప్రదేశంలో తలదాచుకున్నారు.

ప్రాణాధికుడైన మహారాజు మరణానికి తోడు, కుమారులు శత్రువుల చేత చిక్కారనే బాధతో సునేత్రి, సుగాత్రి ఎంతో దుఃఖించసాగారు. మైత్రి కూడా బాధతో "కుమారా, నీవు కూడా నీ అన్నల వలే సాదారణ శరీరం కలవాడవయితే, ఈ కష్టం నుండి రక్షించేవాడివి కదా" అని ఏడ్వసాగింది. దానికి అజేయుడు "తల్లీ, నేను కూడా అన్నల వలే సాదారణంగా ఉండి ఉంటే, నన్ను కూడా బంధించి ఉండేవారు కదా. ఈ

లోపమే నాకు హితమైనది కదా. అయిననూ పోరేందుకు కావాల్సినది ఆత్మబలం తప్ప దేహబలం కాదు. నేను ఎటులైన నా అన్నలను రక్షించికాని తిరిగి రానని" పలికి అజేయుడు ప్రయాణమయ్యాడు.

అజేయుడు తన తండ్రికి ఆప్తులైన కొద్దిమందిని వెంటబెట్టుకుని శాండిల్యకు సామంతరాజ్యమైన దక్షిణపురానికి చేరుకున్నాడు. అక్కడి ప్రభువైన శ్రీకరుడిని కలుసుకునేందుకు అనుమతికై కబురుపెట్టాడు. మరుగుజ్జువాడనే జాలితో, వీరవర్మ అంటే ఏకొసానో ఉన్న భక్తితో శ్రీకరుడు అజేయుడిని కలుసుకున్నాడు. అజేయుడు ఏంతో అభిమానంతో "రాజా, మీరన్న మా తండ్రిగారికి ఎంతో ప్రేమ. మీరు గొప్ప వీరులని, మీ వీరత్వం వలననే మన రాజ్యానికి దక్షిణ దిక్కునుండి ఎటువంటి దండయాత్రలు జరగటంలేదని చెప్పేవారు. వీరత్వమే కాక మీరు కళాభిమానులని, అన్ని కళలలో ప్రవేశం కలదని చెప్పేవారు" అని ప్రశంసలతో మెప్పించాడు. ఆ పొగడ్తలకు లొంగిపోయిన శ్రీకరుడికి తనపై ఇంత గొప్ప అభిప్రాయం కలిగిన మహారాజుకి ద్రోహం చేసాననే అపరాధభావన మనసులో మొలకెత్తింది. శ్రీకరుడు రహస్యంగా అజేయుడు అతని ముప్పురు తల్లులు తన రాజ్యంలో ఉండవచ్చునని, వారికి ఏ భయమూ లేదని అభయమిచ్చాడు.

శ్రీకరుని ఆయువుపట్టు గ్రహించిన అజేయుడు అతడిని మెప్పించి అతని ద్వారా మరికొంతమంది సామంతుల గుట్టు గ్రహించాడు. వారిలో తన తండ్రి వీరవర్మ అంటే అభిమానమున్న కొందరిని కలుసుకుని వారితో స్నేహం పెంచుకున్నాడు. వారందరినీ సమావేశపరిచి "రాజశ్రేష్టులారా, మీరంతా మీ శక్తియుక్తులతో ఏన్నో ఏళ్ళుగా కాపాడుతున్న రాజ్యం శాండిల్యపురం. మా తండ్రిగారిని ఎదిరించి నేడు మీరు సాధించినదేమిటి? స్వంతంత్రులయ్యారనే పేరుకే కాని ఇప్పటికీ మీరంతా ఆ గజపతి మాట కాదని ఒక్క అడుగైనా వేయగలుగుతున్నారా? మా తండ్రి వీరవర్మ వీరోచితంగా పోరి తెచ్చిన రాజ్యాన్ని, నిర్మించిన కోటను ఆ గజపతి కైవసం చేసుకున్నాడు. ఆ సంపదలన్నింటినీ ఒక్కడే అనుభవిస్తున్నాడు. మీ శక్తియుక్తుల్ని తన స్వప్రయోజనా నికి వాడుకున్నాడు. గ్రహించండి" అని పదే పదే నూరిపోసాడు.

విజయగజపతి దాష్టీకాల్ని అప్పటికే చూస్తున్న సామంతులందరికీ అజేయుడి మాటలు బాగా తలకెక్కాయి. వారంతా మిగిలిన సామంతులందరినీ తోడ్కొని వచ్చి సమావేశపరిచారు. ఎవరికి జరిగిన అన్యాయాన్ని వారు ఏకరువు పెట్టారు. వారంతా ఏకమయ్యారు. ఆజేయుడు "ఇకపై మీరు సామాంతులు కాదు. విజయగజపతిని తరిమి కొడదాం. ఎవరి రాజ్యాలు వారే పరిపాలించుకుందాం. ఎవరికి ఎవరూ సామంతులు కాదు" అని ఉపదేశించి రెచ్చగొట్టాడు.

సామంతులంతా మరుగుజ్జువాడైనా సరే యుక్తిపరుడైన అజేయుడే తమ నాయకుడని ప్రకటించారు. అందరూ ఒక్కటై మూకుమ్మడిగా విజయగజపతి పై తిరుగుబాటు చేసారు. తాను వేసిన మంత్రం తనకే చుట్టుకుందని గ్రహించిన విజయగజపతి తన సేనలతో శాండిల్యపురం కోటవదిలి పారిపోయాడు.

అజేయుడు తన అన్నలను విడిపించాడు. తన ముగ్గురు తల్లులను తీసుకుని తమ కోటలోకి తిరిగి ప్రవేశించాడు. మరుగుజ్జువాడైనా వంశకీర్తిని ఇనుమడింపచేసిన గొప్ప కుమారుడిని కన్నావని సునేత్రి, సుగాత్రి తమ చెల్లెలు మైత్రిని అభినందించారు. ఆమెను, అజేయుడిని అవహేళన చేసిన వారంతా క్షమాపణలు చెప్పుకున్నారు. జయవర్మ, విజయవర్మ కూడా తమ రాజ్యానికి రాజు కాబోయే అర్హత అజేయుడికే ఉందని ప్రకటించారు.

అజేయుడు సామంతులందరినీ సమావేశపరిచి "ఇకపై మనమంతా ఒకరికొకరం సహకరించుకుంటూ స్వతంత్రంగా పరిపాలించుకుందాం" అని ప్రకటించాడు. అందరూ అతడిమాటకు అంగీకరించారు.

ఆవిధంగా మరుగుజ్జువాడైనా చేతిలో సైన్యం లేకపోయినా కేవలం సంకల్పబలంతో అన్నింటినీ సిద్దించుకున్నాడు అజేయవర్మ అని ఆ కథను ముగించాడు గోపన్న.

ఆ కథను విని విక్రముడు కొండంత ధైర్యం తెచ్చుకున్నాడు. "గోపన్న తాతా, నాకు సరైన మార్గాన్ని ఉపదేశించావు. నాలో ధైర్యాన్ని నింపావు. ఇప్పుడు నాలో ఉత్సాహం ఉరకలేస్తుంది. భయం, నిస్తేజం నానుండి తొలగిపోయాయి. జరగవలసింది జరిపించుదాం పదండి" అని ఉత్సాహంగా చెప్పాడు విక్రముడు. అందరూ అగ్రహారానికి తిరుగు ప్రయాణమయ్యారు.

“లెక్కలు నేర్పవమ్మా యశోద

నీ ముద్దుల కన్నయ్యకు

అంపకాలు చేసే లెక్కలు నేర్పు

ఈ గడసరి కిట్టయ్యకు

అయిదే ఊళ్ళు చాలంటాడు

కాదంటేనే కయ్యమంటాడు

ఆయుధం పట్టని సాయమంటాడు

ఏం కావాలో కోరమంటాడు

లెక్కలు నేర్పవమ్మా యశోద

నీ ముద్దుల కన్నయ్యకు

అంపకాలు చేసే లెక్కలు నేర్పు

ఈ గడసరి కిట్టయ్యకు

చీకటి చిక్కపడింది. అగ్రహారమంతా నిద్రలో ఉంది. గోపన్నకు నిద్రపట్టలేదు. అతని మనస్సులో అనేక ఆలోచనలు తిరుగుతూ నిద్రకు అవకాశం ఇవ్వటం లేదు. కాపలా తిరుగుతున్న యువకల సంచారం తప్ప మరే అలికిడి లేదు. గోపన్న మాత్రం ఎవరికోసమో ఇంకా ఎదురు

చూస్తునే ఉన్నాడు. సరిగ్గా అప్పుడు కాపలా కాస్తున్న యువకులకు దూరంగా ఊరి చివర రెండు దివిటీలు కనిపించాయి. వెంటనే యువకులంతా అప్రమత్తమయ్యారు. చప్పున బాణాకర్రలందుకుని ఆ దివిటీలు కనిపించిన వైపు కదిలారు. అందరికంటే కాస్త ముందు కదులుతున్న యువకుడు "ఎవడ్రా వాడు, ఈ రాత్రి పూట. దొంగతనానికి గాని దారి తప్పొచ్చారేమొ. ఈ మల్లన్న దెబ్బ పది మండలాల్లో చెప్పుకుంటారు. వినలేదేటొరేయ్" అని అరుస్తూ ముందుకి ఉరికాడు.

దగ్గరగా వచ్చాక ఆ దివిటీలు పట్టుకున్న ఇద్దరినీ చూసి అందరూ గొల్లుమన్నారు. వాళ్ళిద్దరూ అగ్రహారం యువకులే. పట్టణంలో సంత గొడవలో చెఱసాలలో వెయ్యబడిన వాళ్ళు. వాళ్ళిద్దరూ నవ్వుతూ "అవునొరేయ్ మల్లన్న నీ దెబ్బ మాగొప్పదని అన్ని మండలాల్లో చాటింపేసే వత్తన్నాంరా" అన్నారు. "ఆహా అత్తగారింటి ముద్దు ముగిసిపోయిందేటొరే అప్పుడే అగ్రహారంలో దిగడిపోయారు" అని నవ్వాడు మల్లన్న. అలా అందరూ పరాచికాలాడుకుంటూ గోపన్న ఇంటికి చేరుకున్నారు

ఆ అలికిడి విని గోపన్న బయటకు వచ్చాడు. ఆ యువకులు చెఱసాలకు వెళ్ళిన నాటి నుండి వారి రాకకోసం ఎదురుచూస్తున్న ఆతృత గోపన్న కళ్ళలో కనపడింది. వాళ్ళు గోపన్న కు దండాలు పెట్టి, రొంటిలో దోపుకున్న ఒక కొయ్యముక్కను తీసి గోపన్నకు ఇచ్చారు. ఆ కొయ్యను పరీక్షగా చూసిన గోపన్నకు ఒక చిన్న రంధ్రం కనిపించింది. ఆ రంధ్రం నుండి బయటకు వ్రేలాడుతున్న ఒక సన్నని దారాన్ని ఒడుపుగా లాగితే ఆ చెక్క ముక్కలో నుండి ఒక పలుచని లేఖ బయటపడింది. మంత్రిగారితో మాట్లాడే అవకాశం తమకు దొరకలేదని, తాము చెఱసాలకు వచ్చిన సంగతి తెలుసుకున్న మంత్రిగారే ఈ చెక్కను మాత్రం పంపారని చెప్పారు ఆ యువకులు. గోపన్న ఆ లేఖను అందుకుని రాకుమారుల విడిది వైపు నడిచాడు. యువకులంతా అతడిని అనుసరించారు.

గోపన్న రాకుమారుల విడిది వద్దకు చేరుకునే సమయానికి చిన్నవాళ్ళిద్దరూ నిద్రలో ఉన్నారు. విక్రముడు మాత్రం ఆలోచనలో నిద్ర లేకుండా తోటలో తిరుగుతున్నాడు. గోపన్నను అతని వెంట వచ్చిన యువకుల్ని చూసి గుమ్మంలోకి వచ్చాడు. గోపన్న ఆ లేఖని విక్రముడికి అందించాడు. ఆ లేఖపై ఉన్న తమ రాజచిహ్నాన్ని చూస్తూనే మంత్రిగారి సందేశమని గ్రహించాడు విక్రముడు. ఆ లేఖలో విషయం క్లుప్తంగా, రహస్యంగా ఉంది.

"రాబందు గుడ్డు పగలగొట్టింది. చందమామని మింగేసింది. మిగిలింది పెంకులే"

ఈ ఒక్క వాక్యం మాత్రమే అందులో ఉంది. మంత్రిగారి పంపిన ఈ సందేశంలో ఉపయోగపడే రహస్యమేదో ఖచ్చితంగా ఉంటుంది అని విక్రముడికి తెలుసు. అయినా అతడికి ఆ వాక్యంలో మర్మం ఎంత ఆలోచించినా బోధపడలేదు.

కాస్త ఆలోచించిన పిమ్మట గోపన్నకు కాస్త స్ఫురించింది. విక్రమునికి తన ఆలోచన చెప్పాడు. రాబందు అంటే మన శత్రువు భైరవవర్మ, పగిలిన గుడ్డు మన కళింగ సామ్రాజ్యం.

"మరి ఈ చందమామ, పెంకులు దేని గురించి?" అని అడిగాడు విక్రముడు.

"రాకుమారా, కళింగ చుట్టూ అనేక చిన్న చిన్న రాజ్యాలున్నాయి. వాటిని మీ ఏలుబడిలో మీ సామంతులే పరిపాలించేవారు. అవన్నీ తెల్లని పాలరాతి కోటలు. కళింగకు మధ్యలో ఉన్నవి మాత్రమే సువర్ణమయమైన తాపడాలతో విరాజిల్లే సౌధాలు. మంత్రిగారు చెప్ప దలచిన రహస్యం కళింగ సరిహద్దుల్లో ఉన్న సామంతులు మాత్రమే విశ్వసించదగినవారు అని" తన ఆలోచన చెప్పాడు గోపన్న.

"ఇప్పుడు మనం చెయ్యాలో చెప్పండి గోపన్న తాత" అని అడిగాడు విక్రముడు. "సమయం ఆసన్నమయ్యింది నాయనా. మనం శత్రువును ఎదిరించేందుకు సిద్దపడాలి. ముందుగా మంత్రిగారి సందేశం ప్రకారం, ఆ సరిహద్దు రాజ్యాలను సందర్శించి వారి సహాయాన్ని పొందాలి" అని విశదీకరించాడు గోపన్న.

విక్రముడి మదిలో అనేక అనుమానాలు మొదలయ్యాయి. "గోపన్నతాతా, కేవలం మన ఆలోచనే ఆధారంగా సరిహద్దు సామంతులు మన పక్షమే అని నమ్మి మనంతట మనమే వెళ్ళి మన రహస్యాలు ప్రకటిస్తే అది మనకు ప్రమాదం కాదా? మన ఆలోచన లేదా మంత్రిగారి వర్తమానం నిజం కాక వారు శత్రువు పక్షమే అయితే మనం కోరి కష్టాలను తెచ్చుకున్నట్టే కదా" అని అడిగాడు విక్రముడు

గోపన్న అతడిలో చెలరేగుతున్న అనుమానాలను, ఆలోచనలను శాంతపరచేందుకు శ్రవణుడి కథ చెప్పాలనుకున్నాడు. అందరినీ తన దగ్గరకే వచ్చి కూర్చోమని చెప్పాడు.

గోపన్న చెప్పిన శ్రవణుడి కథ:

శ్రవణుడు అనే బాలుడికి ఊహ తెలిసేప్పటికి ఒక అడవిలో నివసించేవాడు. అతడికి తల్లిదండ్రులు లేరు. ఒక ముదసలి బామ్మ మాత్రం ఉండేది. ఆ అడవిలో ఉండే జంతువులు, మనుషులు అందరూ బామ్మ మాట వినేవారు. వయస్సు మళ్లిన బామ్మకు, ఆమె దగ్గరే ఉన్న శ్రవణుడికి కావాల్సిన ఆహారం, బట్టలు అన్నీ ఆ అడవిలో ఉండే వాళ్ళు అందించేవారు.

శ్రవణుడు మెల్లగా పెరిగి పెద్దవాడయ్యాడు. పెద్దయిననాటి నుండీ అతడికి అనేక సందేహాలు రావటం మొదలయ్యాయి. బామ్మను తన సందేహాలతో వేధించేవాడు. "బామ్మా నేనెవరి కొడుకుని? నా తల్లిదండ్రులెవరు? ఎందుకు మనం ఇలా అడవిలో నివసిస్తున్నాం" అని నిత్యం ప్రశ్నలతో బామ్మను వేధించేవాడు. బామ్మ ప్రతి ప్రశ్నకూ నవ్వేస్తూ "సమయం వచ్చినప్పుడు నేనే చెబుతా" అంటూ ఉండేది.

ఒకరోజు శ్రవణుడు బామ్మ దగ్గరకొచ్చి "బామ్మ నాకు మల్ల విద్య నేర్చుకోవాలని ఉంది" అని అడిగాడు."మల్ల విద్య అంటే కష్టమేనే" అని బాగా ఆలోచించిన బామ్మ "అడవి మధ్యలో ఉండే కోతుల గుహకు వెళ్ళు, నీకు నేర్చుకోవాలనే శ్రద్ధ ఉంటే ఆ కోతులే నేర్పుతాయి" అని చెప్పింది. కోతులు మల్లవిద్య నేర్పటమేంటో శ్రవణుడికి అర్ధం కాలేదు. సరే బామ్మ చెప్పింది కదా వెళ్ళి చూద్దాం అని అడవిలోకి బయలుదేరాడు.

అడవి మధ్యలో ఉండే ఆ కోతుల గుహకు చేరుకోగానే గుంపులు గుంపులుగా కోతులున్నాయి. అన్నీ ఒక చెట్టు మీద నుండి మరో చెట్టు మీదకి ఎగిరుతున్నాయి, క్షణాల్లో ఇటు నుండి అటు చుట్టి వచ్చేస్తున్నాయి. అన్ని కోతులను ఒకేసారి చూసి శ్రవణుడు భయపడ్డాడు. అయినా బామ్మ ఏం చెప్పినా నా మంచికే చెబుతుంది అని నమ్మకంతో ఆ గుహలోనికి వెళ్ళాడు. గుహ మధ్యలో ఒక పెద్ద కోతి కూర్చుని ధ్యానం చేసుకుంటుంది. శ్రవణుడికి ఆ కోతిని చూడగానే హనుమంతుడు గుర్తొచ్చి ఆ కోతి ముందు మోకరిల్లాడు. ఆ కోతి కళ్ళు తెరిచి చూడగానే శ్రవణుడు తన బామ్మ పంపితే వచ్చానని, మల్లవిద్య నేర్చుకోవాలని ఉందని చెప్పాడు.

ఆ కోతి "నా వెంటే వచ్చి నేర్చుకో" అని చప్పున చెట్టు మీదకి ఎక్కేసింది. శ్రవణుడికి ఆ చెట్టెక్కటానికి చాలా సమయం పట్టింది. శ్రవణుడు చెట్టు మీదకి చేరుకోగానే ఆ కోతి పక్క చెట్టు మీదకి దూకింది. శ్రవణుడి మల్లవిద్య నేర్చుకోవటానికి మరోమార్గం లేదు. ఆ కోతిని తిట్టుకుంటూ ఆ పక్క చెట్టు మీదకు దూకేందుకు ప్రయత్నించాడు. పట్టుతప్పి పడబోయిన శ్రవణుడిని ఆ కోతే కాపాడింది. రోజు ఇలా కోతి చేష్టలన్నీ చేయించి శ్రవణుడికి దేహధారుడ్యం పెరిగేలా చేసింది.

శక్తివంతుడిగా మారిన శ్రవణుడికి మల్లవిద్యారహస్యాలు భోదించింది. నిత్యం దీక్షగా నేర్చుకున్న శ్రవణుడు అనతికాలంలోనే మల్లవిద్యలో నిష్ణాతుడయ్యాడు. తను కోరిన విద్యను ప్రసాదించిన ఆ కోతికి అనేక విధాలుగా కృతజ్ఞతలు చెప్పి, తిరిగి తన బామ్మ వద్దకు వచ్చాడు.

మరికొన్నిరోజులు పోయాక శ్రవణుడు బామ్మ దగ్గరకు వచ్చి, బామ్మా నాకు యుద్ధవిద్యలు నేర్చుకోవాలని ఉంది అని అడిగాడు. "అమ్మో యుద్ధవిద్యలే" అని కాసేపు ఆలోచించిన బామ్మ "తూర్పు వైపుగా వెళ్ళు అక్కడ జాంబకోన ఉంటుంది. అక్కడ ఒక ఎలుగు చీకటిగుహలో ఉంటుంది. దానిని కలిస్తే నీకు యుద్ధవిద్యలు నేర్పుతుంది" అని చెబుతుంది.

బామ్మ చెప్పినట్టే నాకు కోతి మల్లవిద్య నేర్పింది కాబట్టి, ఇది కూడా బామ్మ చెప్పినట్టే జరుగుతుంది అని నమ్మి బామ్మ దగ్గర సెలవుతీసుకుని బయల్దేరాడు. అడవిలో ఎంతో దూరం వెళ్ళాక శ్రవణుడికి జాంబకోన కనిపించింది. వెతగ్గా వెతగ్గా అతడికి ఒక పాడుబడిన గుహ కనిపించింది. ఆ గుహ మొదట్లో ఒక పెద్ద బండరాయి ఉంది. అక్కడే శ్రవణుడు తిరుగుతుంటే గుహ లోపల నుండి "ఎవరు నువ్వు? ఏం పని మీదొచ్చావ్?" అనే గొంతు గుహ నుండి వినిపించింది.

శ్రవణుడు తనకు యుద్ధవిద్యలు నేర్చుకోవలని ఉందని, తన బామ్మను అడిగితే ఇక్కడకు పంపిందని చెబుతాడు. శ్రవణుడు తనకు యుద్ధవిద్యలు నేర్చుకోవాలని ఉందని, తన బామ్మను అడిగితే ఇక్కడకు పంపిందని చెబుతాడు. నేను వెతుకుతున్న ఎలూ మీరే అనుకుంటా నాకు మీరు యుద్ధవిద్యలు నేర్పిస్తారా అని అడిగాడు శ్రవణుడు.

దానికి ఆ ఎలుగు "దానికేం భాగ్యం తప్పకుండా నేర్పిస్తా, కానీ మొదట ఈ గుహకు అడ్డంగా ఉన్న రాయిని తొలగించు" అని అడిగింది. ఆ రాయిని కదిపేందుకు ఎంతో కష్టపడ్డాడు శ్రవణుడు. అతడి దీక్ష,చిత్తశుద్ది గ్రహించిన ఎలుగు అనేక అస్త్రశస్త్రాలతో కూడిన యుద్ధవిద్యలు నేర్పించింది. శ్రవణుడు తను కోరిన యుద్ధవిద్యలు నేర్పినందుకు ఆ ఎలుగుకి అనేక కృతజ్ఞతలు చెప్పి తిరిగి బామ్మ వద్దకు వచ్చాడు.

అన్ని విద్యలనూ అభ్యసించి వీరుడిగా రూపుదిద్దుకున్న శ్రవణుడిని చూసి బామ్మ సంతోషించి "నాయన ఎంతో కాలంగా దాచిన నీ రహస్యాన్ని చెబుతున్నా విను. ఈ అడవికి పది యోజనల దూరంలో ఉన్న శ్రీచక్రపురం మన ఊరు. నీ తండ్రి గొప్ప మహరాజు. దాయాదులతో జరిగిన యుద్ధంలో నీ తల్లిదండ్రులిద్దరూ అస్తమించారు. నేను నిన్ను కోట నుండి తప్పించి తీసుకుని వచ్చి ఇక్కడే పెంచాను. ఇప్పుడు నువ్వు శక్తిమంతుడవు, బుద్దిబలం కలవాడివి నీ రాజ్యాన్ని నువ్వు తిరిగి సంపాదించుకో అని చెప్పింది.

శ్రవణుడు తన జన్మరహస్యం తెలియటం తోనే ఉత్సాహంతో ఊగిపోయాడు. బామ్మ పాదాలకు నమస్కరించి శ్రీచక్రపురం పై దండెత్తి వెళ్ళాడు. తను నేర్చుకున అస్త్ర,శస్త్రాలతో, ధ్వంధ్వయుద్దాలతో ఎన్నో రోజుల పోరాడి శ్రీచక్రపురాన్ని తిరిగి చేజిక్కించుకున్నాడు శ్రవణుడు.

ఆ కథ చెప్పటం ముగించిన గోపన్న "చూసావ నాయన, క్రూర జంతువులని భయపడి ఉంటే శ్రవణుడు జయించేవాడా? నీవు కూడా సందేహాలు వీడు. మహామంత్రి గారి మాటపై విశ్వాసం ఉంచి, నీ మేలు కోరు రాజ్యాలన్నింటినీ కలుపుకో" అని చెప్పాడు. విక్రముడు తన సందేహాలు వీడి, తన కర్తవ్యం పై దృష్టినిలిపాడు. గోపన్నతో తన ప్రయాణసన్నాహకాలు చేయమని కోరాడు.

ఆరోజుకి అందరిని విశ్రాంతి తీసుకోమని చెప్పి గోపన్న తన ఇంటి వైపు సాగాడు.

"నీ అండ చేరితే

కొండనైనా ఎత్తి కాపుకాస్తావు

నీ తోడు కోరితే

బండి నడిపి దరికి చేర్చేవు

నల్లనయ్యా ఓ చల్లనయ్యా

నీ నామ జపమే మా ఇంట చెల్లునయ్యా"

"రాబందు గుడ్డు పగలగొట్టింది. చందమామని మింగేసింది. మిగిలింది పెంకులే"

మంత్రిగారు పంపిన రహస్య సందేశాన్ని ఆ రాత్రి పూట చలిమంటల వెలుగుల్లో చదువుకుంటున్నాడు విక్రముడు. అపటికే అతడు గూడేన్ని వదిలి పక్షం రోజులు గడిచింది. సరిహద్దు రాజ్యాలను పరిపాలిస్తున్న సామంతులను కలిసేందుకు మారువేషంలో బయల్దేరాడు. తన తమ్ములను అగ్రహారంలోనే వదిలి వచ్చిన బెంగ అతడి మనసులో మెదులుతూనే ఉంది. గోపన్న రక్షణలో ఉన్నారనే ఊరట అతడి బెంగను తగ్గిస్తూ ఉంది. అవే తలపులతో తన శిబిరంలోకి వెళ్ళి పానుపు పై మేను వాల్చాడు.

నిత్యం ప్రయాణాలు చేయటం వలన కలిగిన శరీర శ్రమకి తోడు, మదిలో మెదిలే అనేక ఆలోచనల వలన కలిగిన వత్తిడి వలన అతడికి శిరోభారంగా ఉంది. ఆ బాధలోనే మగతనిద్రలోకి జారుకున్నాడు. శిరోభారం వలన కలవరిస్తూ ఉన్నాడు. అతడికి నిద్రలో ఒక స్వప్నం సాక్షాత్కారమయ్యింది. మేఘాల తునకలా ఆకాశంలో మంద్రంగా సాగుతున్న ఒక విమానం కనిపించింది. దవళకాంతులతో విరాజిల్లుతున్న ఆ దేవవిమానానికి రెండు తెల్లని హంసలు పూన్చబడి ఉన్నాయి. లోకోత్తర సౌందర్యంతో, మణిమయకాంతులతో మెరిసిపోతున్న ఒక దేవకాంత ఆ విమానంలో నిలబడి, తన మనోభీష్టంతో ఆ విమానాన్ని నడుపుతోంది. ఆ విమానంలో తెల్లని వస్త్రాలతో ప్రశాంత చిత్తులై ఆసీనులై ఉన్న

సుకేతుడు,సుమతి కనిపించారు. వారి వదనంలో ప్రశాంతత, చిరునవ్వులో ప్రసన్నత ఆ స్వప్నాన్ని వీక్షిస్తున్న విక్రముడిని తాకాయి. అతడి శిరోభారం మంత్రం వేసినట్టుగా మాయమయ్యింది. కలవరింతలు ఆపి విక్రముడు ఆ స్వప్నంలో లీనమయ్యాడు.

ఆకాశమార్గంలో సాగుతున్న ఆ విమానం నుండి చిరునవ్వుతో ఆ దేవకాంత తననే చూస్తుందేమో అనే భావన కలిగింది విక్రమునికి. ఆదే నిజమన్నట్టు ఆ దేవకాంత ఆ విమానాన్ని విక్రముడున్న శిబిరం వైపుకు మళ్ళించింది. విక్రముడు అబ్బురపడుతూ చూడసాగాడు. ఆ విమానం శిబిరం వద్దనే నేలకు దిగింది. సుకేతుడు, సుమతి ఆ విమానం దిగి శిబిరంలోకి వచ్చారు. సుమతి తన బిడ్డ తలను ఒడిలో ఉంచుకుని తల నిమరసాగింది. ఎన్నో రోజులుగా కలిగిన శారీరక శ్రమ, మానాసిక ఒత్తిడి మెల్లగా అతడిని వీడిపోయాయి. భారమంతా తొలగి అతడి శరీరం తేలికపడింది. ఉత్సాహం, ఉత్తేజం అతడిలో ప్రవేశించాయి. తండ్రి సుకేతుడు వచ్చి నిద్రిస్తున్న విక్రముని పక్కనే కూర్చున్నాడు.

"కుమారా, మన వంశంలో పట్టాభిషిక్తుడు కాబోయే వారసుడు మండలం రోజులపాటు వ్యాఘ్రేశ్వరస్వామి దీక్ష తీసుకునే ఆచారం ఉంది. దైవసంకల్పమైన ఈ బ్రహ్మముహూర్తంలో ఒక తండ్రిగా, కళింగ చక్రవర్తిగా ఈ దీక్షను నీకు ఉపదేశిస్తున్నాను. నేటి నుండి నీవు మండలం రోజులపాటు ఈ దీక్షను ధరించి ఉండాలి" అని చెప్పి విక్రముని చేతికి ఒక కంకణాన్ని కట్టాడు సుకేతుడు. తన మెడలో ఉన్న వ్యాఘ్రేశ్వరస్వామి మాలను తీసి కుమారుని మెడలో వేసాడు. సువర్ణమయమై గొప్పకాంతితో ప్రకాశిస్తున్న ఒక ఖడ్గాన్ని అతడి చేతిలో ఉంచాడు. దీక్షనియమాలను, మూలమంత్రాన్ని అతడి చెవిలో ఉపదేశించి శాస్త్రోక్తంగా విక్రమునికి దీక్షనిచ్చాడు.

విక్రముడు తన తండ్రి ఉపదేశించిన మూలమంత్రాన్ని మననం చేసుకుంటూ కలవరించసాగాడు. తామొచ్చిన కార్యం ముగిసినదనే తృప్తితో సుకేతుడు, సుమతి లేచి తిరిగి విమానం వైపు సాగారు. విమానం ఆకాశంలోకి లేచి అలానే ముందుకు సాగిపోయింది. విక్రముడు చప్పున కళ్ళు తెరచి చూసాడు. తన ఎదురుగా ఎవరూ కనపడలేదు. స్వప్నభ్రాంతి అనుకుంటూ తిరిగి నిద్రకు ఉపక్రమిస్తున్న విక్రముడు తన చేతికి ఉన్న కంకణాన్ని గమనించాడు. పానుపు పై ఉన్న ఖడ్గాన్ని చూసాడు. తన మెడలో ఉన్న వ్యాఘ్రేశ్వరస్వామి మాలను పరిశీలించాడు. అంతవరకూ తను కన్నది స్వప్నం కాదని అవగతమయ్యింది. దైవానుగ్రహమని, తన తల్లిదండ్రుల సాక్షాత్కారమని తెలుసుకొన్నాడు.

తన తండ్రి ఉపదేశించిన మంత్రాన్ని జపిస్తూ, దీక్ష నియమాలను అనుసరించి కటికనేలపై నిదురించాడు. ఉదయాన్నే లేచి సంధ్యావందనం ముగించుకుని నారవస్త్రాలు ధరించాడు. నుదుటిపైన విభూది పూసుకున్నాడు. విక్రమునితో పాటుగా వచ్చిన గోపయువకులు అతడిలో వచ్చిన మార్పు గమనించి ఆశ్చర్యానికి లోనయ్యారు. అతడి మొహంలో ఇది వరకెన్నడూ చూడని కొత్తకాంతి వారు గమనించారు. అగ్రహారానికి వచ్చిననాటి నుండి దిగులు మొహంతో, నిస్పృహతో ఉంటూ వచ్చిన విక్రమునిలో కొత్త ఉత్సాహం తొణికిసలాడుతోంది. అతడి వదనం ఎంతో ప్రసన్నంగా ఉంది. విక్రముడిలోని ఆ మార్పుకి అందరూ సంతోషించారు. తమ ప్రయాణం జయప్రదమవ్వబోతున్నదనే సంకేతం వారికి విక్రముడిలో కనిపించింది.

అక్కడ కళింగరాజ్యంలో చెరసాలలో బందీలుగా ఉన్న మంత్రి,సామంతులు తమ అనుచరగణంతో సహా చాకచక్యంగా తప్పించుకుని గోతీర్థం వైపుగా సాగారు. బందీలు చెరసాల నుండి తప్పించుకున్నారన్న విషయం తెలుసుకున్న భైరవవర్మకు గుండెల్లో గుబులు మొదలయ్యింది. కళింగ చేతికి చిక్కినా, సుకేతుని వారసుల జాడ ఇంతవరకూ చిక్కలేదనే ఆందోళన అతడిలో నిత్యం రగులుతూనే ఉంది. దానికి ఈ బందీలు

తప్పించుకుపోయిన సంఘటన ఆజ్యం పోసింది. తిరుగుబాటు తప్పదనే భయంతో పటిష్టమైన సైన్యాన్ని సిద్ధంచేసి బందీలు తప్పించుకున్న దిక్కుగా ఆ సైన్యాన్ని పంపాడు. దొరికినవారిని దొరికినట్టుగా వధించమని చెప్పి మరీ పంపాడు.

గోతీర్థం చేరుకుని మంత్రి గోపన్నను కలిసాడు. విక్రముడు సరిహద్దు రాజ్యాలకు ప్రయాణమయ్యాడని తెలుసుకుని సంతోషించాడు. విక్రముడు తిరిగి వచ్చేంతవరకూ అక్కడే రాకుమారులకు రక్షణగా ఉండేందుకు మంత్రి నిర్ణయించాడు. ఇన్ని రోజులుగా చెరసాలలో బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకు బ్రతికిన పరివారమంతా ఆరోజు హాయిగా సేదతీరింది. ఉదయాన్నే వారికి భైరవుడు తమ కోసం సేనలను పంపిన వార్త చేరింది. అందరిలోనూ ఆందోళన మొదలయ్యింది.

"గోపన్నా, మా ఉనికి కారణంగా నేడు మీ అగ్రహారానికి ఆపద రానున్నది. ఆ భైరవుని సేనలు వచ్చి మీ అగ్రహారాన్ని నాశనంచేయక తిరిగిపోదు. రక్షణ కల్పించిన మీకు ముప్పు తెచ్చిపెట్టే కంటే మేమే వెళ్ళి లొంగిపోతాం" అని గోపన్నతో చెప్పాడు మంత్రి.

"మంత్రిగారూ, మా కులదైవం కిట్టయ్య సాక్షిగా నాటి నుండి నేటి వరకూ ఆశ్రయించిన వారిని విడిచిపెట్టటం గోపకులం ఎరుగదు. చావుపుట్టుకలు దైవలీలలు, చావుకి భయపడి ఈ ముక్కు పచ్చలారని పసికందులను శతృవుకి విడిచిపెట్టటం కల్ల." అని ఖచ్చితంగా తన అభిప్రాయాన్ని ప్రకటించాడు గోపన్న. అగ్రహారమంతా ముక్తకంఠంతో "అవును అవును" అని గోపన్న నిర్ణయాన్ని బలపరిచారు.

"మరి ఈ ఆపద గట్టెక్కేదెలా?" అని అడిగాడు మంత్రి.

నా వెంటే అందరూ రండి అని చెప్పాడు గోపన్న. అందరూ గోపన్న వెంటే నడిచారు. అందరూ అనుసరిస్తుండగా గోపన్న నదీతీరానికి చేరుకున్నాడు. అక్కడున్న వారందరికీ నది మధ్యలో ఉన్న ఒక కొండను చూపించాడు. "అందరూ శ్రద్ధగా ఆలకించండి. ఆ కనిపిస్తున్న కొండపేరు గోవర్ధనగిరి. నది మధ్యలో ఉండే ఆ కొండను మనం చేరుకోవాలి. అదే మనకు సరైన స్థావరం. ముందుగా మనం అక్కడకు చేరుకుని సిద్ధంగా ఉండాలి. శత్రువు మన జాడ కనిపెట్టి అక్కడకు చేరుకునే ప్రయత్నం చేసినా, నదిలో వచ్చే వారిని మనం పై నుండే సులువుగా మట్టుపెట్టగలం" అని చెప్పాడు గోపన్న. అప్పటికప్పుడు అందరూ అక్కడికి చేరుకునేందుకు తెప్పలను తయారు చేయించాడు.

తెప్పలన్నీ సిద్దమయ్యాక గోతీర్థం అగ్రహారమంతా గొడ్డుగోదాములతో సహా గోవర్ధనగిరికి ప్రయాణమయ్యారు. బలిష్టమైన యువకులు నాలుగు వైపులా నిలబడి నడపగా తెప్పలన్నీ గోవర్ధనగిరిని చేరాయి. గోపన్న ఆ తెప్పలను భద్రంగా ఒడ్డుకి చేర్పించాడు. స్త్రీలు, వృద్ధులు, పసివారు సురక్షితంగా ఉండేందుకు గిరి పైన ఉన్న గుహలాంటి ప్రదేశంలో ఏర్పాట్లు జరిగాయి. గోపయువకులు, మంత్రి సహా సైన్యం ఆ కొండపై అంచలంచెలుగా వ్యూహాత్మకంగా రక్షణగా నిలిచారు.

గోతీర్థాన్ని చేరిన భైరువుని సైన్యానికి నిర్మానుష్యమైన ఆ అగ్రహారాన్ని చూసి ఆశ్చర్యం కలిగింది. ఎంతగాలించినా పశుపక్ష్యాదులతో సహా ఒక్క ప్రాణి కూడా ఎదురవలేదు. నిరాశతో వెనుదిరుగుతున్న ఆ సేనావాహినికి అగ్రాహారమంతా మూకుమ్మడిగా కదిలి వెళ్ళటం వలన ఏర్పడిన ఆనవాళ్ళు నేలపై కనిపించాయి. గోవుల వ్యర్థాలు, మనుషుల అడుగుజాడలు వారికి దారి చూపాయి. వాటిని అనుసరిస్తూ నదీతీరానికి చేరుకుంది భైరవుని సైన్యం. దూరంగా ఉన్న కొండపై కనిపిస్తున్న వెలుగు గమనించిన సైన్యం, అగ్రహారమంతా తరలి అక్కడికి చేరుకున్నారని అర్థమయ్యింది.

వారంతా ఆ రాత్రి ఆ నది ఒడ్డునే ఉండి నది దాటేందుకు కావాల్సిన సన్నాహాలు చేయసాగారు. ప్రభువైన భైరవునికి ఆ విషయం చేరవేసారు. సైన్యం చేస్తున్న సన్నాహాలన్నీ గోవర్ధనగిరి పైనుండి అందరూ చూస్తూనే ఉన్నారు. సైన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కొండపైకి రానివ్వకుండా ఉండేందుకు వ్యూహాలు పన్నుతూ ఉన్నారు. తెప్పలూ, పడవలూ సిద్దం కాగానే భైరవుని సైన్యం అంచలంచెలుగా కొండవైపుకు సాగారు.

ముందే సిద్దంగా ఉన్న మంత్రి, సైన్యం వాడైన బాణాలతో కొండకు దగ్గరగా వచ్చినవారిని వచ్చినట్టుగా మట్టుబెట్టారు. గోపయువకులు కూడా ఉత్సాహంతో పదునైన తమ ఈటెలను బలంగా విసిరి శతృవులను మట్టుబెట్టారు. అంచలంచెలుగా వెళ్ళటం వలన ప్రయోజనం లేదని, ఎవరూ చివరికి కొండను చేరుకోలేమని భైరవుని సేనలు గ్రహించాయి. అందరూ మూకుమ్మడిగా ఒక్కసారిగా తెప్పలనెక్కి కొండవైపుగా దూసుకురాసాగాయి. గోవర్ధనగిరిపై చూస్తే అందరి వద్దా బాణాలు, ఈటెలు నిండుకున్నాయి. సైన్యం చూస్తే ప్రచండవేగంతో దూసుకు వస్తుంది. అందరిలో ఆందోళన మొదలయ్యింది.

పరిస్థితిని గమనించిన గోపన్న స్త్రీలకు కబురుపెట్టి నూనె, నిప్పు తెప్పించాడు. ఆ కొండపై ఉన్న పెద్ద బండరాళ్ళకు నూనె పూసాడు. రాళ్ళను బలంగా గాళ్ళోకి విసిరేందుకు ముందుగానే ఏర్పాట్లు చేసి ఉంచారు. ఆ చెక్కలపై ఇప్పుడు రాళ్ళను చేర్చి నిప్పు పెట్టి గాలిలోకి విసరమని తన వ్యూహాన్ని వివరించాడు గోపన్న. ఆ రాళ్ళు సరాసరి వెళ్ళి శతృవుల తెప్పలపై పడ్డాయి. ఆ రాళ్ళ ధాటికి కొన్ని తెప్పలు ఛిద్రమయ్యాయి, కొన్నింటికి మంటలు అంటుకుని కాలిపోయాయి. భైరవుని సేనలు ఒక్కరొక్కరుగా ఆ నదిలో పడి మునిగిపోయారు. కొందరు నీళ్ళల్లో ఈదుకుంటూ తిరిగి ఒడ్డు వద్దకుపోయారు. విషయం ప్రభువులకు చెప్పేందుకు కళింగ దిక్కుగా సాగారు.

అగ్రహారం ప్రజలంతా ఆ విజయానికి ఎంతో సంతోషించారు. గోపన్న వ్యూహాలని, సమయస్ఫూర్తిని మహామంత్రి ఎంతగానో ప్రశంసించాడు. కాకపోతే పారిపోయిన భైరవుని సేనలు కళింగను చేరుకుని గొప్ప సైన్యంతో తిరిగి దాడికి తెగబడతాయని అతడిలో ఆందోళన మొదలయ్యింది.

విక్రముడు సరిహద్దురాజ్యమైన వైశాలి పట్టణాన్ని చేరుకున్నాడు. వైశాలి పట్టణ ప్రభువుని కలిసేందుకు సరాసరి కోటలోకి వచ్చిన విక్రముడిని చూచినా ఎవరూ ఆక్షేపణ చేయలేదు. వ్యాఘ్రేశ్వరస్వామి దీక్షానియమాలతో వసిస్తూ, నారవస్త్రాల్లో ఉన్న అతడిలో ఏదో ఆకర్షణ అందరినీ కట్టిపడేసింది. విక్రముడిని చూస్తూనే సాక్షాత్తు వైశాలి మహారాజు సింహాసనం దిగివచ్చి అతడిని ఆలింగనం చేసుకున్నాడు. విక్రమునితో వచ్చిన గోపయువకులకు అంతా అయోమయంగా ఉంది. జరుగుతున్న పరిణామాలన్నీ ఏదో కలలా అనిపిస్తోంది. విక్రముడు మాత్రం స్థిరంగా ఉన్నాడు. ఈ పరిణామాలన్నీ తన తండ్రి ఉపదేశించిన దీక్షానుగ్రహమని గ్రహించాడు. వైశాలి మహారాజు విక్రముని ద్వారా జరిగిన పరిణామాలాన్నీ తెలుసుకుని అతనికి సహాయం చేసేందుకు మాటిచ్చి, అతడి సైన్యాన్ని విక్రముని వెంట పంపాడు.

విక్రముడు ముప్పదిదినములలో ఎనమండుగురు రాజులను కలిసాడు. వారి సైన్యాలను కలుపుకున్నాడు. ఇప్పుడతని వెంట గొప్ప సేనావాహిని ఉంది. ఇక బృహత్కార్యం చేపట్టాల్సిన సమయం ఆసన్నమయ్యిందని గ్రహించిన విక్రముడు ఆ గొప్ప సైన్యాన్ని కళింగరాజ్యం వైపు నడిపించాడు.

భైరవుడు గోవర్ధనగిరి వద్ద జరిగిన పరాభవం తెలుసుకుని రగిలిపోయాడు. తన ఆదిపత్యం అంతం కానున్నదేమోననే ఆందోళన అతడిని కృంగదీసింది. వెనుక,ముందులు ఆలోచించకుండా తన సమస్త సైన్యాన్ని గోవర్ధనగిరి వద్దకు పంపించాడు భైరవుడు. సైన్యమంతా కోటను వదిలి గోవర్ధనగిరి వైపుగా సాగింది.

అరణ్యాన్ని కబలిస్తున్న దావాణలం వలే విక్రముడు కళింగ వైపుకు దూసుకు వస్తున్నాడు. భైరవునికి విక్రముడు గొప్ప సైన్యంతో వస్తున్న వార్త తెలిసింది. అతడికి జరగబోయేది అవగతమైనది. కానీ చివరి ప్రయత్నంగా తన సేనలను వెనక్కి తిరిగిరావాల్సిందిగా సమాచారాన్ని పంపాడు. నల్లని మేఘం ఆకాశాన్ని సొంతం ఆక్రమించినట్టుగా విక్రముడు తన సేనలతో కళింగను చుట్టుముట్టాడు. ప్రతిఘటించేందుకు సైన్యమే లేకపోవటం అతడికి ఆశ్చర్యాన్ని కలిగించింది.

సైన్యం ముందుగా కోటలోకి దూసుకుపోయి రహస్యమార్గం ద్వారా తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్న భైరవుడిని, అతడి పరివారాన్ని బంధించి తెచ్చి విక్రముడి ముందు పడేసారు. భైరవుని ద్వారా అతడి సైన్యం గోవర్ధనగిరి వైపు వెళ్ళిన సంగతి తెలుసుకున్న విక్రముడు తన అర్ధ సైన్యాన్ని వారిని నిలువరించేందుకు పంపించాడు. గోతీర్ధం చేరక ముందే భైరవుని సేనలని కలుసుకున్న విక్రముడి సైన్యం వారి రాజు బందీ అయిన వార్తను వారికి తెలియజేసింది. తమ ప్రభువే బందీ అయ్యాడని తెలియగానే ఆ సైన్య మనోస్థైర్యాన్ని కోల్పోయింది. వారంతటే వారే లొంగిపోయారు.

విక్రముడి సేనలు గోవర్ధనగిరి పైకి వార్తాహరుడిని రాజముద్రికనిచ్చి పంపి విక్రముడి విజయవార్త తెలియజేసారు. అగ్రహారం ప్రజలంతా ఆనందోత్సాహాలతో గోవర్ధనగిరిని వీడి గోతీర్ధం వైపు ప్రయాణమయ్యారు. మహామంత్రి గోపన్నను, రాకుమారులను వెంటబెట్టుకుని ఆ సైన్యం వెంట కళింగకు ప్రయాణమయ్యాడు.

శ్రీవ్యాఘ్రేశ్వరస్వామి దీక్షలో ఉన్న తాను హింసకు పాల్పడనని, శత్రువులను ప్రాణాలతో క్షమించి విడిచిపెడుతున్నానని ప్రకటించాడు విక్రముడు. భైరవుడిని అతడి పరివారాన్ని బంధవిముక్తలను చేసి విడిచిపెట్టాడు. ఆ రోజుతో అతడి మండలంరోజుల దీక్ష ముగిసింది. మంత్రి,గోపన్న,రాకుమారులు కూడా కళింగ చేరుకున్నారు. కత్తిదూయకుండానే, రక్తపాతం జరగకుండానే తన రాజ్యం తిరిగి తనకు దక్కటం తన తండ్రి ఆశీర్వాదమని గ్రహించాడు.

పట్టాభిషేకానికి మండలం ముందు అని తన తండ్రి చెప్పిన మాటల ప్రకారం, మండలం ముగిసింది. ఇదే అతన తండ్రి నిర్ణయించిన ముహూర్తమని గ్రహించి ఆ రోజే విక్రముడు పట్టాభిషిక్తుడయ్యాడు. ఇన్నిరోజులుగా తనకు, తన సోదరులకు ఆశ్రయం కల్పించటమే కాక తన వికాసానికి ఉపయోగపడే బోధలు కథల రూపంలో చెప్పిన గోపన్నకు నమస్కరించి ధన్యవాదాలు తెలిపాడు. తన తండ్రి చెప్పిన మాటలను, తన తండ్రి పరిపాలనా విధానాలను పాటిస్తూ, గోపన్న కథల సారాన్ని మనసులో నిలుపుకుని సోదరలతో సహా విక్రముడు కళింగను పదికాలాలపాటు చల్లగా పరిపాలించాడు.